www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఆదివారం | 15-12-2024 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 257 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం; తిథి: పౌర్ణమి మ. 2.31 తదుపరి పాడ్యమి; నక్షత్రం: మృగశిర రా. 2.20 తదుపరి ఆర్ద్ర; వర్జ్యం: ఉ.9.08-10.37; దుర్ముహూర్తం: సా.4.11-4.55; అమృతఘడియలు: రా.6.06-7.36; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 6.41; సూర్యాస్తమయం: 5.39 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



బడి.. పెట్టుబడి

- ఇది ఖర్చు కాదు.. భవిష్యత్తు తరాల నిర్మాణం
- బహుముఖ ప్రతిభకు కేంద్రాలుగా గురుకులాలు!
- విద్యకు మరిన్ని నిధులు
- చిల్కూరు సాంఘిక సంక్షేమ గురుకులంలో ఉమ్మడి డైట్ ప్లాన్ ప్రారంభంలో సీఎం

మాది బహుజన సర్కార్

- పథకాలతో బీసీలకే లబ్ధి
- ఎస్సీ వర్గీకరణపై వారంలో నివేదిక: రేవంత్

13

కుటుంబ పాలనలో రాజ్యాంగ దుర్వినియోగం

- నెహ్రూ నుంచి నాలుగో తరం వరకు అదే తీరు
- ఎమర్జెన్సీతో హక్కులను ఇందిర ఉల్లంఘించారు
- కాంగ్రెస్‌పై మోదీ ధ్వజం

2

పారాసిటమాల్‌తో జాగ్రత్త!

- వృద్ధులకు జీర్ణకోశ, గుండె, కిడ్నీ సంబంధిత సమస్యలు
- ఇంగ్లండ్ వర్సిటీ తాజా అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ, డిసెంబరు 14: మన దేశంలో సాధారణంగా చాలామంది కాస్త జ్వరంగా అనిపించినా, నొప్పులు ఉన్నా పారాసిటమాల్ మాత్రను వాడుతుంటారు. వైద్య నిపుణులు ఇన్నాళ్లూ దీన్ని ప్రభావవంతమైన, సురక్షితమైన ఔషధంగా పరిగణించారు. అయితే, వృద్ధులు ఈ మాత్రను వాడటం శ్రేయస్కరం కాదని తాజా అధ్యయనంలో తేలింది. 65 ఏళ్లు, ఆపై వయసు దాటినవారికి దుష్ప్రభావాలు కలిగే ప్రమాదం ఉందని పేర్కొంది. దీర్ఘకాలం పారాసిటమాల్ వాడటం వల్ల జీర్ణకోశ, గుండె, కిడ్నీ సంబంధిత సమస్యలు పెరిగే అవకాశముందని వెల్లడించింది. ఇంగ్లండ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ నాటింగ్‌హామ్‌కు చెందిన పరిశోధకులు ఆ దేశంలో చేసిన అధ్యయనంలో ఈ విషయాలు వెలుగు చూశాయి. పారాసిటమాల్‌తో వృద్ధుల్లో పెప్టిక్ అల్సర్ రక్తస్రావమయ్యే ప్రమాదం 24%, దిగువ జీర్ణాశయాంతర రక్తస్రావమయ్యే ప్రమాదం 36% ఉందని గుర్తించారు. అలాగే దీర్ఘకాల మూత్రపిండాల వ్యాధి బారిన పడే అవకాశం 19%, గుండె సంబంధిత సమస్యలు 9%, హైపర్ టెన్షన్ వచ్చే ప్రమాదం 7% ఉన్నట్లు పేర్కొన్నారు. తమ పరిశోధనలను నిర్ధారించడానికి తదుపరి పరిశోధన చేయాల్సిన అవసరముందని వెల్లడించారు. అధ్యయనంలో భాగంగా 6 నెలల్లో రెండు ప్రిస్క్రిప్షన్ల కంటే ఎక్కువ సార్లు పారాసిటమాల్ వాడిన 1.80 లక్షల మంది హెల్త్ రికార్డులను.. తరచుగా ఈ మాత్ర వాడని 4.02 లక్షల మంది హెల్త్ రికార్డులను పరిశీలించారు.

పూచీకత్తు లేకుండానే రైతులకు రూ.2 లక్షల వరకు రుణం


- రుణ పరిమితిని పెంచిన ఆర్బీఐ..గతంలో రూ.1.6లక్షలు

న్యూఢిల్లీ, డిసెంబరు 14: ఎలాంటి పూచీకత్తు లేకుండానే రైతులకు రుణాన్ని అందించే సదుపాయాన్ని ఆర్‌బీఐ పెంచింది. ఇంతకు మునుపు ఎలాంటి తనఖా లేకుండా రూ.1.6 లక్షల వరకు రుణం తీసుకునే వీలుండేది. ఇప్పుడు దాన్ని రూ.2 లక్షలకు పెంచింది. వచ్చేనెల(జనవరి) 1 నుంచి కొత్త నిబంధన అమల్లోకి వస్తుందని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. ద్రవ్యోల్బణం పెరుగుదల - పంటలకు రైతులు పెడుతున్న పెట్టుబడిని అంచనావేస్తూ.. ఆర్‌బీఐ ఈ పరిమితిని పెంచుతూ వస్తున్న విషయం తెలిసిందే..! 2004లో ఈ పరిమితి రూ.10 వేల వరకే ఉండేది. క్రమంగా ఈ పరిమితి పెరుగుతూ.. 2019 ఫిబ్రవరి నుంచి ఆ మొత్తం రూ.1.6 లక్షలకు చేరుకోగా.. ఇప్పుడు రూ.2 లక్షలకు పెరిగింది. ఆర్‌బీఐ తాజా నిర్ణయం ద్వారా రైతుల్లో 86% ఉన్న చిన్న, సన్నకారు రైతులకు ప్రయోజనం చేకూరుతుందని కేంద్ర వ్యవసాయశాఖ వెల్లడించింది.

ఆధార్ అప్‌డేట్ గడువు జూన్ 14వరకు పెంపు

న్యూఢిల్లీ, డిసెంబరు 14: ఉచితంగా ఆధార్ అప్‌డేట్ చేసుకునేందుకు గడువును వచ్చే ఏడాది జూన్ 14వ తేదీ వరకు పొడిగించారు. ఈ మేరకు ఉడాయ్ శనివారం ప్రకటన విడుదల చేసింది. మై ఆధార్ వెబ్‌సైట్ ద్వారా ప్రజలు ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవచ్చని తెలిపింది. జూన్ 14 తర్వాత ఆధార్ అప్‌డేట్ చేయాలంటే నిర్దిష్ట రుసుమును చెల్లించాల్సి ఉంటుంది. ఉచితంగా ఆధార్ అప్‌డేట్ గడువు ఇప్పటి వరకు డిసెంబరు 14గా ఉండగా.. తాజాగా దాన్ని పొడిగించారు.

బీజేపీ సీనియర్ నేత ఆడ్వాణీ ఆస్పత్రిలో చేరిక



న్యూఢిల్లీ, డిసెంబరు 14: బీజేపీ సీనియర్ నేత, మాజీ ఉపప్రధాని లాల్‌కృష్ణ ఆడ్వాణీ(97) అస్వస్థతతో ఢిల్లీలోని ఇంద్రప్రస్థ అపోలో ఆస్పత్రిలో చేరారు. ఆయన్ను ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నామని, ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉందని ఆ ఆస్పత్రి ఒక ప్రకటనలో వెల్లడించింది. రెండు రోజుల క్రితమే ఆయన్ను ఆస్పత్రిలో చేర్పినట్లు సన్నిహిత వర్గాలు తెలిపాయి. గత నెలలో 97వ జన్మదినం జరుపుకొన్న ఆయన కొద్ది నెలలుగా తరచూ అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు.

చాట్ జీపీటీ విమర్శకుడు సుచిర్ బాలాజీ మృతి

- అమెరికాలోని తన నివాసంలో అనుమానాస్పద మరణం



వాషింగ్టన్, డిసెంబరు 14: చాట్ జీపీటీ పట్ల తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసి వార్తల్లో నిలిచిన ప్రజావేగు, సాంకేతిక నిపుణుడు సుచిర్ బాలాజీ(26) అనుమానాస్పద పరిస్థితుల్లో మరణించారు. అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలోని తన నివాసంలో ఆయన విగతజీవిగా కనిపించినట్లు పోలీసులు ప్రకటించారు. వాస్తవానికి, గత నెల 26వ తేదీనే సుచిర్ మృతి చెందగా.. ఆ విషయం ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. సుచిర్ మరణానికి కారణమేమిటన్నది తెలియలేదు. అయితే, మృతి వెనుక ఏమైనా కుట్ర ఉందా అన్న దానికి ఎటువంటి ఆధారాలు లభించలేదని పోలీసులు తెలిపారు. కృత్రిమ మేధ అయిన చాట్ జీపీటీతో సంచలనం సృష్టించిన ఓపెన్ ఏఐ కంపెనీలో సుచిర్ నాలుగేళ్లపాటు పని చేశారు. చాట్ జీపీటీ రూపకల్పనలో కీలకపాత్ర పోషించారు. అది 2022లో విడుదలైన తర్వాత ఆయన.. తన అభిప్రాయాలు మార్చుకుని, ఓపెన్ ఏఐకి రాజీనామా చేశారు. చాట్‌జీపీటీ వంటి కృత్రిమ మేధో టెక్నాలజీల వల్ల ఇంటర్నెట్‌కు, సమాజానికి నష్టం జరుగుతుందని ఆయన బలంగా వాదించారు. ఈ క్రమంలోనే ఆయన ఆకస్మిక మృతి పలు సందేహాలకు తావిస్తోంది.

నీటి ప్రమాదాలతో గంటకు 30 మంది మృతి

న్యూఢిల్లీ, డిసెంబరు 14: ఆగ్నేయ ఆసియా దేశాల్లో నీటి ప్రమాదాల కారణంగా గంటకు 30 మంది మరణిస్తున్నారని డబ్ల్యూహెచ్‌వో తెలిపింది. 2021 ఏడాదికి సంబంధించిన నివేదికను డబ్ల్యూహెచ్‌వో శనివారం విడుదల చేసింది. ఆ ఏడాది నీట మునిగి ఆగ్నేయ ఆసియావ్యాప్తంగా 83 వేల మంది మరణించినట్లు పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా సంభవించే నీటి మరణాల్లో ఇది 28% అని తెలిపింది. ఆగ్నేయ ఆసియా దేశాల్లో నీటి ప్రమాదాల్లో చనిపోతున్నవారిలో 43% మంది 5-14 ఏళ్ల మధ్య బాలలే ఉన్నట్లు పేర్కొంది. పెద్దల పర్యవేక్షణ లేకపోవడం, ఈత రాకపోవడంతోనే ఈ మరణాలు సంభవిస్తున్నాయని డబ్ల్యూహెచ్‌ఓ తెలిపింది.

ఆర్మీ చీఫ్ కార్యాలయంలో చారిత్రక '1971' చిత్రం తొలగింపు!

- పాక్‌తో యుద్ధ విజయానికి గుర్తు ఫొటో స్థానంలో యుద్ధ ట్యాంకులు, కృష్ణార్జునులు, చాణక్యుడు ఉన్న చిత్రం ఏర్పాటు



ఆర్మీ చీఫ్ ఆఫీసులో పాత చిత్రం

న్యూఢిల్లీ, డిసెంబరు 14: ఆర్మీ చీఫ్ (సీవోఏఎస్) కార్యాలయంలో 1971 యుద్ధంలో పాకిస్థాన్‌పై విజయానికి గుర్తుగా ఉన్న ఫొటోను తొలగించడం వివాదం రేపింది. సోమవారం విజయ్ దివస్ జరుపుకోనున్న సమయంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. 1971, డిసెంబరు 16న బంగ్లాదేశ్ విముక్తి పోరాటంలో భాగంగా యుద్ధం ముగింపు సందర్భంగా పాకిస్థానీ సైనిక బలగాల లొంగుబాటు పత్రంపై పాక్ లెఫ్టినెంట్ జనరల్ ఏఏకే నియాజీ భారత లెఫ్టినెంట్ జనరల్ జగ్జిత్ సింగ్ అరోరా సమక్షంలో సంతకం చేస్తున్న చిత్రాన్ని మార్చారు. దాని స్థానంలో 'కర్మ క్షేత్ర' అనే పేరుతో మరో చిత్రాన్ని ఏర్పాటు చేశారు. అందులో భారత్, చైనా సరిహద్దు ఎల్‌ఏసీ వెంబడి ఉండే ప్యాంగాంగ్ త్సో సరస్సు, యుద్ధ ట్యాంకర్లు, హెలికాప్టర్లు, సైనికులతో భారత యుద్ధ సామర్థ్యాలను చూపే చిత్రాలు ఉన్నాయి. గరుడ, చాణక్యుడు, మహాభారత యుద్ధ క్షేత్రంలో ఉన్న కృష్ణార్జునులతో కూడిన చిత్రాలు కూడా ఉండటం మరింత చర్చకు దారితీసింది. దీనిపై పలువురు సైనిక మాజీ అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు.



కొత్త చిత్రం

కుటుంబ పాలనలో రాజ్యాంగ దుర్వినియోగం

(మొదటి పేజీ తరువాయి)



లోక్‌సభలో చర్చకు ప్రధాని మోదీ సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన సుదీర్ఘంగా రెండు గంటలు మాట్లాడారు. అంబేడ్కర్ నేతృత్వంలో రాజ్యాంగకర్తలు అద్భుత రాజ్యాంగాన్ని రచించారని, దాన్ని నెహ్రూ-గాంధీ కుటుంబం ఇష్టం వచ్చినట్లు మార్చేసిందని వ్యాఖ్యానించారు. 1951లో తొలి సవరణతో నెహ్రూ రాజ్యాంగ దుర్వినియోగానికి తెర తీశారని చెప్పారు. రాజ్యాంగం అడ్డొస్తే మార్చేద్దామని స్వయంగా నెహ్రూ రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లేఖ రాశారని ప్రస్తావించారు. 1975లో ప్రజల రాజ్యాంగ హక్కులన్నీ ఉల్లంఘిస్తూ ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించినపుడు రాజ్యాంగానికి కేవలం 25 ఏళ్లు మాత్రమేనన్నారు. రాజ్యాంగాన్ని ఎడాపెడా మార్చే సంప్రదాయానికి తొలి ప్రధానిగా నెహ్రూయే తెర తీశారన్నారు. తండ్రి అడుగు జాడల్లో ఇందిరాగాంధీ సుప్రీంకోర్టు తీర్పులను కూడా తోసిరాజని 1971లో రాజ్యాంగాన్ని అడ్డగోలుగా మార్చేశారని చెప్పారు. ఇందిర న్యాయ వ్యవస్థను తన చెప్పుచేతల్లోకి తెచ్చుకొనే ప్రయత్నాల్లో భాగంగా వాటి రెక్కలు కత్తిరిస్తూ రాజ్యాంగ సవరణలు చేశారన్నారు. రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రి అయ్యాక ఆ కుటుంబం తీరులో మార్పేమీ లేదని చెప్పారు. షాబానో కేసులో మహిళల హక్కులను గౌరవిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఓటుబ్యాంకును కాపాడుకొనే ప్రయత్నాల్లో భాగంగా రాజీవ్‌గాంధీ సంబంధిత చట్టాల సవరణ ద్వారా నిర్వీర్యం చేశారన్నారు. రాజ్యాంగం రక్తం రుచి మరిగిన కాంగ్రెస్ కుటుంబం నుంచి నాలుగో తరం కూడా రాజ్యాంగం మీద దాడిని కొనసాగిస్తూనే ఉందని వ్యాఖ్యానించారు. ఆ కుటుంబ పాలనలో 75 సార్లు రాజ్యాంగాన్ని సవరించారన్నారు. కాంగ్రెస్ పార్టీకి తన సొంత రాజ్యాంగం మీదే విశ్వాసం లేదని చెప్పారు. ఆ పార్టీ రాజ్యాంగం ప్రకారం భారతదేశ తొలి ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ కావాలని అన్నారు. 12 రాష్ట్రాల కాంగ్రెస్ కమిటీలు ప్రధానిగా వల్లభాయ్ పేరును ప్రతిపాదించినా, నెహ్రూ పేరును ఒక్క పీసీసీ ప్రతిపాదించక పోయినా ఆయన్నే ప్రధానిని చేశారని గుర్తు చేశారు. వెనుకబడిన కులాల నుంచి సీతారాం కేసరి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైతే ఆయన్ను బాత్రూంలో బంధించి, రోడ్డు మీదకు తోసేసి అవమానించారని, పార్టీని కుటుంబం లాగేసుకుందని ఆరోపించారు. 1998లో వాజ్‌పేయి ఎంపీలను కొనుక్కొని ప్రభుత్వాన్ని బతికించుకొనే అవకాశం ఉన్నా రాజ్యాంగ స్ఫూర్తికి కట్టుబడి అధికారాన్ని వదులుకున్నారని ప్రస్తావించారు. కాంగ్రెస్ పాలనలో ఎంపీలను కొనడానికి ఉపయోగించిన కరెన్సీ కట్టలను పార్లమెంటులో ప్రదర్శించిన విషయాన్ని ప్రస్తావించారు. రాజ్యాంగాన్ని బీజేపీ కూడా సవరించిందని, అయితే, మంచి పనుల కోసమే చేశామని చెప్పారు. ఓబీసీ కమిషన్ ఏర్పాటు, అగ్రవర్ణ పేదలకు పది శాతం రిజర్వేషన్ల కల్పన, చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లు లాంటి మంచి పనులు చేశామని గుర్తు చేశారు. ఆర్టికల్ 370 లాంటి తప్పులను సరిదిద్దడానికి రాజ్యాంగాన్ని మార్చామని వ్యాఖ్యానించారు.

11 సంకల్పాలు

2047 కల్లా అభివృద్ధి చెందిన భారత్‌ను సాధ్యం చేయడానికి ప్రధాని మోదీ 11 సంకల్పాలను ప్రకటించారు. 1) అందరికీ తోడు... అందరి అభివృద్ధి. 2) అవినీతిపై ఉపేక్ష లేదు. 3) చట్టాన్ని పాటించడాన్ని గర్వంగా భావించాలి. 4) వలస పాలన మనస్తత్వం నుంచి విముక్తి. 5) వారసత్వ రాజకీయాలకు దూరం. 6) రాజ్యాంగం పట్ల గౌరవం. దాన్ని రాజకీయాలకు వాడుకోక పోవడం. 7) రిజర్వేషన్లు ఎత్తేయకపోవడం. 8) మత రిజర్వేషన్లను ఆపేయడం. 9) మహిళా ఆధార అభివృద్ధికి భారత్‌ను ఉదాహరణగా మార్చడం 10) రాష్ట్రం నుంచి దేశం వరకు అభివృద్ధి 11) ఒకే భారత్ శ్రేష్ఠ భారత్

రాజ్యాంగాన్ని రక్షిస్తామని బీజేపీ చెప్పడం విడ్డూరం

- లోక్‌సభలో రాజ్యాంగంపై చర్చలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ

న్యూఢిల్లీ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని రక్షిస్తామని బీజేపీ నేతలు చెప్పడం విడ్డూరంగా ఉందని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. లోక్‌సభలో శనివారం రాజ్యాంగంపై చర్చలో భాగంగా రాహుల్ మాట్లాడారు. రాజ్యాంగంలో భారతీయత ఏమీ లేదని తన రచనల్లో ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ సిద్ధాంతకర్త సావర్కర్ స్పష్టంగా చెప్పారన్నారు. ప్రాచీన కాలం నుంచి మన సంస్కృతి, ఆచారాలు, ఆలోచనలు, ఆచరణలకు మనుస్మృతే ఆధారమని, రాజ్యాంగం స్థానంలో మనుస్మృతి ఉండాలని సావర్కర్ ఆకాంక్షించారని రాహుల్ వెల్లడించారు. "మీరు రాజ్యాంగాన్ని పరిరక్షించడం గురించి పార్లమెంట్‌లో మాట్లాడడం అంటే మీరు మీ నాయకుడు సావర్కర్‌ను అవహేళన చేస్తున్నట్టే" అని రాహుల్ బీజేపీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. కాగా, భారత్‌లో ప్రస్తుతం యుద్ధం జరుగుతోందని చెబుతూ.. ద్రోణాచార్యుడికి ఏకలవ్యుడు తన బొటనవేలిని గురుదక్షిణగా ఇచ్చిన అంశాన్ని రాహుల్ ప్రస్తావించారు. అదానీకి ధారావి ప్రాజెక్టు అప్పగించినప్పుడే అక్కడి చిన్న, మధ్య తరహా వ్యాపారుల బొటనవేళ్లను మోదీ కోసేసినట్టయిందని చెప్పారు. అగ్నివీర్ ప్రశ్నపత్రాల లీక్‌ల ద్వారా యువత బొటనవేలిని కత్తిరించారని వ్యాఖ్యానించారు. మద్దతు ధర కోసం ఉద్యమిస్తున్న రైతుల బొటనవేలిని కత్తిరించారని మండిపడ్డారు. కాగా, మోదీ ప్రసంగంపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ సెటైర్ వేశారు. ప్రధాని ప్రసంగం పాఠశాలలో వరుసగా రెండు గణితం క్లాసులు విన్నట్లుందన్నారు. ప్రధాని 110 నిమిషాల ప్రసంగం బోర్ కొట్టించిందని, కొత్తదనమేమీ లేకుండా సాగిందన్నారు.

లోకం తీరు



'పువర్తి'కి స్వాతంత్ర్యపు వెలుగులు!

- మావోయిస్టు నేత హిడ్మా స్వగ్రామంలో సౌర విద్యుత్.. తొలిసారి టీవీ ప్రసారాలు

చింతూరు/చర్ల, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పువర్తి.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలోని కీలకమైన మావోయిస్టు ప్రభావిత గ్రామం. అంతేకాదు హార్డ్ కోర్ మావోయిస్టు, కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మా స్వగ్రామం కూడా ఇదే! స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లైనా ఆ గ్రామానికి ఇప్పటికీ విద్యుత్ సౌకర్యం లేదు. నేటికీ వారంతా కిరోసిన్ దీపపు కాంతుల నడుమే జీవిస్తున్నారు. ఇక ఈ గ్రామస్థులకు టీవీ అంటే ఏమిటి? టీవీ ప్రసారాలు ఎట్లా ఉంటాయో నన్న విషయం కూడా తెలియదు. పలు ఎన్‌కౌంటర్లు, మెరుపు దాడులు అనంతరం ఈ ఏడాది ఫిబ్రవరిలో పువర్తిలో తొలిమారు పోలీసు క్యాంపు ఏర్పాటు చేశారు. ఆ గ్రామంలో తొలిసారి జాతీయ జెండాను జవాన్లు ఆవిష్కరించారు. 2026 నాటికల్లా ఛత్తీస్‌గఢ్ మావోయిస్టు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న పథక రచనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడుగులు వేస్తున్నాయి. ఈ క్రమంలోనే.. మావోయిస్టు ప్రభావిత గ్రామాలకు ఛత్తీస్‌గఢ్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (సీఆర్‌ఈడీఏ) పథకం ద్వారా సౌర విద్యుత్ సౌకర్యం కల్పించే దిశగా చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. హిడ్మా ఇంటికి కూడా సౌర విద్యుత్ సౌకర్యం కల్పించారు. హిడ్మా ఇంట్లో ఎల్‌ఈడీ టీవీ కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆ టీవీలో ప్రసారాలను గ్రామస్థులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

నేడు బస్తర్‌కు అమిత్‌షా

కేంద్ర హోంమంత్రి అమిత్‌షా బస్తర్‌లో ఆదివారం పర్యటించనున్నారు. సుకుమా జిల్లాలో పర్యటించి ఛత్తీస్‌గఢ్ ముఖ్య పోలీస్ అధికారులతో సమావేశం కానున్నారు. మావోయిస్టుల నిర్మూలనే లక్ష్యంగా ఈ సమావేశం సాగనుంది. మావోయిస్టు బాధిత కుటుంబాలతో కూడా షా మాట్లాడతారు. బస్తర్‌లో నిర్వహించబోతున్న ఒలింపిక్ క్రీడలను ప్రారంభిస్తారు.

రేపు లోక్‌సభలో జమిలి బిల్లు!

న్యూఢిల్లీ, డిసెంబరు 14: జమిలి ఎన్నికల బిల్లును సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టాలని కేంద్రం నిర్ణయించింది. తరచూ ఎన్నికలు జరుగుతూ ప్రతి రోజూ దేశంలో ఏదో మూల ఎన్నికల కోడ్ అమలులో ఉండటం వల్ల అభివృద్ధి కుంటుపడుతోందని అభిప్రాయం వ్యక్తమవుతున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలన్న బృహత్తక కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం తలకెత్తుకుంది. జమిలి ఎన్నికల కోసం రాజ్యాంగంలో 82ఏ పేరుతో కొత్త ఆర్టికల్‌ను చేరుస్తారు. ఆర్టికల్ 83(పార్లమెంటు ఉభయ సభల కాలవ్యవధి), ఆర్టికల్ 172(శాసనసభల కాల వ్యవధి), ఆర్టికల్ 327(చట్ట సభలకు ఎన్నికల విషయంలో పార్లమెంటుకు నిబంధనలను రూపొందించే అధికారం)లను సవరిస్తారు. జమిలి ఎన్నికల బిల్లు ఆమోదం పొందిన తర్వాత తదుపరి పార్లమెంటు తొలిసారి సమావేశమయ్యే తేదీని రాష్ట్రపతి ప్రకటిస్తారు. దాన్ని అపాయింటెడ్ డేట్ అంటారు. అంతకు ముందే ఎన్నికల ప్రక్రియ పూర్తి కావాలి. పార్లమెంటు కాలపరిమితి అపాయింటెడ్ డేట్ నుంచి ఐదేళ్లలో ముగిసిపోతుంది. అన్ని రాష్ట్రాల శాసనసభల కాలపరిమితి కూడా అదే పద్ధతిలో ముగిసిపోతుంది. లోక్‌సభకు, అన్ని రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు జరుగుతాయి. లోక్‌సభ కానీ, శాసనసభ కానీ కాలపరిమితి పూర్తి కాకుండానే రద్దయితే ఐదేళ్లలో మిగిలిన కాలానికి ఎన్నికలు నిర్వహించి కొత్త సభను ఏర్పాటుచేస్తారు. 1951-52, 1957, 1962, 1967 సంవత్సరాల్లో జమిలి ఎన్నికలే జరిగాయని బిల్లులో గుర్తు చేశారు. 1968, 69 సంవత్సరాల్లో కొన్ని శాసనసభలను అర్ధాంతరంగా రద్దు చేయడంతో ఆ క్రమం తప్పిందని ప్రస్తావించారు. కోవింద్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి కమిటీ సూచన మేరకు ఒకే దేశానికి ఒకే ఎన్నిక విధానాన్ని ఎంచుకున్నట్లు బిల్లు ఉద్దేశాల్లో పేర్కొన్నారు. కోవింద్ కమిటీ స్థానిక సంస్థలను కూడా చేర్చాలని సూచించినా ప్రస్తుతానికి దాన్ని పక్కన పెట్టాలని కేంద్ర కేబినెట్ నిర్ణయించింది. దాంతో సగం రాష్ట్రాల ఆమోదం పొందాల్సిన అవసరం లేకుండా పోయింది. అసెంబ్లీలతో పాటే పలు కేంద్ర పాలిత ప్రాంతాల శాసనసభకు ఎన్నికలు నిర్వహించేందుకు మరో బిల్లును ఆమోదించనున్నారు.

భారతీయ విద్యార్థులపై కెనడా కన్నెర్ర

- డాక్యుమెంట్లు తిరిగి సమర్పించాలని ఇమ్మిగ్రేషన్ అధికారుల ఆదేశాలు

న్యూఢిల్లీ, డిసెంబరు 14: భారత్‌పై కత్తికట్టినట్టు వ్యవహరిస్తున్న కెనడా ఇప్పుడు ఆ దేశంలో విద్యను అభ్యసిస్తున్న భారతీయ విద్యార్థులపై పడింది. కీలక డాక్యుమెంట్లను మరోసారి తమకు సమర్పించాలని పేర్కొంటూ.. కెనడా ఇమ్మిగ్రేషన్, రిఫ్యూజీస్, సిటిజన్‌షిప్ కెనడా(ఐఆర్‌సీసీ) ఈ మెయిళ్ల ద్వారా ఆదేశాలు జారీ చేసింది. వీటిలో అధ్యయన అనుమతులు, వీసాలు, ఎడ్యుకేషనల్ రికార్డులు, మార్కులు, అటెండెన్స్ వంటి పలు డాక్యుమెంట్లు ఉన్నాయి. ఐఆర్‌సీసీ ఆదేశాలతో భారత విద్యార్థులు సహా అంతర్జాతీయ విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. కాగా, వీరిలో చాలా మంది రెండేళ్లపాటు చెల్లుబాటు అయ్యే వీసాలు కలిగి ఉన్నారు. ఇప్పుడు డాక్యుమెంట్లను అడ్డుపెట్టుకుని ఎదైనా మెలిక పెట్టి తమ వీసాలను రద్దు చేస్తారేమోనని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఐఆర్‌సీసీ వాదన మరో విధంగా ఉంది. ఆర్థిక అవసరాలను దృష్టిలో పెట్టుకుని విద్యార్థుల ప్రవేశాలను నియంత్రించాలని నిర్ణయించినట్టు తెలిపింది. విదేశాంగ శాఖ లెక్కల ప్రకారం.. కెనడాలో 4.2 లక్షల మంది భారతీయ విద్యార్థులు చదువుతున్నారు. మరోవైపు, అమెరికాలోనూ సరైన ధ్రువపత్రాలు లేని 18 వేల మంది భారతీయ విద్యార్థులను దేశం నుంచి పంపించేందుకు రంగం రెడీ అవుతున్నట్టు తెలిసింది. వీరిలో గుజరాత్, పంజాబ్, ఏపీకి చెందిన విద్యార్థులు ఉన్నారు. ఇమిగ్రేషన్ అధికారుల కథనం ప్రకారం.. ఈ ఏడాది నవంబరు నాటికి 14.45 లక్షల మంది విద్యార్థులను అమెరికా నుంచి పంపేయాలని నిర్ణయించుకున్నారు. వీరిలో 17,940 మంది భారతీయ విద్యార్థులు ఉన్నారు.

భార్య వేధింపులకు మరో భర్త బలి

- బెంగళూరులో పోలీసు ఆత్మహత్య



తిప్పణ్ణ(ఫైల్)

బెంగళూరు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): భార్య వేధింపులు కారణంగా ఇటీవల బెంగళూరులో టెకీ అతుల్ సుభాష్ ఆత్మహత్య చేసుకున్న ఘటనపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న వేళ.. అదే తరహాలో బెంగళూరుకే చెందిన ఓ పోలీసు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య, మామ వేధింపులు భరించలేక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న తిప్పణ్ణ (34) తనువు చాలించాడు. విజయపుర జిల్లా సింధగి తాలూకా హందిగనూరు గ్రామానికి చెందిన తిప్పణ్ణ శుక్రవారం రాత్రి 10: 45 సమయంలో రైలు కింద పడి కన్నుమూశాడు. అతని మృతదేహం వద్ద లభించిన సూసైడ్ నోట్ ఆధారంగా భార్య, మామ వేధింపులే ఆత్మహత్యకు కారణమని పోలీసులు గుర్తించారు. తన భార్య వేధింపుల గురించి తన మామకు గురువారం ఫోన్ చేసి చెప్పానని, 'నువ్వు చస్తే నా కూతురు బాగుంటుంది' అని మామ దూషించాడని తిప్పణ్ణ సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు.

దక్షిణ కొరియా అధ్యక్షుడి అభిశంసన

తీర్మానానికి 204 మంది ఎంపీల మద్దతు.. విధుల నుంచి సస్పెండ్ అయిన యోల్

- 'మార్షల్ లా' విధింపుపై సభ్యుల ఆగ్రహం
- రాజ్యాంగ ధర్మాసనానికి తీర్మానం ప్రతులు
- తాత్కాలిక అధ్యక్షుడిగా ప్రధాని హన్ డక్



సియోల్, డిసెంబరు 14: దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌కు పార్లమెంటు(నేషనల్ అసెంబ్లీ)లో గట్టి ఎదురు దెబ్బ తగిలింది. ఈ నెల 3న ఆయన దేశంలో 'మార్షల్ లా'(సైనిక పాలన) విధించడం.. దీనిపై ప్రతిపక్షాలు సహా ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చిన నేపథ్యంలో గంటల వ్యవధిలోనే వెనక్కి తీసుకున్న విషయం తెలిసిందే. అయితే.. అసలు మార్షల్ లా విధించడాన్ని తీవ్రంగా తప్పుబడుతున్న పార్లమెంటు సభ్యులు ఆయనను పదవి నుంచి అభిశంసించాలని పట్టుదలతో ఉన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే చట్టసభలో యోల్‌కు వ్యతిరేకంగా ఇటీవల అభిశంసన తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు. అయితే.. అప్పట్లో అది వీగిపోయింది. అయినప్పటికీ.. సభ్యులు మరోసారి ఈ తీర్మానాన్ని ప్రవేశ పెట్టడంతో తాజాగా దీనిపై సభలో ఓటింగ్ నిర్వహించారు. ఈ తీర్మానానికి అనుకూలంగా మొత్తం 300 మంది సభ్యుల్లో 204 మంది అనుకూలంగా ఓటేయగా కేవలం 85 మంది వ్యతిరేకించారు. దీంతో తీర్మానం ఆమోదం పొందినట్టు స్పీకర్ ప్రకటించారు. ఫలితంగా యోన్ తన విధుల నుంచి సస్పెండ్ అయ్యారు. ఇక, ఇప్పుడు ఈ తీర్మాన ప్రతిని రాజ్యాంగ ధర్మాసనానికి నివేదిస్తారు. దీనిపై కోర్టు 180 రోజుల్లో నిర్ణయం ప్రకటించాల్సి ఉంటుంది. అధ్యక్షుడి అభిశంసనకు కోర్టు కూడా పచ్చజెండా ఊపితే.. అప్పటి నుంచి 60 రోజుల్లో కొత్త అధ్యక్షుడిని ఎన్నుకోవాల్సి ఉంటుంది. అప్పటి వరకు ప్రధాని హన్ డక్ సూ తాత్కాలిక అధ్యక్షుడిగా కొనసాగుతారు. ఇదిలావుంటే, ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో దేశ ఆర్థిక భద్రత, విదేశీ సంబంధాల విషయంలో ప్రభుత్వం, చట్టసభ సభ్యులు కలివిడిగా ఉండాలని, దేశ అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని స్పీకర్ కిమ్-జిన్-ప్యో అభ్యర్థించారు. మరోవైపు, యోల్ అభిశంసనపై త్వరితగతిన నిర్ణయం వెలువరించేందుకు వీలుగా రాజ్యాంగ ధర్మాసనంలో న్యాయమూర్తులను వెంటనే నియమించేలా చర్యలు తీసుకోవాలని ప్యో సూచించారు. తద్వారా కొన్ని వారాల్లోనే నిర్ణయం వెలువడే అవకాశం ఉంటుందన్నారు.

నాది రాక్షసులపై యుద్ధం: యోల్

తాను ప్రకటించిన మార్షల్ లా.. దేశంపై చేసిన తిరుగుబాటు చర్యకాదని అభిశంసన ఎదుర్కొంటున్న అధ్యక్షుడు యోల్ పేర్కొన్నారు. మార్షల్ లా ప్రకటన పాలనలో భాగమేనని తెలిపారు. దేశానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తూ.. రాక్షసుల మాదిరిగా వ్యవహరిస్తున్న ప్రతిపక్ష డెమొక్రటిక్ పార్టీ సభ్యులను హెచ్చరించేందుకే తాను మార్షల్ లా ప్రకటించాల్సి వచ్చిందని సమర్థించుకున్నారు. తనపై ప్రవేశ పెట్టిన అభిశంసన తీర్మానం కేవలం వ్యక్తిగతంగా తనను బాధించడమే కాదని, ఉన్నతస్థాయిలో ఉన్న అధ్యక్ష పదవిని అగౌరవ పరచడం, అధికారాలను లాగేసుకోవడమేనన్నారు. తద్వారా వచ్చే ఏడాది ప్రవేశ పెట్టాల్సిన బడ్జెట్ బిల్లును కూడా బలహీన పరిచాయరని యోల్ విమర్శించారు. దేశాన్ని అస్థిరపరచేందుకు ప్రయత్నిస్తున్న క్రిమినల్ ముఠాలు అంతమయ్యే వరకు తన పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.



గాయపడిన రైతును ఆస్పత్రికి తరలిస్తున్న రైతులు

రైతుల ఢిల్లీ చలో ఉద్రిక్తం

- శంభు సరిహద్దు దాటేందుకు అన్నదాతల యత్నం
- వారిపైకి జలఫిరంగులు..17 మందికి గాయాలు

శంభు, డిసెంబరు14: కనీస మద్దతు ధర సహా 11 డిమాండ్లతో 101 మంది రైతులు హరియాణా-పంజాబ్ సరిహద్దు వద్ద చేపట్టిన ఢిల్లీ చలో కార్యక్రమాన్ని హరియాణా పోలీసులు మూడోసారి భగ్నం చేశారు. శంభు సరిహద్దు దాటేందుకు యత్నించిన రైతులపై పోలీసులు భాష్పవాయువు ప్రయోగించారు. జలఫిరంగులతో రైతులను చెల్లాచెదురు చేశారు. ఘటనలో 17 మంది రైతులకు గాయాలయ్యాయి. దీంతో శంభు సరిహద్దు వద్ద ఉద్రిక్తత ఏర్పడింది. ముందు జాగ్రత్తగా హరియాణా ప్రభుత్వం ఈ నెల 17 వరకు అంబాలా పరిసర ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలను నిలిపివేసింది. వాస్తవానికి రైతులు ఇదే నెల 6, 8 తేదీల్లో కూడా ఈ సరిహద్దు దాటేందుకు యత్నించి పోలీసులు అడ్డుకోవడంతో విఫలమయ్యారు. శనివారం కూడా మరోసారి అడ్డుకోవడంతో తమ ఢిల్లీ చలో కార్యక్రమాన్ని వాయిదా వేసుకున్నారు. మరోవైపు, ఈ నెల 16న పంజాబ్ బయట ట్రాక్టర్ల ర్యాలీ, ఈ నెల 18న పంజాబ్‌లో రైల్ రోకో చేపడ్తామని రైతు నాయకుడు సర్వాన్ సింగ్ పంధేర్ ప్రకటించారు. రైతుల డిమాండ్లను కేంద్రం వెంటనే పరిష్కరించాలంటూ పంజాబ్ రైతు నేత జగ్జీత్ సింగ్ కన్నొర్ సరిహద్దు వద్ద నవంబరు 26న నిరాహార దీక్ష ప్రారంభించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా మారుతోందని రైతు సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పెంపుడు సింహానికి ఖైదీలే ఆహారం

- ఒక్కొక్కటిగా బయటకు అసద్ పాలనలోని అకృత్యాలు
- అసద్ టైగర్ ఫోర్స్ కీలక అధికారికి బహిరంగ ఉరి

డమాస్కస్, డిసెంబరు 14: దేశం విడిచి పారిపోయిన సిరియా అధ్యక్షుడు బషర్ అల్- అసద్ పాలనలో కొనసాగిన అకృత్యాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. అసద్ ఇంటెలిజెన్స్ విభాగం 'టైగర్ ఫోర్స్'లో కీలక అధికారి అయిన తలాక్ దక్కాక్- ఖైదీలను తీసుకెళ్లి తన పెంపుడు సింహాలకు ఆహారంగా వేసేవాడనే విషయం బయటకు వచ్చింది. తాజాగా తిరుగుబాటుదారులు అతడిని పట్టుకుని సిరియా పశ్చిమ ప్రాంతంలోని హమా పట్టణంలో బహిరంగంగా ఉరితీసినట్లు సమాచారం. అయితే దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ట్యాక్సీ డ్రైవర్ అయిన తలాక్ దక్కాక్ అసద్ ప్రభుత్వంలో చేరి కీలక నేతగా ఎదిగాడు. తన ఆధీనంలో పనిచేసే దాదాపు 1500 మందిని అడ్డుపెట్టుకుని అసద్ అండదండలతో సొంతంగా నేర సామ్రాజ్యాన్ని స్థాపించాడు. తన అధికారాన్ని ఉపయోగించుకుని 2005లో జూ నుంచి ఓ సింహాన్ని తీసుకొచ్చాడు. తనకు ఎదురుతిరిగిన వాళ్లను ఆ సింహానికి ఆహారంగా వేసేవాడట.

అమెరికా గగనతలంలో 'మిస్టరీ డ్రోన్లు'

రాత్రి వేళల్లో దర్శనం.. కూల్చివేయాలన్న ట్రంప్

వాషింగ్టన్, డిసెంబరు 14: అమెరికా గగనతలంలో పలు చోట్ల 'మిస్టరీ డ్రోన్లు' దర్శనమిస్తుండడం కలవరం సృష్టిస్తోంది. వీటిని ఇరానో, చైనానో ప్రయోగించి ఉంటాయని కొందరు భావిస్తుండగా, ప్రభుత్వ వర్గాలు మాత్రం అలాంటిదేమీ లేదని కొట్టిపారేస్తున్నాయి. కొద్ది రోజుల క్రితం న్యూజెర్సీలో ఈ అనుమానాస్పద డ్రోన్లు కనిపించాయి. ప్రస్తుతం న్యూయార్క్ నగరం సహా ఇతర రాష్ట్రాల్లోనూ రాత్రి వేళల్లో ఇవి దర్శనమిస్తున్నాయి. ప్రకాశవంతమైన వస్తువులు ఎగురుతున్నట్టుగా కనిపిస్తుండడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై శ్వేత సౌధం స్పందిస్తూ వీటి వల్ల జాతీయ భద్రతకు ముప్పులేదని, వీటి వెనుక విదేశీ హస్తం కూడా లేదని తెలిపింది. అధ్యక్షుడిగా ఎన్నికయిన డొనాల్డ్ ట్రంప్ మాత్రం వీటిని కూల్చివేయాలని డిమాండ్ చేశారు.

ఇదెక్కడి దురదరా బాబు!

- చిన్నాపెద్దా తేడా లేకుండా అందరికీ ఒకటే దురద
- వికారాబాద్ జిల్లా బూరుగుపల్లిలో అంతుచిక్కని అనారోగ్య సమస్య.. నెల రోజులుగా ప్రజల అవస్థ

మోమిన్‌పేట్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి):గాలిలో తేడా వచ్చిందో... నీటిలో మార్పు వచ్చిందో.. మరేదేమైనా జరిగిందో... తెలియదు కానీ.. ఓ ఊరు ఊరంతా దురద సమస్యతో అల్లాడిపోతుంది. పగలు, రాత్రి అనే తేడా లేదు... చిన్నా, పెద్దా అనే వ్యత్యాసం లేదు.. ఎటు చూసినా, ఎవరిని పలకరించినా అందరిదీ ఒకటే బాధ.. 'ఇదెక్కడి దురదరా బాబు..!'.. గోళ్లతో శరీరాన్ని గీక్కుకుని ఒళ్లంతా దద్దుర్లు ఏర్పడ్డమే కానీ... దురదల తీవ్రత మాత్రం తగ్గదే.. వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండలం బూరుగుపల్లిలోని పరిస్థితి ఇది. సుమారు 1200 మంది జనాభా ఉన్న ఈ గ్రామంలో ఒకటి, రెండు కాదు ప్రజలు నెల రోజులుగా దురదలతో నరకయాతన అనుభవిస్తున్నారు. దాదాపు500 మంది వరకు బాధితులు ఉండగా వారిలో చిన్నపిల్లల సంఖ్యే అధికం. నెల రోజులు ఉన్న ఈ సమస్య తీవ్రత రెండు, మూడు రోజులుగా మరింత అధికమైంది. దురదను తాళలేక గోళ్లతో గోక్కుకుని చర్మం దద్దుర్లు తేలి ఇతర సమస్యలు తలెత్తుతున్నాయి. స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది దురద నివారణకు మందులు ఇస్తున్నా సమస్యను పరిష్కరించలేకపోతున్నారు. గ్రామానికి మిషన్ భగీరథ నీరు సరఫరా నిలిచిపోవడంతో బోరు ద్వారా వచ్చే నీటిని సరఫరా చేస్తున్నారు. ఆ నీళ్ల వల్లే ఈ సమస్య వచ్చి ఉంటుందని గ్రామ ప్రజలు అనుకుంటున్నారు.

అబూజ్‌మఢ్ ఎన్‌కౌంటర్ మృతుల గుర్తింపు

చర్ల, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మఢ్ అడవుల్లో గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన ఏడుగురు మావోయిస్టుల వివరాలను బలగాలు శనివారం గుర్తించాయి. మృతులంతా పీఎల్‌జీఏ సౌత్ మడ్ ఏరియా పీఎల్‌జీఏ 16 బెటాలియన్, ఇంద్రావతి కమిటీ సభ్యులని పేర్కొన్నాయి. మృతుల్లో ఏపీ లోని గుంటూరు జిల్లా రాయగొండకు చెందిన రామచంద్ర అలియాస్ మోహన్, మడకం కోసి (ఏరియా కమిటీ సభ్యుడు), కమలేష్, మోటు, ఓయం సోమరి, గుడ్డా కుచ్చా ఉన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

■ ఆర్కే RK



కొత్తపలుకు

చంద్రబాబు: నాడు, నేడు, రేపు!

ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు పూర్తయింది. ఉద్యోగుల విషయంలో వారి పనితీరును మదింపు చేసేందుకు ఆరు నెలల కాలాన్ని ప్రొబేషనరీ పిరియడ్‌గా పరిగణిస్తారు. పనితీరు సంతృప్తికరంగా ఉంటేనే సర్వీసు క్రమబద్ధీకరిస్తారు. నాయకులకు ఈ సూత్రం వర్తించదు. ఎందుకంటే వారు ఎప్పటికప్పుడు ప్రజల మనసు గెలుచుకుంటూనే ఉండాలి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరు నెలల పనితీరును సమీక్షించుకుందాం! గత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పనితీరు, వ్యవహార శైలి పట్ల విరక్తి చెందిన ప్రజలు కూటమికి భారీ మెజారిటీ కట్టబెట్టారు. ప్రతిపక్ష నాయకుడి హోదా పొందడానికి అవసరమైన సంఖ్యా బలాన్ని కూడా ప్రజలు జగన్‌కు ఇవ్వలేదు. అయినప్పటికీ జగన్‌రెడ్డి ప్రతిపక్ష నాయకుడు కాకుండా పోరు. ఈ కారణంగా ముఖ్యమంత్రితో పాటు ప్రతిపక్ష నాయకుడి పాత్రను కూడా సమీక్షించుకోవడం సముచితంగా ఉంటుంది. తనకు ప్రతిపక్ష నాయకుడి హోదా ఇస్తే తప్ప శాసనసభ సమావేశాలకు హాజరు

> **ముఖ్యమంత్రి అంటే సీఈవో మాత్రమే కాదు, స్వతహాగా రాజకీయ నాయకుడు. రాజకీయ నాయకుడైన ముఖ్యమంత్రికి రాష్ట్రాభివృద్ధి పైనే కాకుండా తన భవిష్యత్తు రాజకీయంపై కూడా విజన్ ఉండాలి. చంద్రబాబులో ఉన్న ప్రధానమైన అవలక్షణం ఏమిటంటే, అధికారంలోకి రాగానే ఆయన రాజకీయం మరచిపోయి సీఈవో అవతారం ఎత్తుతారు. ప్రభుత్వాలకు స్వల్పకాలిక లక్ష్యాలతో పాటు దీర్ఘకాలిక లక్ష్యాలూ ఉండాలి. రాజకీయానికి వస్తే దీర్ఘకాలిక లక్ష్యం ఉండాలి. ప్రజలు కూడా ప్రభుత్వం దీర్ఘకాలంలో ఏం చేస్తుందో తెలుసుకొని అంతవరకు వేచివుండరు. ప్రభుత్వం వల్ల తమకు ఇప్పటికిప్పుడు కలుగుతున్న ప్రయోజనాలను బట్టి ఎన్నికల్లో తీర్పు ఇస్తున్నారు. 2047 నాటికి పేదరికం లేని సమాజాన్ని సృష్టిస్తామని చెబితే ప్రజల చెవికెక్కదు. ఆమాట కొస్తే పేదరికం లేని సమాజం ఎలా సాధ్యం? రానున్న నాలుగున్నరేళ్లలో ఏమి చేయబోతున్నదీ చెప్పడానికి చంద్రబాబు ప్రయత్నించాలి. ఆయన ఆలోచనలు ఆ దిశగానే ఉండాలి.**

కాబోనని ప్రకటించిన జగన్‌రెడ్డి శాసనసభను బహిష్కరిస్తున్నారు. ఎన్నికల్లో ఓడిపోయినవారు ఓటమికి కారణాలను సమీక్షించుకొని ప్రజాభిమానాన్ని తిరిగి చూరగొనడానికి ప్రయత్నించడం – మెజారిటీ సాధించినవాళ్లు తమ పని తీరుతో ప్రజల మనసు మళ్లీ గెలుచుకొనే ప్రయత్నం చేయడం సహజం. ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయిన జగన్‌రెడ్డి ఆత్మవిమర్శ చేసుకొనే బదులు ఆత్మవంచనకు పాల్పడుతున్నారు. తన అతి మంచితనం, అతి నిజాయితీ వల్లే ఎన్నికల్లో ఓడిపోయామని ఆయన ఆత్మవంచన చేసుకుంటున్నారు. మచ్చుకైనా తనలో కనిపించని సుగుణాలను ఆపాదించుకొనే ప్రయత్నం చేయడం విడ్డూరంగా కూడా ఉంది. చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టి నెల రోజులు గడవక ముందే ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి నెలకొందని జగన్ తనను తాను వంచించుకొనే ప్రయత్నాలు మొదలెట్టారు. చంద్రబాబు ప్రభుత్వం ఆరు నెలల పాలన పూర్తయిన సందర్భంగా జగన్‌రెడ్డికి చెందిన రోత పత్రికలో ఒక కథనాన్ని వండి వార్చారు. ఈ కథనం ప్రకారం... "ఈ ఆరు నెలల్లో హత్యలు, దాడులతో రాష్ట్రం అల్లకల్లోలమైంది. ఆగని హత్యాచారాలతో మహిళా లోకం భీతిల్లుతోంది. అధికార వ్యవస్థపై ప్రభుత్వం కక్ష గట్టడంతో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు రెడ్ బుక్ బాధితులయ్యారు. ఏడు వేలకు పైగా ప్రైవేటు, ప్రభుత్వ ఆస్తులు ధ్వంసమయ్యాయి. శాంతి భద్రతలు మృగ్యం అవడంతో సామాన్యుల జీవితం ఛిద్రమైంది" అని చెప్పుకొచ్చారు. నిజానికి ఈ దారుణాలన్నీ జగన్ పాలనలోనే జరిగాయన్నది నిర్వివాదాంశం. రాష్ట్రంలో రూల్ ఆఫ్ లా లేకుండా పోయిందని అప్పుడు హైకోర్టు పలుమార్లు వ్యాఖ్యానించింది. రాజ్యాంగ హక్కులను కాలరాశారు. కొంత మంది పోలీసు అధికారులను కిరాయి సైనికులుగా మార్చుకొని జగన్‌రెడ్డిని ఎదిరించిన వారిపై కేసులు పెట్టి వేధించారు. ఎంపీ రఘురామకృష్ణ రాజును కస్టడీలో చిత్రహింసలు పెట్టారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను చెరబట్టారు. నిస్సహాయ స్థితిలోకి నెట్టివేయబడిన ప్రజలు ఈ అరాచకాలను ఎన్నికల వరకు మౌనంగా భరించి ఎన్నికల్లో మాడు పగిలేలా తీర్పు ఇచ్చారు. ఒక ముఖ్యమంత్రి ఎలా ఉండకూడదో నిరూపించిన జగన్‌రెడ్డికి ఇప్పుడు చంద్రబాబు పాలనలో, తన హయాంలో జరిగిన అక్రమాలు, అరాచకాలు అన్నీ జరుగుతున్నట్టుగా కనిపిస్తున్నాయట! అందుకే కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలలకే ప్రజా ఉద్యమాలకు పిలుపు ఇచ్చారు. శుక్రవారం నాడు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల వద్ద రైతు ధర్నాలకు పిలుపు ఇచ్చారు. ప్రభుత్వం పట్ల ప్రజల్లో జగన్‌రెడ్డి ఊహించుకుంటున్నంత వ్యతిరేకత లేనందున రైతు ధర్నాలు పేలవంగా జరిగాయి. వైసీపీ నాయకులు సైతం అప్పుడే ఉద్యమాలు ఏమిటి? అని విసుక్కున్నారు. కొంత మంది మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు పార్టీని వదిలి వెళ్లిపోతున్నారు. నిజంగానే చంద్రబాబు పాలనపై ప్రజలు విసుగు చెందుతున్నారనే అనుకున్నా జగన్‌రెడ్డి ఎన్నికల్లో తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలంటే మరో నాలుగున్నరేళ్లు ఆగాల్సిందే. ఎందుకంటే జగన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయనను ఐదేళ్లు భరించారు కదా!

ఇదీ వైరుధ్యం...

విచిత్రమేమిటంటే, చంద్రబాబు పాలన అరాచకంగా ఉందని జగన్‌రెడ్డి భావిస్తూ ఉండగా, చంద్రబాబు మెతక వైఖరి వీడాలని తెలుగు తమ్ముళ్లు, జన సైనికులు భావిస్తున్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కొంత మంది వైసీపీ నాయకులు తాము ఇంకా అధికారంలోనే ఉన్నామన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. మరికొంత మంది తెలుగుదేశం పార్టీకి దగ్గరై తమ అరాచకాలను కొనసాగిస్తున్నారు. తెలుగు తమ్ముళ్ల ఆగ్రహానికి ఇది కూడా ఒక కారణం. 'చంద్రబాబు నాయుడు బతికుంటే 2029 తర్వాత మేము అధికారంలోకి వచ్చి ఆయనను జైల్లో పెడతాం' అని వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి తాజాగా నోరు పారేసుకున్నారు. మనిషి లక్షణాలు ఉన్నవారు ఎవరూ... 'బతికుంటే' అన్న మాట వాడరు. చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న వారిని కూడా జీవించాలని కోరుకుంటాం. చంద్రబాబును వృద్ధుడిగా పరిగణిస్తున్న విజయసాయిరెడ్డి కౌమార దశలో ఏమీ లేరే? ఆయనకు కూడా 68 ఏళ్లు వస్తున్నాయి. చంద్రబాబుకు, ఆయనకూ మధ్య వయసు తేడా ఆరేళ్లు మాత్రమే. జగన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయనను ఎవరైనా 'బతికివుంటే' అని అనివుంటే అరెస్టు చేసి లాకప్‌లో చావగొట్టి ఉండేవారు. 'బోసడీకే' అన్న పదం వాడినందుకే కదా తెలుగుదేశం నాయకుడు పట్టాభిని అరెస్టు చేయించి పోలీసులతో దొంగ దెబ్బలు కొట్టించారు. ఆయన ఇంటిపై దాడి చేయించారు. చంద్రబాబును బతికివుంటే అని అంటున్న విజయసాయిరెడ్డి స్వేచ్ఛగానే తిరుగుతున్నారు కదా? ఆయనపై ఎవరూ దాడి చేయలేదే? హత్యకు కుట్ర చేస్తున్నారని కేసులు కట్టలేదే? ఈ తేడా చాలు– జగన్ హయాంలో జరిగిన అరాచకాలు, అక్రమాలు చంద్రబాబు పాలనలో జరగడం లేదని చెప్పడానికి! తాను ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చుంటేనే ప్రజలకు మంచి జరుగుతుందని అనుకోవడం జగన్‌రెడ్డి ఇష్టం. అదే నిజమైతే 151 సీట్లతో అధికారంలోకి వచ్చిన తనను ప్రజలు 11 సీట్లకే ఎందుకు పరిమితం చేశారో ఆత్మపరిశీలన చేసుకోవాలి కదా? ఆత్మస్తుతి, పరనింద ఎన్నికల్లో ఓట్లు తెచ్చిపెట్టవు. చంద్రబాబు ఆరు నెలల పాలనలో నమోదైన కేసులు, జగన్‌రెడ్డి హయాంలో జరిగిన అరాచకాల్లో కొన్నింటికి సంబంధించినవి మాత్రమే. నాడు జరిగిన అక్రమాలు బయటపడుతున్న కొద్దీ ప్రజలకు మైండ్ బ్లాంక్ అవుతోంది. జగన్ అండ్ కో వెనకేసుకు వస్తున్న ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు కూడా ఆయనకు కిరాయి సైనికులుగా పనిచేసిన వారే. అందుకే తట్టుకోలేకపోతున్నారు. నిజానికి చంద్రబాబు ఇప్పటికీ ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఈ కారణంగానే విజయసాయిరెడ్డి వంటివారు నోరు పారేసుకోగలుగుతున్నారు.

అక్కడే ఎందుకో...

సెకీని అడ్డుపెట్టుకొని అదానీతో కుదుర్చుకున్న సౌర విద్యుత్ కుంభకోణంలో రూ.1750 కోట్లు ముడుపుల రూపంలో చేతులు మారాయని అమెరికాలోని దర్యాప్తు సంస్థలు ఆరోపిస్తున్నప్పటికీ చంద్రబాబు ప్రభుత్వం జగన్‌పై చర్యలు తీసుకోకుండా మీనమేషాలు లెక్కిస్తున్నది. ఇందుకు రాజకీయ కారణాలు ఉండవచ్చునుగానీ ప్రజలు మాత్రం ఈ తాత్సారాన్ని హర్షించడం లేదు. ముఖ్యమంత్రి అనుసరిస్తున్న ఈ సాచివేత ధోరణి వల్ల జగన్ అండ్ కో రెచ్చిపోతున్నారు. దొంగతనం చేసినవాడే దొంగా దొంగా అని అరచినట్టుగా సౌర విద్యుత్ కుంభకోణంపై జగన్‌రెడ్డి మాట్లాడుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబే తప్పు చేసినట్టుగా జగన్ అండ్ కో మాట్లాడుతున్నారు. చంద్రబాబు స్థానంలో జగన్‌రెడ్డి ఉండివుంటే ఈ వ్యవహారంలో చంద్రబాబును అరెస్టు చేయించకుండా ఉండేవారా? సౌర విద్యుత్ వ్యవహారంలో ఢిల్లీ హైకోర్టులో ఆంధ్రజ్యోతి, ఈనాడు పత్రికలపై పరువు నష్టం దావా వేసిన జగన్‌రెడ్డి ఒక గ్యాగ్ ఆర్డర్ తెచ్చుకున్నారు. కేసు పూర్వాపరాలను తెలుసుకోకుండానే, అవతలి పక్షం అభిప్రాయం తెలుసుకోకుండానే న్యాయస్థానాలు ఇలాంటి గ్యాగ్ ఆర్డర్లు ఎలా ఇస్తాయో తెలియదు! అంతకు ముందు విజయసాయిరెడ్డి కూడా ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేసి ఉపశమనం పొందారు. వీరందరూ ఢిల్లీ హైకోర్టునే ఎందుకు ఎంచుకుంటున్నారో తెలియదు. నేరం జరిగినట్టు ఆరోపణలు వచ్చిన ప్రాంతం ఆంధ్రప్రదేశ్ పరిధిలో ఉండగా ఢిల్లీ హైకోర్టుకు వెళ్లడం ఏమిటి? ఏది ఏమైనా జగన్‌రెడ్డి అండ్ కో పెడబొబ్బలు పెడుతున్నట్టుగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుత పరిస్థితులు లేవు. సోషల్ మీడియాలో పచ్చి బూతులతో విరుచుకుపడుతున్న వారిపై కూడా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆగ్రహం ప్రదర్శించాకే ప్రభుత్వంలో కదలిక వచ్చింది. భావ ప్రకటనా స్వేచ్ఛ పేరిట అరాచకంగా ఇళ్లలోని ఆడవారి వ్యక్తిత్వ హననానికి పాల్పడటాన్ని ఏ చట్టం మాత్రం అనుమతిస్తుంది? ఈ ఆరు నెలల్లోనే రాష్ట్రంలో అరాచక పరిస్థితులు నెలకొన్నాయని జగన్ అండ్ కో భావిస్తుంటే అది వారి ఇష్టం.



> **1995 నాటి ముఖ్యమంత్రిని చూస్తారని చంద్రబాబు చెప్పారు. అప్పుడు ఆయన ప్రజలతో మమేకం అయ్యారు. పాలనా యంత్రాంగాన్ని పరుగులు పెట్టించారు. రాజకీయ కార్యాచరణకు కూడా తగిన సమయం కేటాయించారు. 1999లో మళ్లీ గెలిచిన తర్వాత పూర్తిగా సీఈవో అవతారం ఎత్తారు. ఆహా ఓహో అనే వాళ్ల మాటలు నమ్మి ప్రజలకు దూరం అయ్యారు. ఇప్పుడు మళ్లీ అటువంటి పరిస్థితి రాకూడదు. రాజకీయాలకు తగినంత సమయం కేటాయించకపోతే మళ్లీ కింద పడి లేవడానికి ఆయనకు వయసు సహకరించదు. ముఖ్యమంత్రిగా అద్భుత పనితీరును ప్రదర్శించడం అంటే విజన్‌తో ముందుకు వెళ్లడమే కాదు, రాజకీయ ప్రత్యర్థిని బలహీనపరుస్తూ తాను రాజకీయంగా బలపడటం కూడా! ఈ విషయంలో వెనుకాడితే అది చారిత్రక తప్పిదం అవుతుంది. జగన్‌రెడ్డి వల్ల రాష్ట్రం తీవ్రంగా నష్టపోయింది. ఏ కారణం వల్లనైనా అతను మళ్లీ బలపడి అధికారంలోకి వస్తే ఆ పాపం చంద్రబాబుదే అవుతుంది. తనకోసం కాకపోయినా రాష్ట్రంకోసమైనా జగన్‌రెడ్డి వంటి శక్తులు బలపడకుండా జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. ఇకపై చంద్రబాబు వ్యవహార శైలి, నిర్ణయాలు ఈ దిశగానే ఉండాలి, ఉంటాయనీ ఆశిద్దాం.**

ఎప్పటి సంగతో సరే... ఇప్పుడు మాకేంటి?

ఇప్పుడు ముఖ్యమంత్రిగా చంద్రబాబు పనితీరు విషయానికి వద్దాం. ఏ ముఖ్యమంత్రి కూడా ఆరు నెలల్లో అద్భుతాలు సృష్టించలేరు. అందునా కుప్పకూలిన వ్యవస్థలను గాడిలో పెట్టడమే ఇప్పుడు ప్రభుత్వానికి అతి పెద్ద సవాల్‌గా ఉంది. ఇక రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి చెప్పే పనిలేదు. ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలలో ప్రధానమైనవి ఇంకా అమలు కావడం లేదు. ప్రజలు కూడా వేచి చూసే ధోరణితోనే ఉన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో రెండు రోజుల పాటు సమావేశం నిర్వహించారు. శుక్రవారం నాడు 'విజన్-2047' ఆవిష్కరించారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు వ్యవహార శైలిని నిశితంగా పరిశీలిస్తే, ఆయనలో కొన్ని పాత వాసనలు పోయినట్టుగా కనిపించడం లేదు. ముఖ్యమంత్రి అంటే సీఈవో మాత్రమే కాదు, స్వతహాగా రాజకీయ నాయకుడు. రాజకీయ నాయకుడైన ముఖ్యమంత్రికి రాష్ట్రాభివృద్ధి పైనే కాకుండా తన భవిష్యత్తు రాజకీయంపై కూడా విజన్ ఉండాలి. చంద్రబాబులో ఉన్న ప్రధానమైన అవలక్షణం ఏమిటంటే, అధికారంలోకి రాగానే ఆయన రాజకీయం మరచిపోయి సీఈవో అవతారం ఎత్తుతారు. ప్రభుత్వాలకు స్వల్ప కాలిక లక్ష్యాలతో పాటు దీర్ఘకాలిక లక్ష్యాలూ ఉండాలి. రాజకీయానికి వస్తే దీర్ఘకాలిక లక్ష్యం ఉండాలి. ప్రజలు కూడా ప్రభుత్వం దీర్ఘకాలంలో ఏం చేస్తుందో తెలుసుకొని అంత వరకు వేచివుండరు. ప్రభుత్వం వల్ల తమకు ఇప్పటికిప్పుడు కలుగుతున్న ప్రయోజనాలను బట్టి ఎన్నికల్లో తీర్పు ఇస్తున్నారు. దీని ప్రకారం విజన్-2047 డాక్యుమెంటు ప్రజలకు ఎక్కదు. 2004కు ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు విజన్-2020 అని పలవరించేవారు. ఆ క్రమంలో విద్యుత్ సంస్కరణలను అమలు చేశారు. ఫలితంగా 2004లో అధికారాన్ని కోల్పోయారు. ప్రజలను సమాయత్తపరచకుండా సంస్కరణలను అమలు చేస్తే ఫలితం అలాగే ఉంటుంది. కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో పవర్ రిఫామ్స్ అమలు చేసి తాను పవర్ కోల్పోయానని చంద్రబాబు స్వయంగా చెప్పుకొన్నారు. రాష్ట్రాభివృద్ధికి దీర్ఘకాలిక ప్రణాళికలు అవసరమేగానీ వాటి వల్ల ఓట్లు వస్తాయా లేదా అన్నది కూడా చూసుకోవాలి కదా! అందుకే ఈ ఐదేళ్లలో ఏం చెయ్యాలి, ఏం చేయగలమో చెప్పుకోవాలి. జగన్ హయాంలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేవారు కనిపించక నిరాసక్త వాతావరణం ఉండేది. ఇప్పుడు ఆరు నెలల్లోనే టీసీఎస్, గూగుల్ వంటి సంస్థలతో ఒప్పందాలు చేసుకోగలిగారు. ప్రజలు గుర్తించేది ఇలాంటి వాటినే! 2047 నాటికి పేదరికం లేని సమాజాన్ని సృష్టిస్తామని చెబితే ప్రజల చెవికెక్కదు. ఆమాట కొస్తే పేదరికం లేని సమాజం ఎలా సాధ్యం? సంపన్న దేశాలలో సైతం పేదరికం ఉంది. అక్కడి ప్రభుత్వాలు కూడా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో రానున్న నాలుగున్నరేళ్లలో ఏమి చేయబోతున్నదీ చెప్పడానికి చంద్రబాబు ప్రయత్నించాలి. ఆయన ఆలోచనలు ఆ దిశగానే ఉండాలి. "నా మటుకు నేను 2047 వరకు బతికే అవకాశమే లేదు. అలాంటప్పుడు అప్పుడు ఆవిష్కృతమయ్యే అద్భుతంపై నాకు ఆసక్తి ఏముంటుంది?" అందరూ ఇలాగే ఆలోచిస్తారు. చంద్రబాబు అద్భుతమైన విజన్ ఉన్న నాయకుడే, కాదనలేము. అయితే నాయకుడు అనేవాడు ప్రజలను తనతో పాటు నడిపించగలగాలి. ప్రజలను వదిలేసి వేగంగా ముందుకు పరిగెత్తకూడదు. అందుకే స్వల్పకాలిక, అంటే ఈ నాలుగున్నరేళ్లలో ఏమి చేయబోతున్నదీ ప్రజలకు స్పష్టంగా వివరించి ఆ తర్వాత దీర్ఘకాలిక ప్రణాళికల అమలుకు ప్రయత్నించాలి. 2014–19 మధ్య చంద్రబాబు నాయుడు ప్రధానంగా ఐవీఆర్ఎస్, ఆర్టీజీఎస్ వంటి వాటిపై ఆధారపడ్డారు. తాను నిర్వహించిన ఐవీఆర్ఎస్ సర్వేలో ప్రభుత్వం పట్ల 70 శాతానికి పైగా ప్రజలు సంతృప్తి చెందుతున్నారని వస్తోందని మురిసిపోయారు. ఎంత బాగా పనిచేసినా మనవంటి సంక్లిష్ట సమాజంలో 70 శాతం ప్రజలు ప్రభుత్వాల పట్ల సానుకూలంగా ఉండరు. ఈ మౌలిక విషయాన్ని మరచిపోయి చంద్రబాబు తనను తాను మభ్యపెట్టుకున్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి కూడా తనను తాను మభ్యపెట్టుకున్నారు. ప్రజల మనసులో ఏముందో తెలుసుకోవడం ఆషామాషీ విషయం కాదు. అందుకే ఈ మధ్య ఎగ్జిట్ పోల్స్ అంచనాలు కూడా తప్పుతున్నాయి. అయినా ఐవీఆర్ఎస్ అని పట్టుకొని వేలాడటం ఎందుకు? ముఖ్యమంత్రిని సంతృప్తిపరిచే విధంగా నివేదికలు ఇవ్వడం అధికారులకు పరిపాటే. అంచేత అలాంటి నివేదికలపై ఆధారపడకుండా సొంత వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలి. గత అనుభవాల నుంచి ఏమి నేర్చుకున్నాము అన్న దాన్ని బట్టి భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. రియల్ టైం గవర్నెన్స్ (ఆర్టీజీఎస్) కూడా ఈ కోవలోకే వస్తుంది. అమరావతిలోని కంట్రోల్ రూంలో కూర్చొని ఎక్కడ ఏం జరుగుతోందో తెలుసుకోవడం పాలకుడిగా ముఖ్యమంత్రికి అవసరం. అదే సమయంలో ప్రజలకు నష్టం కలిగించేవి ఏమీ జరగకుండా చూడటం, ప్రజలకు మేలు చేసే విధంగా వ్యవస్థలతో పనిచేయించడం చాలా ముఖ్యం. ఇది జరగనప్పుడు ప్రజలు సంతృప్తి చెందరు.



> **ప్రధాని మోదీ అధికారంలోకి వచ్చి పదేళ్లయినా ఆయన ఎన్నికల్లో అనుకూల ఫలితాలే పొందుతున్నారు. తాజా ఎన్నికల్లో సొంతంగా మెజారిటీ రాకపోయినా తన ప్రభుత్వం మనుగడకు ఇబ్బంది లేకుండా ఏం చేయాలో అది చేస్తూ, ఎవరిని ఎక్కడ కట్టడిచేయాలో అది చేస్తూ ప్రభుత్వాన్ని సాఫీగా నడుపుతున్నారు. చంద్రబాబు కూడా ఈ మోడల్‌నే అనుసరించాలి.**

జనం మనసు తెలుసుకోవడమెలా?

2014–19 మధ్య రియల్ టైం గవర్నెన్స్‌ను అమలు చేసినా అధికారం పోవడానికి కారణం అన్వేషించాలి కదా? ఆ పని చేయకుండా పాత పాటే అందుకుంటే మళ్లీ ప్రతికూల ఫలితాలే వస్తాయి. అమరావతిలో కూర్చొని ఏ గ్రామంలో ఏ వీధిలైటు వెలుగుతున్నదో లేదో చెప్పగలను అని గతంలో చంద్రబాబు ఒక సందర్భంలో చెప్పారు. పాలనలో మెరుగులు దిద్దడానికి మాత్రమే ఈ టెక్నాలజీ ఉపయోగపడుతుంది. ప్రజలకు ఉపశమనం కలగనప్పుడు, నువ్వు తెలుసుకుంటే మాకేమిటి? నువ్వు తెలుసుకోకపోతే మాకేమిటి? అని ప్రశ్నిస్తారు. టెక్నాలజీ వాడకం విషయంలోనూ ఇదే సూత్రం వర్తిస్తుంది. ముఖ్యమంత్రి ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ గురించి ఎక్కువగా మాట్లాడుతున్నారు. ఏఐ వల్ల ప్రజలకు ఏమి మేలు జరుగుతుందో వివరించి వారికి ఆ మేలు జరిగేలా చూడాలి. అప్పుడు మాత్రమే రాజకీయంగా ఉపయోగం ఉంటుంది. టెక్నాలజీ వాడకంలో గానీ, కష్టపడటంలో గానీ చంద్రబాబుకు మరెవరూ సాటిరారు. అయినా తాను రాజకీయంగా ఇన్ని ఒడుదొడుకులు ఎందుకు ఎదుర్కోవలసి వచ్చిందో చంద్రబాబు ఆత్మపరిశీలన చేసుకోవాలి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీనే తీసుకుందాం. ఆయన పెద్దగా కష్టపడినట్టు కనిపించరు. కేంద్రంలో అధికారంలోకి వచ్చి పదేళ్లయినా ఆయన ఎన్నికల్లో అనుకూల ఫలితాలే పొందుతున్నారు. తాజా ఎన్నికల్లో సొంతంగా మెజారిటీ రాకపోయినా తన ప్రభుత్వం మనుగడకు ఇబ్బంది లేకుండా ఏం చేయాలో అది చేస్తూ, ఎవరిని ఎక్కడ కట్టడి చేయాలో అది చేస్తూ ప్రభుత్వాన్ని సాఫీగా నడుపుతున్నారు. చంద్రబాబు కూడా ఈ మోడల్‌నే అనుసరించాలి. కలెక్టర్ల కాన్ఫరెన్స్‌నే తీసుకుందాం. రెండు రోజులపాటు ఉదయం నుంచి రాత్రి పొద్దు పోయేవరకు సమావేశాలు జరిగాయి. అంత సుదీర్ఘ సమావేశాలు అవసరమా? తన ప్రభుత్వానికి ఏమి కావాలి? ఏం జరుగుతోంది? ముందుగానే తెలుసుకొని ఆ విధంగా అధికారులకు దిశా నిర్దేశం చేస్తే సరిపోతుంది కదా! గంటల తరబడి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్లు ఇచ్చుకోవడం వల్ల ప్రజల మనసు చూరగొనలేరు. నాయకుడు అంటే తీరికగా ఉంటూ, తెలివిగా ఆలోచించి నిర్ణయాలు తీసుకొనేవాడు అయి ఉండాలి. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీలో ఈ లక్షణం పుష్కలంగా ఉంది. అందుకే ఆయన సాధారణ కార్యకర్త స్థాయి నుంచి ప్రధాన మంత్రి స్థాయికి ఎదిగారు. క్షణం తీరిక లేదు దమ్మిడీ ఆదాయం లేదు అన్నట్టుగా ఉండకూడదు. చంద్రబాబులో పాత వాసనలు పోని పక్షంలో 2029 పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగానే ఉంటుంది. కలెక్టర్ల సమావేశంలో మద్యం విధానం చర్చకు వచ్చినప్పుడు మద్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తున్నారా? బెల్టు షాపులు ఎక్కడైనా పెట్టారా? లేదా? అన్నది తెలుసుకోవడానికి మందు బాబులకు ఐవీఆర్ఎస్ ద్వారా ఫోన్ చేసి ఫీడ్ బ్యాక్ తెలుసుకుందామని చంద్రబాబు సూచించగా ఎక్సైజ్ ముఖ్య కార్యదర్శి ఎంకే మీనా వ్యతిరేకించారు. మందుబాబులకు ఫోన్ చేస్తే నోటికి తోచింది చెబుతారు కనుక అది సరైనది కాదని ఆ అధికారి చెప్పుకొచ్చారు. ప్రజల్లో అసంతృప్తి ఉంటే ఏదో ఒక రూపంలో బయటపడుతుంది. జగన్ పాలనలో నాసి రకం మద్యం తాగి అనేక మంది రోగాల బారినపడ్డారు. ఐవీఆర్ఎస్ సర్వే జరిపించకపోయినా మందుబాబులు అసంతృప్తితో ఉన్నారన్న విషయం తెలిసిపోయింది. అయినా జగన్ పట్టించుకోలేదు. అది వేరే విషయం. జగన్‌రెడ్డి పాలన పట్ల ప్రజలు విరక్తి చెందడానికి కారణాలు గుర్తించి ప్రస్తుత ప్రభుత్వంలో అవి జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటే ఏ సర్వేలూ అవసరం ఉండవు. కలెక్టర్ల సమావేశంలో కూడా స్వల్పకాలిక కార్యాచరణతో కూడిన టార్గెట్లపై చర్చ జరగలేదు. క్షేత్ర స్థాయి పరిస్థితులు నిత్యం ప్రజల్లో ఉండే పార్టీ కార్యకర్తలకు తెలిసినట్టుగా అధికారులకు తెలియవు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి కార్యకర్తల అభిప్రాయాలు సేకరించే కార్యక్రమం నిర్వహిస్తే కావాల్సినంత ఫీడ్ బ్యాక్ లభిస్తుంది. ముఖ్యమంత్రుల మెప్పు పొందడానికే అధికారులు పరిమితం అవుతారు. 'తల్లికి వందనం' అమలు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారని ఒక్క కలెక్టర్ కూడా చెప్పలేదే? మంచా– చెడా అన్నది పక్కన పెడితే ప్రజలు సంక్షేమ పథకాలకు అలవాటు పడ్డారు. వారికి అవి సకాలంలో అందకపోతే ఎంత గొప్ప భవిష్యత్తును ఆవిష్కరించినా పోపోవయ్యా అనే అంటారు. పాలనలో వాట్సాప్ విధానాన్ని ప్రవేశపెడతారో లేక మరో రకంగా పాలిస్తారో మాకెందుకు? మాకు రావాల్సినవి ఇవ్వండి, ఇస్తామన్నవి ఇవ్వండి అని మాత్రమే అడుగుతారు. ఇదే స్వల్పకాలిక కార్యాచరణ అంటే. స్వల్పకాలిక కార్యాచరణను అమలు చేసుకుంటూ దీర్ఘకాలిక కార్యాచరణకు పూనుకుంటే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుంది. అలా కాకుండా ఐవీఆర్ఎస్, ఆర్టీజీఎస్ వంటి పదాలను వల్లెవేయడం వల్ల ఫలితం ఉండదు. 2004, 2019లో తెలుగుదేశం పార్టీ ఎందుకు ఓడిపోయిందో కారణం చంద్రబాబుకు తెలుసు. ఆయన విజన్‌ను మెచ్చుకునేవాళ్లు ఓటర్లు కారు. అందుకే ఆయన పరిస్థితి ఇంట్లో ఈగల మోత బయట పల్లకీ మోత అన్నట్టుగా ఉంటోంది.


> **'చంద్రబాబు నాయుడు బతికుంటే 2029 తర్వాత మేము అధికారంలోకి వచ్చి ఆయనను జైల్లో పెడతాం' అని వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి తాజాగా నోరు పారేసుకున్నారు. మనిషి లక్షణాలు ఉన్నవారు ఎవరూ... 'బతికుంటే' అన్నమాట వాడరు. చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న వారిని కూడా జీవించాలని కోరుకుంటాం. చంద్రబాబును వృద్ధుడిగా పరిగణిస్తున్న విజయసాయిరెడ్డి కౌమార దశలో ఏమీ లేరే? ఆయనకు కూడా 68 ఏళ్లు వస్తున్నాయి. చంద్రబాబుకు, ఆయనకూ మధ్య వయసు తేడా ఆరేళ్లు మాత్రమే. చంద్రబాబును బతికివుంటే అని అంటున్న విజయసాయిరెడ్డి స్వేచ్ఛగానే తిరుగుతున్నారు కదా? ఆయనపై ఎవరూ దాడి చేయలేదే? హత్యకు కుట్ర చేస్తున్నారని కేసులు కట్టలేదే? ఈ తేడా చాలు– జగన్ హయాంలో జరిగిన అరాచకాలు, అక్రమాలు చంద్రబాబు పాలనలో జరగడం లేదని చెప్పడానికి!**

రాష్ట్రం కోసమైనా...

తాను ఇప్పుడు చంద్రబాబు ఫోర్ పాయింట్ ఓ (4.0) అని ఆయన చెప్పుకొంటున్నారు. 1995 నాటి ముఖ్యమంత్రిని చూస్తారని కూడా చెప్పారు. అప్పుడు ఆయన ప్రజలతో మమేకం అయ్యారు. పాలనా యంత్రాంగాన్ని పరుగులు పెట్టించారు. రాజకీయ కార్యాచరణకు కూడా తగిన సమయం కేటాయించారు. 1999లో మళ్లీ గెలిచిన తర్వాత పూర్తిగా సీఈవో అవతారం ఎత్తారు. ఆహా ఓహో అనేవాళ్ల మాటలు నమ్మి ప్రజలకు దూరం అయ్యారు. ఇప్పుడు మళ్లీ అటువంటి పరిస్థితి రాకూడదు. రాజకీయాలకు తగినంత సమయం కేటాయించకపోతే మళ్లీ కింద పడి లేవడానికి ఆయనకు వయసు సహకరించదు. ముఖ్యమంత్రిగా అద్భుత పనితీరును ప్రదర్శించడం అంటే విజన్‌తో ముందుకు వెళ్లడమే కాదు, రాజకీయ ప్రత్యర్థిని బలహీనపరుస్తూ తాను రాజకీయంగా బలపడటం కూడా! ఈ విషయంలో వెనుకాడితే అది చారిత్రక తప్పిదం అవుతుంది. జగన్‌రెడ్డి వల్ల రాష్ట్రం తీవ్రంగా నష్టపోయింది. ఏ కారణం వల్లనైనా అతను మళ్లీ బలపడి అధికారంలోకి వస్తే ఆ పాపం చంద్రబాబుదే అవుతుంది. తనకోసం కాకపోయినా రాష్ట్రం కోసమైనా జగన్‌రెడ్డి వంటి శక్తులు బలపడకుండా జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. ఇకపై చంద్రబాబు వ్యవహార శైలి, నిర్ణయాలు ఈ దిశగానే ఉండాలి, ఉంటాయనీ ఆశిద్దాం. కూటమి ప్రభుత్వం పట్ల ప్రస్తుతం ప్రజల్లో సంతృప్తిగానీ, అసంతృప్తిగానీ లేవు. ఇకపై ప్రభుత్వ పనితీరు, కూటమి ఎమ్మెల్యేల వ్యవహార శైలిని బట్టి ప్రజల అభిప్రాయం మారుతుంది. తాజా ఎన్నికల్లో జగన్‌రెడ్డిని ఓడించడమే లక్ష్యంగా ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పరిగెత్తారు. ఈ విషయాన్ని కూటమి నేతలు అనుక్షణం గుర్తుపెట్టుకుంటే వారికే మంచిది!

అస్తిత్వ అవస్థల్లో ఆదివాసీలు

> **ఐటీడీఏల నిర్వీర్యం, ఆదివాసీ భూభాగాలను ముక్కలు చేసి చిన్న జిల్లాలను సృష్టించడం, షెడ్యూల్ ప్రాంత ఉద్యోగాల దోపిడీ, ప్రకృతి వనరుల పరాయీకరణ, ఆదివాసీల స్వయం పాలన ఇత్యాది అంశాలపై ప్రభుత్వం దృష్టిపెట్టాలి. 1949 ఎల్విన్ కమిషన్ నుండి, రాజ్యాంగం అమలు మొదలుకొని, 2014 వరకు కూడా ఐదవ షెడ్యూల్, 1/70, LTR, పీసా చట్టం, ఐటీడీఏల ఏర్పాటు వంటివి అన్నీ చేసింది అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వాలే. గతాన్ని దృష్టిలో పెట్టుకొని ఇప్పటి రేవంత్‌రెడ్డి ప్రభుత్వమూ ఆదివాసీల పక్షాన నిలవాలి.**



తెలంగాణలో, రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్ భూభాగం 17,352 చదరపు కి.మీ. ఉంది. అందులో కోయ, గోండు, కొలాం, పర్ధాన్, తోటి, అంధ్, నాయకపోడ్, చెంచు, మన్నేవార్, కొలవార్ లాంటి ఆదిమ తెగలు దట్టమైన అడవులలో, గోదావరి, కృష్ణ నదీ పరివాహక ప్రాంతాల్లో నివాసం ఉంటున్నాయి. అందులో సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ)లు ఉట్నూరు (అదిలాబాద్) ఏటూరు నాగారం (ములుగు) భద్రాచలం (భద్రాద్రి కొత్తగూడెం) మన్ననూరు (నాగర్ కర్నూల్)లలో ఆదివాసుల అభివృద్ధి కోసం పనిచేస్తున్నాయి. ఇవి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కలయికలో గిరిజన అభివృద్ధి కోసం 1976లో దేబర్ కమిషన్ సూచించిన విధంగా ఏర్పడిన సంస్థలు. వీటికి స్వయంప్రతిపత్తి అధికారాలు, ప్రత్యేక నిధులు, విధి విధానాలతో ఈ భూభాగంలో జీఓ 57 ప్రకారం సింగిల్ లైన్ అడ్మినిస్ట్రేషన్ అమలులో ఉంటుంది. ప్రభుత్వ జనరల్ చట్టాలు జీవోలు ఈ ప్రాంతంలో చెల్లవు.

ఈ షెడ్యూల్ ప్రాంతపు భూభాగం ప్రత్యేకంగా పరిపాలించాల్సిన ప్రాంతమే కానీ ఆ పరిస్థితులు లేవు. ఆదివాసీలకు ఐటీడీఏ ద్వారా అందించాల్సిన పరిపాలన చిన్న జిల్లాల ఏర్పాటుతో కలెక్టర్ పరిధిలోకి వెళ్లిపోయింది. ఐటీడీఏల ప్రాంతాలు 6 జిల్లాలుగా విడిపోయి గిరిజన అభివృద్ధికి ఏమైనా చేయాలి అంటే ఆరు జిల్లా కలెక్టర్ల అనుమతి అవసరం అయి, ఏజెన్సీ ప్రాంతం స్వరూపం పరిపాలనాపరంగా మారిపోయింది. ఈ పరిస్థితి రావద్దు అని గతంలో జిల్లాల పునర్విభజన సందర్భంలో ఆదివాసీ ప్రాంతాలకు ప్రత్యేక జిల్లాలు అడిగినా కానీ రాజకీయ కుట్రలతో ఆదివాసీ భూభాగాలను కుక్కలు చింపిన ఇస్తరి చేశారు. గోండులు 6 జిల్లాలుగా, కోయలను 8 జిల్లాలుగా విభజన చేసారు. ఇక్కడి అధికారులు ఐటీడీఏ పరిధిలో కాకుండా కలెక్టర్ పాలనలో ఏజెన్సీ చట్టాలను పూర్తిగా ఉపేక్షిస్తున్నారు. నాడు 32 సెక్టార్లతో కళకళలాడిన ఐటీడీఏ నేడు బోసిపోయింది. ఒకనాడు 100 కోట్ల బడ్జెట్ ఉండేది, నేడు ఐదు కోట్లకు దిక్కులేనిస్థితి. సింగిల్ లైన్ అడ్మినిస్ట్రేషన్ ప్రకారం పరిపాలన, న్యాయ వ్యవస్థ అంతా కూడా ప్రాజెక్టు అధికారి కంట్రోల్లో పనిచేయాలి కానీ, ఆ పరిస్థితి లేదు.

షెడ్యూల్ 5(1) ప్రకారం ఈ ప్రాంత ఉద్యోగాలన్నీ రాజ్యాంగంలో ఆర్టికల్ 342 అనుసరించి 1950 కన్నా ముందు షెడ్యూల్ ప్రాంతంలో స్థిరనివాసం కలిగిన తెగలకి ఇవ్వాలి. దీని ఆధారంగా 29 శాఖలకు 29 రకాల జీఓలను చేస్తూ 155 రకాల ఉద్యోగాలను ఈ ప్రాంతంలో షెడ్యూల్ ట్రైబ్‌కు రిజర్వ్ అయ్యాయి. షెడ్యూల్ ప్రాంతంలో ఖాళీలను గుర్తించి నోటిఫికేషన్ వేసి, ఏజెన్సీ ప్రాంతంలో ఐటీడీఏనే ఉద్యోగాల భర్తీ ప్రక్రియ నిర్వహించాలి, ఉద్యోగస్తుల బదిలీలు, ప్రమోషన్లు ఇక్కడే చేయాలి, ప్రత్యేక ఏజెన్సీ డీఎస్సీ ద్వారా విద్య సంరక్షణ చేయాలి. తెలంగాణ రాష్ట్రం వచ్చేవరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇదే విధానం కొనసాగింది. కానీ తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కి రాష్ట్రవ్యాప్తంగా నోటిఫికేషన్ అప్పజెప్పడం, స్వయం ప్రతిపత్తి కలిగిన ఇంకా కొన్ని శాఖలకు అప్పచెప్పటం మూలంగా ఆ సంస్థలు ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న షెడ్యూల్ ప్రాంత జీఓలను పరిగణనలోకి తీసుకోవటం లేదు. కొత్తగా వచ్చిన జోనల్ విధానంలో జీఓ 317 ప్రకారం ప్రతిశాఖ ఏజెన్సీ ప్రాంత జీవోలను పరిగణలోకి తీసుకోకుండా జనరల్ నోటిఫికేషన్ ఇవ్వడంతో షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసీలకు రావాల్సిన ఉద్యోగాలన్నీ మైదాన ప్రాంత వాసులకి పోతున్నవి.

ఆదివాసీ వర్సెస్ లంబాడీ సమస్య ఇంకా అలానే ఉంది. అసంఖ్యాక లంబాడీలు మహారాష్ట్ర (బీసీ), ఛత్తీస్‌గఢ్ (ఎస్సీ), కర్ణాటక(ఎస్సీ), రాజస్థాన్(ఓసీ)ల నుంచి లక్షలాదిగా వలసలు వచ్చి ఆదివాసీల రిజర్వేషన్లను దోచుకుంటున్నారు. విద్య ఉద్యోగ, ఉపాధి, రాజకీయ, రంగాల్లో వీరి కారణంగా ఆదివాసీలకు అన్యాయం జరుగుతోంది. ఇటీవల సుప్రీంకోర్టు ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ రాష్ట్రాలు చేసుకోవచ్చు అని తీర్పు ఇచ్చింది. కానీ, వర్గీకరణకు ఆదివాసీలు సుముఖంగా లేరు. ముందుగా లంబాడి అక్రమవలసలని నిర్ధారణ చేయటం కోసం ఒక కమిషన్ నియమించి, వాస్తవాలను తేల్చాలి. నల్లమలలో చెంచులది దీనగాథ. చెంచులకు ఇల్లు లేని, గ్రామాలకు హోదా లేని పరిస్థితి. సరైన రోడ్లు, వైద్యం, విద్య కరెంటు లేవు. చెంచు పెంటలకు ప్రత్యేక గ్రామ గుర్తింపు లేదు.

ఆదివాసీ ప్రాంతాలనుంచి గోదావరి నీటి దోపిడీ యథేచ్ఛగా సాగిపోతోంది. దేవాదుల, తుపాకుల బ్యారేజిల నుండి మైదాన ప్రాంతాల్లోని పదమూడున్నర లక్షల ఎకరాలకు నీరు తరలించుకుపోయారు కానీ గోదావరి ఒడ్డున ఉన్న ఆదివాసీలకు చుక్క తాగునీరు లేదు, ఎకరం పంటకు సాగునీరు లేదు. ఆదివాసీలు నేటికీ వర్షాధార పంటలపైనే ఆధారపడి జీవించాల్సి వస్తున్నది.

ఐటీడీఏల నిర్వీర్యం, ఆదివాసీ భూభాగాలను ముక్కలు చేసి చిన్న జిల్లాలను సృష్టించడం, షెడ్యూల్ ప్రాంత ఉద్యోగాల దోపిడీ, ప్రకృతి వనరుల పరాయీకరణ, ఆదివాసీల స్వయం పరిపాలన సమస్య ఇత్యాది అంశాలపై ప్రభుత్వం దృష్టిపెట్టాలి. పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి, ఐటీడీఏ ద్వారానే షెడ్యూల్ ప్రాంత ఉద్యోగాలు భర్తీ కావాలి. ఐటీడీఏలకు పెద్ద మొత్తంలో నిధులు కేటాయించాలి. సింగిల్ లైన్ అడ్మినిస్ట్రేషన్ జీవో 57 అమలు చేయాలి. ట్రైబల్ అడ్వైజరీ కమిటీ ఏర్పాటు చేయాలి. 1949 ఎల్విన్ కమిషన్ నుండి, రాజ్యాంగం అమలు మొదలుకొని, 2014 వరకు కూడా ఐదవ షెడ్యూల్, 1/70, LTR, పీసా చట్టం, ఐటీడీఏల ఏర్పాటు వంటివి అన్నీ చేసింది అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వాలే. గతాన్ని దృష్టిలో పెట్టుకొని ఇప్పటి ప్రభుత్వమూ ఆదివాసీల పక్షాన నిలవాలి.

• మైపతి అరుణ్‌కుమార్
'తుడుందెబ్బ' రాష్ట్ర అధ్యక్షులు



- బోసిపోయి కనిపిస్తున్న ఆలయ పరిసరాలు
- కల్యాణ మండపం పునర్నిర్మాణంతోనే సరి
- గార్డెనింగ్ లేకపోవడంతో బోసిపోయిన వైనం
- అసౌకర్యానికి లోనవుతున్న సందర్శకులు
- చారిత్రక ప్రదేశంపై పురావస్తు శాఖ శీతకన్ను

కోవెల వెల!

వేయిస్తంభాలగుడి ఆవరణలో కానరాని పచ్చదనం

హనుమకొండ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని చారిత్రకంగా సుప్రసిద్ధమైన శ్రీ రుద్రేశ్వర స్వామివారి వేయిస్తంభాల గుడి ఆవరణ బోసిపోయి కనిపిస్తోంది. రూ.10కోట్ల వ్యయంతో గుడి ఆవరణలోని కల్యాణ మండపాన్ని పునర్నిర్మించినప్పటికీ పచ్చదనం లేక వెలవెలబోతోంది. గతంలో గుడి ఆవరణలో కాస్తంత పచ్చదనం అయినా కనిపించేది. ఇప్పుడు అది కూడా లేదు. రెండు మూడు చెట్లు తప్ప మనసుకు హాయినిగొలిపే ఆహ్లాదం కనిపించడం లేదు. సాధారణంగా ఏ దేవాలయం ఆవరణలో అయినా చిన్నదో పెద్దతో గార్డెనింగ్ ఉంటుంది. పరిసరాలు పచ్చదనంతో కళకళలాడుతూ కనిపిస్తాయి. గుడికి వచ్చిన భక్తులు దైవదర్శనం తర్వాత ఆలయ ఆవరణలో చెట్ల కింద పూల మొక్కల మధ్య మెత్తని గడ్డిపై కూర్చొని హాయిగా సేదదీరుతారు. కానీ వేయిస్తంభాలగుడిలో పరిస్థితి ఇందుకు భిన్నం. గుడి ఆవరణలో పచ్చిక బయలు, మొక్కలు వంటివి ఏవీ లేక బోసిపోయి కనిపిస్తోంది.

పట్టించుకోని పురావస్తుశాఖ

గుడి బయట ఎప్పుడో కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) చేపట్టిన సుందరీకరణ తప్ప కేంద్ర పురావస్తుశాఖ పరిధిలో గుడి ఆవరణలో మాత్రం ఎలాంటి సుందరీకరణ లేదు. పురావస్తుశాఖ పరిధిలోకి వచ్చే స్థలంలో పూచిక పుల్లను సైతం ముట్టుకోవడానికి వీలు లేదు. ఏ చిన్నపని చేయాలన్నా పురావస్తుశాఖ అనుమతి తీసుకోవాలి. పైగా ఆ పని ఆశాఖ ఆధ్వర్యంలోనే జరగాలి. నిధులు కూడా అదే సమకూర్చాలి. చివరకు మొక్కలు నాటాలన్నా ఆ శాఖ పర్మిషన్ తీసుకోవలసిందే. కేంద్ర పురావస్తు శాఖ గుడిని, గుడి పరిసరాలను పరిరక్షించడంపై చూపే శ్రద్ధను గార్డెనింగ్ చేయడంలో చూపడం లేదు. గుడి ఆవరణలో బ్యూటిఫికేషన్‌ను ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఫలితంగా చారిత్రకంగా సుప్రసిద్ధమైన, వెయ్యేళ్ల చరిత్ర కలిగిన ఈ కాకతీయుల నాటి గుడిని సందర్శకులు చూసి మురిసిపోవడంతోనే సరిపెట్టకోవలసిందే తప్ప.. కొద్దిసేపు సేదదీరే వెసులుబాటు ఏ మాత్రం లేదు.



మండపం పునర్నిర్మాణంతో సరి

రూ.10 కోట్లతో కల్యాణ మండపం పునర్మించి ఏడాది కిందట సందర్శనార్థం దీనిని తిరిగి తెరిచారు. మండపాన్ని చూసేందుకు సందర్శకులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. మండపమైతే నిర్మించారు కానీ.. దాని చుట్టూ ఇప్పటి వరకు గార్డెనింగ్ చేయలేదు. దీంతో సందర్శకులు మండపంలోనే కొద్ది సేపు గడిపి వెళుతున్నారు. విశ్రాంతిగా కూర్చొని బయటి నుంచి మండపం అందాన్ని సంపూర్ణంగా వీక్షించేందుకు వీలుగా గార్డెనింగ్ లేదు. వేయిస్తంభాల గుడి, కల్యాణ మండపం ఆవరణ అంతా మట్టితో చదును చేసి వదిలేశారు. దీంతో పచ్చదనం మచ్చుకైనా కానరావడం లేదు. ఆవరణ అంతా బోసిపోయి కనిపిస్తోంది. చెప్పులు లేకుండా సందర్శకులు, భక్తులు వెళ్లే భక్తులకు రాళ్ల గుచ్చుకొని ఇబ్బందులు పడుతున్నారు.

అనుమతిస్తే అభివృద్ధి

గుడి ఆవరణను తమకు అప్పగిస్తే సుందరీకరణ పనులు చేయడానికి కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ సిద్ధంగా ఉంది. ఇందుకు అవసరమైన నిధులను రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇప్పిస్తానని ఇటీవల గుడిని సందర్శించిన మంత్రులు సైతం చెప్పారు. గతంలో గుడి బయట రూ.5కోట్ల వ్యయంతో విస్తరణ, సుందరీకరణ పనులను కుడా చేసిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు.

సౌకర్యాలు కరువు

గుడి ఆవరణలో రెండు మూడు రాతి బెంచీలు మినహా ఎలాంటి సౌకర్యాలు లేవు. రుద్రేశ్వరుడి దర్శనం అనంతరం గుడి చుట్టూరా ఉన్న ఎత్తైన ప్రదక్షిణ పథకం, గుడి వెనుక ఉన్న నాలుగైదు చెట్ల కింద గడపాల్సిందే తప్ప.. అంతకు వి ంచిన సౌకర్యాలు లేవు. ఇది వరకు పురావస్తు శాఖ కార్యాలయం వైపు కాస్తంత గడ్డి, పూలమొక్కలైనా ఉండేవి. కల్యాణ మండపం నిర్మాణం సందర్భంగా అక్కడ శిల్పులు రాతి స్తంభాలను చెక్కడంతో ఆ మాత్రం పచ్చదనం కూడా కనిపించకుండా పోయింది.



ఆధ్యాత్మికం ఆరోగ్యం

నియమాల మాలతో అయ్యప్ప దీక్ష

- ఉమ్మడి జిల్లాలో యేటేటా పెరుగుతున్న స్వాముల సంఖ్య
- పడిపూజలతో ఉప్పొంగుతున్న భక్తిభావం

సండే స్పెషల్ SUNDAY SPECIAL

మతాలు ఏవైనా తాము నమ్మే దేవుళ్లను ఆరాధించడం ద్వారా మానసిక ప్రశాంతత పొందొచ్చని.. తద్వారా ఆరోగ్యంగా ఉండొచ్చంటూ ఎంతో మంది ఆధ్యాత్మిక వేత్తలు.. పండితులు.. ప్రబోధకులు చెబుతుంటారు. ఆధ్యాత్మికతలో భాగమైన ధ్యానం లాంటివి చేయడం ద్వారా కొన్ని సార్లు వైద్యంతో కూడా నయం కాని రుగ్మతల నుంచి ఉపశమనం దొరుకుతుందన్నది అందరికీ తెలిసిందే. ముఖ్యంగా హిందువులు ఎంతో పవిత్రంగా భావించే.. శివకేశవులకు ప్రీతికరమైన కార్తీక మాసం నుంచి సంక్రాంతి పర్వదిన సమయం వరకు అయ్యప్పదీక్షలను స్వీకరిస్తుంటారు. ఈ సమయంలో 41 రోజుల పాటు నియమాలతో కూడిన దీక్షను పాటిస్తారు. ఈ దీక్షలో క్రమశిక్షణతో పాటు ఆహారం తీసుకునే క్రమంలో పాటించే పద్ధతులతో ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని చెబుతారు. ఈ క్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా అయ్యప్ప మాలలు ధరించే వారి సంఖ్య ఏటికేడు పెరుగుతోంది. ఈ ఏడాది కూడా పడిపూజలు, పంబారట్ లాంటి కార్యక్రమాలతో సందడి కనిపిస్తోంది.

- వర్ధన్నపేట రూరల్ / కరీమాబాద్

8లో



సీఎంకు అహంకారం పెరిగింది..

- రాష్ట్ర అప్పులపై రేవంత్‌రెడ్డి చెప్పేవన్నీ తప్పులే..
- దేవుళ్లపై ప్రమాణం చేసి ఎన్నికల్లో గెలిచాడు..
- సరైన సమయంలో కేసీఆర్ బయటకు వస్తారు..
- శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి

హనుమకొండ టౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి చెబుతున్న బడ్జెట్ లెక్కలన్నీ తప్పు లేనని శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి అన్నారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, నన్నపునేని నరేందర్‌లతో కలిసి సిరికొండ మధుసూదనాచారి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మధుసూ దనా చారి మాట్లాడుతూ.. బడ్జెట్‌లో రాష్ట్ర అప్పుల లెక్క లపై సీఎం రేవంత్‌రెడ్డి అబద్దాలు చెబుతున్నాడని విమర్శించా రు. తెలంగాణ ప్రజల ప్రయోజనాలే లక్ష్యం గా పదేళ్లలో బీఆర్ఎస్ పార్టీ పనిచేసిందన్నారు. కేసీఆర్ నాయకత్వంలో అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందరికీ అందాయన్నారు. అభివృద్ధిలో తెలంగాణను దేశంలోనే మొదటి స్థానంలో కేసీఆర్ నిలిపారని తెలిపారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో హైడ్రా పేరిట కూల్చివేతలు కేసులు పెడుతూ దుర్మార్గపు పాలన సాగిస్తున్నారన్నా రు. రేవంత్‌రెడ్డి సీఎం హోదాకు తగ్గ విధంగా వ్యవహరించడం లేదన్నా రు. గతంలో ప్రతిపక్ష నేతగా వ్యవహరించినట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శించా రు. రేవంత్‌రెడ్డి భాష, వ్యవహారం మార్చుకోవాలని హితవు పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలు మోసపోయారని, ఇప్పటికైనా పద్ధతి మార్చుకొని ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై విడుదల చేసిన శ్వేతపత్రంలో రాష్ట్ర అప్పు రూ.6 లక్షల 70 వేల కోట్లు కాగా, బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.7లక్షల కోట్లు అప్పులు చేసిందని తప్పుడు ప్రచారం చేసిందన్నారు. పదేళ్ల కిందట బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడే నాటికి రూ.72,658 కోట్ల అప్పును నాటి ప్రభుత్వం స్వీకరించినట్లు, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఏడాదికే రూ.80వేల కోట్లు దాటిందన్నారు. బీఆర్ఎస్ పాలనలో చేసిన మొత్తం అప్పు రూ.3,28,499 కోట్లు అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో హైడ్రా పేరుతో కూల్చివేతలు, ప్రేలాపనలు, మంత్రుల ప్రగల్భాలు తప్ప.. కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది ఏమీ లేద న్నారు. రేవంత్‌రెడ్డి దేవుళ్లపై ప్రమాణం చేసి హామీలను విస్మరించాడన్నారు. కాలం గడిచేకొద్దీ కాంగ్రెస్ దుర్మార్గాలు, అబద్ధపు హామీల భండారం బయటప డుతుందని అన్నా రు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీలను, వారి కుట్రలను ప్రజలు తెలుసుకోలేక పోయారని అన్నారు. పదేళ్లలో అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని దేశంలోనే మొదటి స్థానంలో నిలిపిన కేసీఆర్.. రాష్ట్రంలో జరుగుతున్న పరిస్థితులను గమనిస్తున్నారని అన్నారు. కేసీఆర్ సరైన సమయంలో బయటకు వస్తారని తెలిపారు. ప్రజల సమస్యలు పట్టించుకోకుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని మధుసూదనాచారి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పరకాల, వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, నన్నపునేని నరేందర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పరశురాములు, మోడెం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న సిరికొండ మధుసూదనాచారి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు ధర్మారెడ్డి, నరేందర్


మృగరాజు.. తెల్ల పులులు..

త్వరలో జూపార్కుకు రాక

వారం రోజుల్లో రానున్న అడవి దున్నలు

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు14 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ హంటర్‌రోడ్‌లోని జూపార్కుకు త్వరలో రెండు తెల్ల పులులు, ఒక సింహం రానున్నట్లు జిల్లా అటవీశాఖ అధికారి లావణ్య తెలిపారు. అలాగే వారం రోజుల్లో రెండు అడవి దున్నలు(బైసన్)లు రానున్నాయి. 10 రోజుల కిందట జూపార్కుకు రెండు పులులు శంకర్, కరీనాలు వచ్చాయి. దీంతో హనుమకొండ, వరంగల్ జిల్లా ప్రజలతో పాటు రెండు జిల్లాల చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు కూడా జూపార్కుకు తరలివచ్చే అవకాశం ఉంది. వీటితో పాటు సందర్శకులను ఆకట్టుకునే జంతువులను కూడా తీసుకురానున్నారు. తెల్లపులులు, సింహం ఉండటం కోసం త్వరలోనే జూపార్కులో బోనులు ఏర్పాటు చేయనున్నారు.



రేపటి ప్రజావాణి రద్దు

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు14(ఆంధ్రజ్యోతి): ఈ నెల 16వ తేదీన జిల్లాలో గ్రూపు-2 పరీక్ష జరగనున్న నేపథ్యంలో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ సత్యశారద శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే సోమవారం యథావిధిగా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో ప్రజావాణి కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు దీనిని గమనించాలని ఆ ప్రకటనలో తెలిపారు.


మైనారిటీ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థినులు, ఉపాధ్యాయులతో కలిసి భోజనం చేస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

నాణ్యమైన విద్య, పౌష్టికాహారమే ధ్యేయం

పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు14(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యతా ప్రమాణమైన విద్య, పౌష్టికాహారం అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన కామన్ డైట్ మెనూను శనివారం హనుమకొండ హంటర్‌రోడ్‌లోని తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాల, కళాశాలలో ఎమ్మెల్యే నాయిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని పాఠశాలను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థినులు, ఉపాధ్యాయినులతో కలిసి ఎమ్మెల్యే భోజనం చేశారు. అనంతరం ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ.. విద్యార్థినులు కష్టపడి చదువుకుని జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. మైనారిటీల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ వెన్నంటి ఉంటుందన్నారు. విద్యార్థులకు బలవర్ధకమైన, ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించడానికే ప్రభుత్వం డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచిందన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ నీరజారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల భద్రత, పరిశుభ్రత విషయంలో అన్ని జాగ్రతలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మామిండ్ల రాజుయాదవ్, మాజీ కార్పొరేటర్ వేల్పుల మోహన్‌రావు, ఆత్మకూరు ఎంఈఓ విజయ్‌కుమార్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

గ్రూప్-2 పరీక్షలకు సిద్ధం

- హనుమకొండలో 82, వరంగల్‌లో 28 కేంద్రాలు
- అరగంట ముందే సెంటరుకు చేరుకోవాలి
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



హనుమకొండ కలెక్టరేట్/వరంగల్ కలెక్టరేట్ డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వరంగల్, హనుమకొండ జిల్లాలో గ్రూపు-2 పరీక్షలకు సర్వం సిద్ధమయ్యాయి. ఇందుకుగాను రెండు జిల్లాల యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. పరీక్ష నిర్వహణలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి పకడ్బందీగా చర్యలు తీసుకున్నారు. అన్ని పరీక్షా కేంద్రాలలో మౌలిక వసతులు కల్పించారు. విద్యుత్, తాగునీరు, వైద్య సిబ్బందిని నియమించి ఎలాంటి పొరపాట్లు జరగకుండా సజావుగా పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు. బయోమెట్రిక్, ఇన్విజిలేషన్ శిక్షణ కార్యక్రమాన్ని ఇప్పటికే నిర్వహించారు. బయోమెట్రిక్ యాప్‌ను ఎలా ఉపయోగించాలో పీపీటీ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే అభ్యర్థుల కోసం జిల్లాలోని ప్రధాన కూడళ్లలో హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ వస్తువులు, మొబైల్‌ఫోన్లకు అనుమతి లేదు. అభ్యర్థులు హాల్‌టికెట్, బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్ను, గుర్తింపు కార్డును మాత్రమే తమ వెంట తీసుకురావాల్సి ఉంటుంది.

హనుమకొండలో..

హనుమకొండ జిల్లా వ్యాప్తంగా గ్రూపు-2 పరీక్షలకు అధికారులు 82 సెంటర్లు ఏర్పాట్లు చేశారు. ఈ సెంటర్లలో 33005 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు. 160 మంది అభ్యర్థులకు ఒక బయోమెట్రిక్ చొప్పున 86 బయోమెట్రిక్ టాబ్స్ పంపిణీ చేశారు. పరీక్షల నిర్వహణకు రూట్ ఆఫీసర్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులను నియమించారు. ప్రతీ సెంటరుకు 5 నుంచి 10 మంది జూనియర్ అసిస్టెంట్లను నియమించారు. పరీక్షా కేంద్రాల వద్ద తగినంత పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేయడంతోపాటు 144 సెక్షన్ అమలులో ఉంటుంది. పరీక్షా సమయంలో జిరాక్స్ సెంటర్లు మూసివేయించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించడంతోపాటు అభ్యర్థుల కోసం తగినన్ని బస్సు సర్వీసులను నడిపించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

వరంగల్ జిల్లాలో..

వరంగల్ జిల్లా వ్యాప్తంగా గ్రూప్-2 పరీక్షకు 28 సెంటర్లు ఏర్పాట్లు చేశారు. 160 మంది అభ్యర్థులకు ఒక బయోమెట్రిక్

- మిగతా 6వ పేజీలో

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి



రాకేష్ (ఫైల్)

చెన్నారావుపేట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓవిద్యార్థి మృతి చెందిన సంఘటన మండలంలోని జల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై రాజేష్‌రెడ్డి కథనం ప్రకారం... ఇదే గ్రామానికి చెందిన సంపంగి లలిత-రమేష్‌ల పెద్ద కుమారుడు సంపంగి రాకేష్(14) గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. ఇంట్లో సెల్‌ఫోన్ చార్జింగ్‌కు కరెంట్ స్విచ్‌బోర్డులో పెట్టిన చార్జర్‌ను తీస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో కింద పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే రాకేష్‌ను నర్సంపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కాగా, మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలి మృతి



గమ్మి (ఫైల్)

పర్వతగిరి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పదస్థితిలో వృద్ధురాలు మృతిచెందిన సంఘటన మండలంలోని పెద్దతండాలో శనివారం జరిగింది. పోలీసులు, మృతురాలి కుమారుడు భూక్యా దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం... తండాకు చెందిన భూక్యా గమ్మి (55)కి ఈనెల 3వ తేదీన ఆమె కోడలు భూక్యా మంజుల కూల్‌డ్రింక్ తీసుకుని వచ్చి గ్లాసులో పోసి తాగించింది. కూల్‌డ్రింక్ తాగిన అనంతరం ఆమెకు వాంతులు కావడంతో గమనించిన ఆమె కుమారుడు దేవేందర్ స్థానికంగా ఆర్ఎంపీ వైద్యుని వద్దకు, అక్కడనుంచి తొర్రూరులోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడినుంచి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా, ఈనెల 13వ తేదీన మృతి చెందింది.

కాగా, తన భార్య మంజులకు తల్లి గమ్మికి మూడేళ్లుగా తరచూ గొడవలు జరుగుతున్నాయని, దీంతో తన భార్య కావాలనే కూల్‌డ్రింక్‌లో గుర్తుతెలియని విషం కలిపి తాగించి ఉండవచ్చని అనుమానిస్తూ మృతురాలి కుమారుడు దేవేందర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు గమ్మి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం మార్చురీకి తరలించి కేసు విషయమై దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి మత్తులో రైల్వే స్టేషన్‌లో యువకుడి హల్‌చల్

- రైల్వే టికెట్ల కౌంటర్ నుంచి టికెట్ల బెండల్ అపహరణ



రైల్వేస్టేషన్‌లో యువకుడిని బంధించిన ప్రయాణికులు

నెక్కొండ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఒరిస్సా రాష్ట్రానికి చెందిన యువకుడు గంజాయి మత్తులో హల్‌చల్‌చేశాడు. ప్రయాణికులను భయబ్రాంతులకు గురిచేయడమే కాకుండా రైల్వే స్టేషన్‌లోని టికెట్ కౌంటర్ నుంచి టికెట్ల బెండల్‌ను ఎత్తుకొని పారిపోతుండగా ప్రయాణికులు పట్టుకున్నారు. ఈసంఘటన శనివారం నెక్కొండ స్టేషన్‌లో చోటుచేసుకుంది. ప్రయాణికులు, బుకింగ్ క్లర్క్ నిర్మలాదేవి తెలిపిన వివరాల ప్రకారం..

ఒరిస్సాకు చెందిన 25ఏళ్లున్న యువకుడు గంజాయి మత్తులో ప్రయాణికులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తూ, అడ్డువచ్చిన వారిని హిందీలో దూషించాడు. రైల్వే టికెట్ కౌంటర్‌లో ఉన్న టికెట్ల బెండల్‌ను ఎత్తుకొని పారిపోతుండగా ప్రయాణికులు వెంబడించారు. వారిపై రాళ్లను విసురుతూ కొద్ది దూరం పారిపోయాడు. ప్రయాణికులు యువకుడిని పట్టుకోగా, రెండు, మూడు టికెట్లను చించిన టికెట్ బెండల్‌ను అతడి వద్దనుంచి లాక్కున్నారు. అనంతరం యువకుడిని తాళ్లతో కట్టివేసి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చెరుకున్న ఎస్సై మహేందర్ యువకుడిని అదుపులోకి తీసుకున్నాడు. అయితే మత్తులో ఉండి ఎలాంటి వివరాలు చెప్పడంలేదని ఎస్సై చెప్పారు. యువకుడు ఎత్తుకెళ్లిన టికెట్ల బెండల్ విలువ లక్షలో ఉంటుందని రైల్వే అధికారులు చెప్పారు.

కామన్ డైట్ మెనూ చార్జీల పెంపు కోసం రూ.470 కోట్లు

- తెలంగాణ గురుకుల పాఠశాలల సొసైటీల రాష్ట్ర ఉప సంచాలకులు సునయన చౌహాన్



విద్యార్థులు చేస్తున్న భోజనాన్ని పరిశీలిస్తున్న సునయన చౌహాన్

భీమదేవరపల్లి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించే లక్ష్యంగా కామన్ డైట్ మెనూ, కాస్మోటిక్ చార్జీల కోసం రూ.470కోట్లు విడుదల చేసిందని తెలంగాణ గురుకుల పాఠశాలల సొసైటీల రాష్ట్ర ఉప సంచాలకులు సునయన చౌహాన్ అన్నారు. శనివారం మండలంలోని వంగర డాక్టర్ పీవీ రంగారావు గురుకుల పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కామన్ డైట్ మెనూ ప్రారంభ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలోనే ప్రభుత్వం ఎనిమిదేళ్ల తర్వాత డైట్ చార్జీలు 40శాతం పెంచడంతో విద్యార్థులకు భోజన, తదితర అంశాల్లో వెసులుబాటు కలుగుతుందన్నారు. 3నుంచి 7తరగతులకు రూ.1630, 8నుంచి 10వ తరగతి వరకు రూ.1540, ఇంటర్ నుంచి పీజీ వరకు రూ.2100 పెంచామన్నారు. అలాగే కాస్మోటిక్ చార్జీలను 200శాతం పెంచినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల పాఠశాలల కామన్ మెను డైట్‌ను తల్లిదండ్రుల సమక్షంలో ప్రారంభించామన్నారు. మాజీ ప్రధాని పీవీ స్వగ్రామం వంగరలో ఈ కార్యక్రమంలో పాల్గొనడంపై సునయన్ చౌహాన్ ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం ప్రిన్సిపాల్ అఫ్రీన్ సుల్తానా మాట్లాడుతూ.. 8 ఏళ్ల తర్వాత తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు 40శాతం డైట్ చార్జీలను తరగతుల వారీగా ప్రభుత్వం పెంచిందన్నారు. తెలంగాణ ఎల్‌పీజీ డీలర్ల సంఘం అధికార ప్రతినిధి పీవీ మదన్‌మోహన్‌రావు మాట్లాడుతూ.. డైట్ చార్జీలతో పాటు కాస్మోటిక్ చార్జీలు పెంచడం, పండుగ వాతావరణంలో ప్రారంభించడం ప్రభుత్వానికి పేద విద్యార్థులపై ఉన్న మమకారాన్ని తెలియజేస్తుందన్నారు. రాష్ట్రంలో 8లక్షల మంది విద్యార్థులు గురుకుల పాఠశాలలో చదువుతున్నారని తెలిపారు. గ్యాస్ ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్యాస్ లీకేజీని గమనిస్తే 1906 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. ఈ సందర్భంగా మన వంట గది.. మన భద్రతపై రూపొందించిన స్టిక్కర్లను ఆవిష్కరించి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పద్మ, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ భార్గవి, చైర్మన్ హేమలత, రజిత, మాజీ అధ్యక్షుడు అణపురం రమేష్, శ్రీరామోజు మొండయ్య, దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు వైభవ లక్ష్మి షాపింగ్ మాల్ ప్రారంభం

- ముఖ్య అతిథులుగా స్పీకర్, మంత్రులు



వైభవ లక్ష్మి షాపింగ్ మాల్ బ్రోచర్‌ను విడుదల చేస్తున్న నిర్వాహకులు

వరంగల్ చౌరస్తా, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వరంగల్ చౌరస్తాలో ఆదివారం ఉదయం 11 గంటలకు వైభవలక్ష్మి షాపింగ్ మాల్ ప్రారంభిస్తున్నామని డైరెక్టర్లు వర్రి లలిత్, ప్రదీప్‌కుమార్ బజాజ్, సూరజ్ సరడ, రిషిత తెలిపారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు కొండా సురేఖ, ధనసరి అనసూయ (సీతక్క), ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కడియం శ్రీహరి, కేఆర్.నాగరాజు, దొంతి మాధవరెడ్డి, శాసన మండలి వైస్‌చైర్మన్ బండా ప్రకాష్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మేయర్ గుండు సుధారాణి, స్థానిక కార్పొరేటర్ గందె కల్పన హాజరవుతారని తెలిపారు. ప్రారంభ వేడుకల సందర్భంగా రూ.10వేల వస్త్రాలు కొనుగోలు చేసిన వారికి ఉచితంగా బంగారు నాణెం ఇస్తున్నామని, విద్యార్థుల కోసం ప్రత్యేక డిస్కౌంట్ ఇస్తామని ప్రకటించారు. ఈ వేడుకలకు ప్రజలందరూ తరలిరావాలని వారు శనివారం ఒక ప్రకటనలో కోరారు.

రేపు జిల్లా స్థాయి క్రాస్ కంట్రీ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16న హనుమకొండ జేఎన్ఎస్‌లో జిల్లా స్థాయి క్రాస్ కంట్రీ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-16, 18, 20బాలబాలికల, మెన్ అండ్ ఉమెన్ విభాగాల్లో క్రాస్ కంట్రీ ఎంపిక పోటీలు నిర్వహించనున్నామన్నారు.

ఆయిల్‌పామ్ సాగు చేస్తే..

- ఎకరానికి రూ.51 వేల రాయితీ
- డీహెచ్‌వో వెంకటేశ్వరు



ఆంధ్రజ్యోతి: ఆయిల్‌పామ్ సాగు కోసం రైతులకు ఇస్తున్న రాయితీలు ఏమిటి?

డీహెచ్‌వో: ఆయిల్‌పామ్ సాగు కోసం ప్రభుత్వం నుంచి ఎకరాకు రూ.51వేల రాయితీని ఇస్తాం.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో ఆయిల్‌పామ్ విస్తీర్ణం ఎంత ఫ్యాక్టరీ నిర్మాణం పనులు ఎంత వరకు వచ్చినవి..?

డీహెచ్‌వో: హనుమకొండ జిల్లాలో ఆయిల్‌పామ్ 2,892 ఎకరాల విస్తీర్ణం సాగులో ఉంది, కొనుగోలు కోసం బావుపేట, తిమ్మాపూర్‌లో రెండు కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేశాం. జిల్లాలో 10 వేల ఎకరాలలో విస్తీర్ణం ఉంటే ఫ్యాక్టరీ నిర్మాణం చేపడుతాం.

ఆంధ్రజ్యోతి: ఇతర పంటలకు బిందు సేద్యానికి ప్రభుత్వం మంజూరు చేస్తుందా..?

డీహెచ్‌వో: అవును. ఇతర ఉద్యాన పంటలకు ఎస్సీ, ఎస్టీలకు వందశాతం, చిన్న, సన్నకారు రైతులకు 90శాతం, ఇతరులకు 80 శాతం రాయితీలు ప్రభుత్వం అందిస్తుంది. రైతులు దరఖాస్తు చేసుకోవాలి

ఆంధ్రజ్యోతి: జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు పెరగటానికి తీసుకుంటున్న చర్యలు ఏమిటీ..?

డీహెచ్‌వో: జిల్లాలో రైతులకు ఆయిల్‌పామ్ గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఎక్స్‌పోజర్ విజిట్ చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ఉద్యాన శాఖనుంచి అందిస్తున్న రాయితీలు..?

డీహెచ్‌వో: ఆయిల్‌పామ్‌కు, బిందుసేద్యానికి, కూరగాయల సాగుకు ప్రభుత్వం తోడ్పాటును అందిస్తుంది.

- హనుమకొండ టౌన్

నేడు ఫాతిమానగర్‌లో ఐక్య క్రిస్మస్ వేడుకలు



మాట్లాడుతున్న ఉడుముల బాల

కాజీపేట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాజీపేట ఫాతిమానగర్ అంథోని కళాపుణ్యక్షేత్రంలో ఆదివారం సాయంత్ర 6గంటలకు మెగా ఐక్య క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నామని, ఈ వేడుకలకు ప్రతీ ఒక్కరు హాజరై విజయవంతం చేయాలని వరంగల్ బిషప్ ఉడుముల బాల చెప్పారు. కాజీపేట మీడియా పాయింట్‌లో శనివారం ఆయన మాట్లాడారు. క్రిస్మస్ వేడకలు పురస్కరించు కుని పలు డ్యాన్స్, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నామని, విజేతలకు బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో బిషప్‌లు జాన్ మార్కండే య, డాన్యూయేల్ కళ్యాణపు పాల్గొన్నారు.

చిప్ప వెంకటేశ్వర్లుకు ఘన సన్మానం



చిప్ప వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న డాక్టర్ కూరపాటి రమేశ్

వరంగల్ మెడికల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : బాబా సాహెబ్ డాక్టర్ బీ.ఆర్‌అంబేద్కర్ జాతీయ అవార్డు గ్రహీత చిప్ప వెంకటే శ్వర్లును శనివారం కూరపాటి హాస్పిటల్స్‌లో ఘనంగా సన్మానించారు. ఈ నెల 9న ఢిల్లీలో 40వ దళిత సాహిత్య అకాడమీ వార్షికోత్సవంలో వరంగల్ జిల్లా నుంచి జాతీయ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లును శాలువాతో ఘనంగా సన్మానించి సత్కరించారు. కార్యక్రమంలో పాము సత్యనారాయణ, దానం రాజయ్య, కూరపాటి హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

- వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు



పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు

మడికొండ, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధే తన ధ్యేయమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కే. ఆర్. నాగరాజు అన్నారు. శనివారం గ్రేటర్ వరంగల్ 44, 46 డివిజన్ల పరిధిలో రూ.4.80 కోట్ల స్మార్ట్ సిటీ నిధులతో చేపట్టే పలు అభివృద్ధి కార్యక్రమాలకు మేయర్ గుండు సుధారాణితో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ పాలనలో సంక్షేమం, అభివృద్ధి జోడెడ్ల మాదిరి సాగుతున్నాయని స్పష్టం చేశారు. అర్హులైన లబ్ధిదారులకు త్వరలో రేషన్ కార్డులు, డిజిటల్ ఆరోగ్యశ్రీ కార్డులు, నియోజకవర్గానికి 35వేల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. దశలవారీగా అన్ని డివిజన్లలో సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తి చేస్తామని తెలిపారు. రోడ్ల నిర్మాణ పనుల్లో కాలనీ వాసులు ప్రభుత్వానికి సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. సమస్యలు ఏవైనా ఉంటే డయల్ యువర్ ఎమ్మెల్యే 8096107107 నెంబర్‌కు కాల్ చేస్తే వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

కార్యక్రమంలో కార్పొరేటర్ మునిగాల సరోజన, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సారంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నర్మెట వెంకటరమణగౌడ్, కాంగ్రెస్ నాయకులు గుంగుల శ్రీనివాస్‌రెడ్డి, వస్కుల శంకర్, కుర్ల మోహన్, బైరి లింగమూర్తి, గుగ్రం జ్యోతీఅమర్‌నాథ్, బిల్ల రవిందర్, రసజ్ఞ, వస్కుల నాగరాజ్, వస్కుల శ్రీను, రాజారపు స్వామి పాల్గొన్నారు.

గ్రూపు-2 పరీక్షలకు సిద్ధం

(5వ పేజీ తరువాయి)

చొప్పున 86 బయోమెట్రిక్ టాబ్స్ పంపిణీ చేశారు. ఐదుగురు రూట్ ఆఫీసర్లు, 28 డిపార్ట్‌మెంటల్ అధికారులను నియమించారు. ప్రతీ సెంటరుకు 5 నుంచి 10 మంది జూనియర్ అసిస్టెంట్లను నియమించారు. పరీక్షా కేంద్రాల వద్ద తగినంత పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేయడంతోపాటు 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. పరీక్షా సమయంలో జిరాక్స్ సెంటర్లు మూసివేయించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించడంతో పాటు అభ్యర్థుల కోసం తగినన్ని బస్సు సర్వీసులను నడిపించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

అరగంట ముందే చేరుకోవాలి

పరీక్షా కేంద్రంలోకి అభ్యర్థులను అరగంట ముందుగానే అనుమతిస్తారు. నిమిషం ఆలస్యమైన పరీక్షా కేంద్రంలోని అనుమతించరు. ప్రతీ అభ్యర్థికి బయోమెట్రిక్ హాజరు నమోదు ఉండటంతో అభ్యర్థులు సకాలంలో చేరుకోవాల్సి ఉంటుంది. రోజుకు రెండు పేపర్ల చొప్పున రెండు రోజుల పాటు పరీక్ష నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్ష జరగనుంది.

జాతీయ లోక్ అదాలత్‌లో 6,303 కేసుల పరిష్కారం



జాతీయ లోక్ అదాలత్‌ను ప్రారంభిస్తున్న జడ్జి నిర్మలాగీతాంబ

వరంగల్ లీగల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా లోక్ అదాలత్ నిర్వహించి మెత్తం 6,303 కేసులు పరిష్కరించినట్లు వరంగల్ జిల్లా జడ్జీ నిర్మలాగీతాంబ తెలిపారు. జాతీయ రాష్ట్ర న్యాయ సేవాసంస్థల ఆదేశానుసారం శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించినట్లు ఆమె పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 31 బెంచిలు ఏర్పాటు చేశామని తెలిపారు. సివిల్ కేసులు 9, ప్రమాదబీమా కేసులు 41 పరిష్కరించి బాధితులకు రూ.2కోట్ల 65 లక్షల 40 వేలు ఇప్పించారు. అలాగే 435 క్రిమినల్ కేసులు, బ్యాంక్ ప్రీలిటికేషన్ 20 కేసులు పరిష్కరించినట్లు ఆమె తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా ఎస్‌బీఐ, ఏపీజీవీబీ, బ్యాంకుల ఆధ్వర్యంలో 700 మంది కక్షిదారులకు పులిహోర ప్యాకెట్లు అందించారని పేర్కొన్నారు. అంతకు ముందు ఉదయం 10 గంటలకు జాతీయ లోక్‌అదాలత్‌ను ప్రారంబించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జీ మాట్లాడుతూ.. రాజీ మార్గం ద్వారా నిర్వహిస్తున్న లోక్ అదాలత్‌లో కక్షిదారులు పాల్గొని తమ కేసులు పరిష్కరించుకోవాలని న్యాయమూర్తి సూచించారు.

ఈ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయమూర్తులు జి. ప్రేమలత, మనీషా శ్రావణ్ ఉన్నమ్, బి.అపర్ణాదేవి, వరంగల్, హనుమకొండల జిల్లాల న్యాయ సేవాసంస్థల కార్యదర్శులు. ఎం.సాయికుమార్, క్షమా దేశ్‌పాండే, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారదాదేవి, ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్‌రావు, వరంగల్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ తీగల జీవన్‌గౌడ్, హనుమకొండ, వరంగల్ చీఫ్ లీగల్ ఏడ్ కౌన్సిల్స్ శ్రీకాంత్, సురేశ్, ఇతర న్యాయవాదులు లోక్‌అదాలత్ బెంచ్ సభ్యులు, వివిధ బ్యాంక్ ఇన్సూరెన్స్ అధికారులు, కక్షిదారులు, పోలీసులు పాల్గొన్నారు.

భూ వివాదంలో కానిస్టేబుల్‌పై కేసు నమోదు

ఐనవోలు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): భూ వివాదంలో కానిస్టేబుల్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. ఐనవోలుకు చెందిన అన్నదమ్ములు అమరవాది రమేష్, కుమారస్వామిలు ఏఆర్ కానిస్టేబుల్స్‌గా విధుల నిర్వహిస్తున్నారు. ఇంటి దారి భూమి విషయంలో ఇద్దరి మధ్య వివాదం తలెత్తి కోర్టులో కేసు నడుస్తోంది. ఈ క్రమంలో అన్న రమేష్ కొందరి సహాయంతో భూమిలో నాటిన కనీలను ధ్వంసం చేసి ఇనుప కంచెను తొలగించాడు. కుమారుస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరిపి భూమిలోకి అక్రమంగా ప్రవేశించి కనీలను ధ్వంసం చేసినందుకు అన్న రమేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. గతంలో కుమారస్వామిపై ఇదే భూమి విషయంపై అన్న రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ రైతు మృతి



అనంతరెడ్డి(ఫైల్)

దామెర, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఓ రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి, చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన శనివారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై కొంక అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఒగ్లాపూర్ గ్రామానికి చెందిన రైతు మన్నెం అనంతరెడ్డి(65) 5ఎకరాల వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. వ్యవసాయం సాగు, కుటుంబ ఖర్చుల నిమిత్తం రూ.4 లక్షల రూపాయల వరకు అప్పులు చేశాడు. చేసిన అప్పులను ఎలా తీర్చాలనే మనస్థాపంతో ఈనెల 6న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. మృతుడి భార్య రాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్య



కిరణ్ (ఫైల్)

దామెర, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): భార్య కాపురానికి రావడం లేదంటూ భర్త ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై కొంక అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మాదారపు కిరణ్(42) కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటు న్నాడు. కుటుంబ కలహాల కారణంగా 8సంవత్సరాలుగా భార్య కాపురానికి రావడం లేదు. దీంతో మనస్థాపానికి గురైన కిరణ్ ఈనెల 13న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడి, మృతి చెందాడు. శనివారం మృతుడి తండ్రి బుగులయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు స్వెట్టర్ల పంపిణీ



స్వెట్టర్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్

కాజీపేట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాజీపేట మినీ మునిసిపాలిటీలో శనివారం 30 మంది పారిశుధ్య కార్మికులకు స్థానిక కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ స్వెట్టర్లను పంపిణీ చేశారు. మున్సిపల్ సిబ్బందికి చలి నుంచి రక్షణ కల్పించేందుకే స్వెట్టర్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వెంకన్న, జవాన్‌లు సుశీల్, కొమ్ము అనుదీప్ వర్ధన్ తోపాటు మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికులకు దుప్పట్లు అందజేత



పారిశుధ్య కార్మికులకు దుప్పట్లను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ చీకటి శారద ఆనంద్

హనుమకొండ చౌరస్తా, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 9వ డివిజన్‌లో విధులు నిర్వహిస్తున్న మునిసిపల్ పారిశుధ్య కార్మికులకు స్థానిక డివిజన్ కార్పొరేటర్ చీకటి శారద ఆనంద్ శనివారం దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శారద ఆనంద్ మాట్లాడుతూ.. చలి నుంచి కార్మికులు రక్షణ పొందేందుకు దుప్పట్లు దోహద పడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చీకటి ఆనంద్, సంపత్, మునిసిపల్ కార్మికులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి
స్థలం కేటాయించాలి

మడికొండ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మడికొండకు చెందిన అయ్యప్ప సేవా సమితి సభ్యులు శనివారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు, రాష్ట్ర ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్ ఛైర్మన్ జంగా రాఘవరెడ్డిని శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మెట్టుగుట్టపై అయ్యప్ప స్వామి దేవాలయం నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని కోరారు. ఈ మేరకు స్పందించిన ఎమ్మెల్యే జంగా రాఘవరెడ్డిలు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, సీఎం రేవంత్ దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లి దేవాలయ నిర్మాణానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు సేవా సమితి సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప సేవా సమితి గౌరవ సభ్యులు ఓర్సు యాకయ్య, మెట్టుగుట్ట ఛైర్మన్ పైడిపాల రఘుచందర్, మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, పీఏసీఎస్ డైరెక్టర్ దువ్వ శ్రీకాంత్, పల్లపు అర్జున్, వస్కుల శంకర్, పల్లపు నర్సింగరావు, కుర్ల మోహన్, భైరి కొమురయ్య, బుర్ర రాజన్‌బాబు, దువ్వ నవీన్, దువ్వ విజయ్, ఆలకుంట్ల దుర్గయ్య, దండిగం సతీష్, అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.

పేదలకు ఉచిత విద్య, వైద్యం అందించాలి

▸ డీఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు మంద రమేష్



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న మంద రమేష్

వడ్డెపల్లి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి ప్రజలైన ఎస్సీ, ఎస్టీ , బీసీ, ఈబీసీలకు ఉచిత విద్య, వైద్యం, ఉపాధి ఇల్లు, భూమి అనే ఐదు ప్రాథమిక అత్యవసరాలను అందించాలని ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్ పీ) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మంద రమేష్ డిమాండ్ చేశారు. శనివా రం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలందరికీ ఐదు ప్రాథమిక అత్యవసరాలను అందించాలని తమ పార్టీ ఆధ్వర్యంలో నెల రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రూపాలలో పోరాట కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. అయి నప్పటికీ ప్రభుత్వం స్పందించక నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. ప్రజలందరికీ ఐదు ప్రాథమిక అత్యవసరాలను అందించాలనే ప్రధాన డిమాండ్‌తో ఈనెల 16న హనుమకొండ కలెక్టరేట్ వద్ద ఆమరణ నిరా హార దీక్ష చేపట్టనున్నట్లు మంద రమేష్ తెలిపారు. ప్రజాస్వామిక వాదులు, మేధావులు తమ ఆమరణ నిరాహార దీక్షకు సంపూర్ణ మద్దతు ప్రకటించాలని కోరారు. ఈ సమావేశంలో డీఎస్‌పీ జిల్లా నాయకులు బరిగెల బాబు, మైదం రవీందర్, కొట్టె ఏసోబు, కోగిల రూప, సోమిడి నరేష్, వేలేరు ప్రసాద్, నాగ రాజు, రజినీకాంత్, ఎల్లస్వామి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో నూతన డైట్ కార్యక్రమం

న్యూశాయంపేట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ హంటర్‌రోడ్ లోని ధర్మసాగర్ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలో శనివారం నూతన డైట్ కార్యక్రమం పండుగలా జరిగింది. ముఖ్య అతిథిగా ఐసీడీఎస్ సీడీపీవో ఎం.విశ్వజ పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విశ్వజ విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయినులతో కలిసి భోజనం చేశారు. పాఠశాల ప్రిన్సిపల్ సల్ల శైలజ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో దేవీ ప్రసాద్, ఇందిరా, శ్రీలక్ష్మీ, అమూల్య, మాడిశెట్టి సుధ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు దత్త జయంతి

▸ ఆలయాల్లో అభిషేకాలు, పూజలు, హోమాలు



గంధం అలంకరణలో దత్తాత్రేయ స్వామి (ఫైల్)

వరంగల్ కల్చరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గురు పరంపరకే గురు వుగా నిలిచిన ఆదిగురువు అవధూత దత్తాత్రేయ స్వామి జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు దేవాలయాల్లో దత్తా త్రేయ జయంతి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. హోమం, దివ్యనామ సంకీర్తనలు, భజనలు, అభిషేకాలు, హారతులతో పూజలు నిర్వహించి మహా అన్నప్రసాద వితర ణ చేస్తారు. రాత్రికి దత్త కాగడ హార తులను నిర్వహించి పవలింపు సేవ నిర్వహిస్తారు. ములుగురోడ్ లోని శ్రీగణపతి సచ్చిదానంద వరద దత్తక్షేత్రం, హనుమకొండలోని శ్రీషిర్డీ సాయిబాబా దేవాలయం, భద్రకాళి ఆలయ సమీపంలోని శ్రీషిర్డీ సాయి బాబా దేవాలయం, ఖిలా వరంగల్, ఓసిటీ, మామునూరు, పెద్దమ్మగడ్డ, యాదవ నగర్, గోపాల్‌పూర్, కాశిబుగ్గతో పాటు పలు భజన మందిరాల్లో దత్తజయంతి వేడుకలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు.

విద్యా ప్రమాణాల మెరుగుదలతోనే సమాజ వికాసం

▸ వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు



ఎర్రగట్టు వద్ద గురుకులంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు

హసన్‌పర్తి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : విద్యా ప్రమాణాల మెరుగుదలతోనే సమాజ వికాసం చెందుతుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. మండలంలోని ఎర్రగట్టుగుట్టు క్రాసురోడ్డు తెలంగాణ బాలికల గురుకుల విద్యాలయం, కళాశాలలో శనివారం ఎమ్మెల్యే, ఇన్‌చార్జి కలెక్టర్ సత్యశారద కామన్ డైట్ మెనూ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కామన్ డైట్ మెనూను పకడ్బందీగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. అన్ని గురుకుల విద్యాలయాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పెంచిన 40 శాతం చార్జీలను అమలుతో పాటు విద్యార్థినులకు 200 శాతం పెంచిన కాస్మోటిక్ చార్జీలు సకాలంలో అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏకరీతి ఆహార ప్రణాళిక ఏర్పాటు చేసి విద్యార్థులకు పోషకాలతో కూడిన రుచికరమైన ఆహారాన్ని అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రతీ విద్యార్థిని తమ స్వీయభద్రతతో పాటు సైబర్ నేరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అనంతరం హసన్‌పర్తి, దేవన్నపేటలోని పలు డివిజన్‌లలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలతో పాటు నమూనా ఇందిరమ్మ ఇండ్లు, కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీజీఆర్ఎస్ ప్రధానోపాధ్యాయుడు కె.అశోక్‌రెడ్డి, టీఆర్‌జేసీ ప్రధానోపాధ్యాయురాలు ఇందుమతి, తహసీల్దారు చల్ల ప్రసాద్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, హౌసింగ్ నోడల్ ఆఫీసర్ రాజేందర్, మండల వ్యవసాయ అధికారి అడ్లూరి అనురాధ, డివిజన్ కార్పొరేటర్ అరుణకుమారి, మార్కెట్ వైస్ ఛైర్మెన్ తంగెళ్లపల్లి తిరుపతి, కేయూ పాలక మండలి సభ్యుడు చిర్ర రాజు, కిసాన్ జిల్లా అధ్యక్షుడు పింగిళి వెంకట్రాం నర్సింహారెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి మహెందర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించమే ప్రభుత్వ లక్ష్యం

కాజీపేట : విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. కాజీపేట బీసీ హాస్టల్‌లో శనివారం హాస్టళ్లలోని విద్యార్థులకు పెంచిన మెనూ చార్జీల అమలును ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం పాఠశాలను, భోజనశాల, తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాతనే వసతి గృహాల్లో మెస్‌చార్జీలు పెంచిందన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రీతిగా ఆహార ప్రణాళికను ఏర్పాటు చేసిందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మంచిగా చదువుకుని భవిష్యత్‌లో స్థిరపడాలన్నారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ వై.శంకరయ్య, స్థానిక కార్పొరేటర్‌లు విజయ శ్రీరజాలీ, జక్కుల రవీందర్ యాదవ్, మాజీ కార్పొరేటర్‌లు గుంటి కుమారస్వామి, సుంచు అశోక్, నాయకులు ఎండీ అంకూస్, అంజి, నాయకులు పాల్గొన్నారు.

● వరంగల్ మెడికల్: రాష్ట్రంలోని అన్ని సంక్షేమ వసతి గృహాల్లో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యూనిఫామ్ డైట్ ప్రారంభోత్సవంలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు హనుమకొండ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎ.అప్పయ్య ఎస్సీ జూనియర్ కాలేజ్ హాస్టల్‌ను ఎల్కతుర్తి ఎంపీడీవోతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ.. ప్రస్తుతం పిల్లలు సంక్షేమం ఆలోచించి 40శాతం డైట్ చార్జీలు పెంచిందన్నారు. చదువు పట్ల విద్యార్థులు శ్రద్ధ వహించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. పిల్లలు ఔట్‌డోర్ గేమ్స్‌కు సరిపోయినంత ప్లేగ్రౌండ్ లేకపోవడం గమనించిన డీఎంహెచ్‌వో వారికి క్యారం బోర్డు, చెస్‌బోర్డు బహుకరించారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ ఆఫీసర్ రవికుమార్, ఎంపీడీవో విజయ్ క ఉమార్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

మడికొండ: గురుకులాల్లో చదివే విద్యార్థులకు ఉజ్వలమైన భవిష్యత్తు ఉంటుందని జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ మల్లయ్య అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం మడికొండలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల/కళాశాలలో ప్రిన్సిపాల్ దాసరి ఉమామహేశ్వరి అధ్యక్షతన విద్యార్థినుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గురుకులాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి అన్ని సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. డైట్ చార్జెస్ పెంచడమే కాకుండా విద్యార్థులకు సమాన ఆహారం అందించాలనే ఉద్దేశంతో కామన్ మెనూ డిజైన్ చేసిందన్నారు. గురుకులాల్లో పోషకాహార లోపంతో సమస్యలు ఎదుర్కొనే పేద విద్యార్థులకు ప్రభుత్వం అందించే పౌష్టికాహారం వరం లాంటిదన్నారు. ప్రభుత్వం అందించే అవకాశాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. ఈసందర్భంగా విద్యార్థినులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సమావేశంలో కాజీపేట తహసీల్దార్ బావుసింగ్, ఆర్ఐ క్రిష్ణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● హసన్‌పర్తి : మండలంలోని ఎల్లాపూర్ శివారు మహాత్మాజ్యోతిరావు పూలే బాలికల గురుకుల విద్యాలయంలో ప్రిన్సిపాల్ శోభారాణి అధ్యక్షతన జరిగిన కామన్ డైట్ మెనూను అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ టెక్స్‌టైల్ అండ్ హ్యాండ్లూమ్ అధికారిణి విజయలక్ష్మి, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏటీపీ పద్మా, డిప్యూటీ వార్డెన్ మాధవి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మండలంలోని ఎల్లాపూర్ శివారు మహాత్మాజ్యోతిరావు పూలే హనుమకొండ బాలికల గురుకుల కళాశాలలో శనివారం నిర్వహించిన కామన్ డైట్ మెనూ కార్యక్రమాన్ని హనుమ కొండ జిల్లా విద్యా శాఖ అధికారి డి.వాసంతి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుపై ఆలోచిస్తూ అందిస్తున్న అన్ని రకాల వసతులను సద్వినియోగం చేసుకొని విద్యా ప్రగతిలో ఉన్నతంగా రాణించాలన్నారు. కార్యక్రమంలో భీమదేవరపల్లి ఎంఈవో సునితారాణి, ప్రిన్సిపాల్ ఎ.శ్వేత, అధ్యాపకసిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.



మడికొండలో మాట్లాడుతున్న జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ మల్లయ్య

చిరువ్యాపారులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కాజీపేట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): చిరువ్యాపారులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలి, తొలగించిన షెడ్‌లను వెంటనే పునర్నిర్మించాలని జీడబ్ల్యూఎంసీ చిరువ్యాపారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.డి. ఇస్మాయిల్, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు నాయిని రవి డిమాండ్ చేశారు. కాజీపేట మీడియా పాయింట్‌లో శనివారం వారు మాట్లాడారు. చిరువ్యాపారుల రక్షణ చట్టం 2014 ప్రకారం వారి హక్కులను ప్రభుత్వం భంగం కలిగించవద్దన్నారు.

నగరంలో 20వేల కటుంబాలు చిరువ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, ప్రస్తుతం వారి షెడ్‌లను తొలగించడం వల్ల వారంతా జీవనోపాధి కోల్పోతున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే తిరిగి షెడ్‌లు ఏర్పాటు చేసి, మున్సిపాలిటీ గుర్తింపు కార్డులు అందించాలన్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశంలో ఏర్పాటు చేసి వారి హక్కులు అమలయ్యేవిధంగా చర్యలు చేపట్టి బ్యాంకు రుణాలు అందించాలని కోరారు.

ఈ సమావేంలో నాయకులు ఇ.మల్లేశం, హోటల్స్ యూనియన్ అధ్యక్షులు రఘు, అరుణ్, శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అసమానతలు అరికట్టాలి

▸ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

హసన్‌పర్తి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): దేశంలో పెరుగుతున్న ఆర్థిక అసమానతలను అరికట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం జరిగిన హనుమకొండ సీపీఎం పార్టీ బహిరంగ సభకు ఆయన ముఖ్య అతిథులుగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం 10 ఏళ్ల నుంచి అనుసరిస్తున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాలు పారిశ్రామిక, వ్యవసాయ రంగాన్ని దివాలా తీశాయన్నారు. దేశంలో ఆర్థిక అసమానతలు పెద్ద ఎత్తున పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు చెమటోడ్చి నిర్మించిన ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అంబానీ, అదానీలాంటి బడా కార్పొరేట్ సంస్థలకు కారుచౌకగా కట్టబెడుతోందన్నారు. అనంతరం జి.నాగయ్య మాట్లాడుతూ.. దేశంలో ప్రజాస్వామ్యం, రాష్ట్రాల హక్కులు, రాజ్యాంగంపై దాడిచేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. పోతినేని సుదర్శన్‌రావు మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాలయాపన చేస్తోందని విమర్శించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చక్రపాణి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, చుక్కయ్య, జిల్లా కమిటీ సభ్యులు రాగుల రమేష్, వాంకుడోతు వీరన్న, వెంకట్, దీప, తిరుపతి, మండల కార్యదర్శి గుమ్మడిరాజుల రాములు, పుల్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి

▸ శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు మధుసూదనాచారి

▸ ఎస్ఏ కాంట్రాక్ట్ ఉద్యోగుల దీక్షకు సంఘీభావం



దీక్షలను ఉద్దేశించి మాట్లాడుతున్న మధుసూదనాచారి

హనుమకొండ టౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఇచ్చిన హామీని సీఎం రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోవాలని మాజీ స్పీకర్, శాసన మండలి ప్రతిపక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి అన్నారు. హనుమకొండ ఏకశిలాపార్కు వద్ద వారం రోజులుగా ఎస్ఏ కాంట్రాక్ట్ ఉద్యోగులు చేస్తున్న దీక్షలకు ఆయన శుక్రవారం సంఘీభావం తెలిపి మాట్లాడారు. కాంట్రాక్ట్ ఉద్యోగులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం ఉందన్నారు. ఎస్ఏ ఉద్యోగుల సంఘం జాక్ రాష్ట్ర కార్యదర్శి రేగుల సహదేవ్ మాట్లాడుతూ.. ఎస్ఏలో 9 విభాగాలలో 19,325 మంది పనిచేస్తూ విద్యాశాఖకు అన్ని రకాలుగా సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. విద్యాశాఖ పనులే కాకుండా ఇతరశాఖ పనులను కూడా చేయిస్తూ కనీస వేతనం ఇవ్వకపోవటం బాధాకరమన్నారు. పీజీలు, బీఈడీచేసి రూల్ ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్ కం మెరిట్, ఇంటర్వ్యూలు, రిటన్‌టెస్ట్‌లతో ఎంపికైన తమను రెగ్యులైజ్ చేయాలన్నారు. లేకుంటే సమ్మెను ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. 800 మంది పాల్గొన్న దీక్షలకు యూటీఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు రవిందర్, ప్రధాన కార్యదర్శి పెండెం రాజు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లా సంఘం అధ్యక్షులు దొనికెల శ్రీధర్‌గౌడ్, ఎం.డి.షఫీ, కేజీబీవీ ఎస్‌వోలు, సీఆర్టీలు, సీఆర్పీలు, ఎంఐఎస్‌లు, డాటా ఆపరేటర్‌లు, ఐఈ ఆర్పీలు, పీటీఐలు,యూఆర్ఎస్ సీఆర్టీలు,పీజీసీఆర్టీలు,మెస్సెంజర్లు పాల్గొన్నారు.

17న చలో అసెంబ్లీని విజయవంతం చేయాలి

▸ పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహారావు

కేయూ క్యాంపస్ డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : డిసెంబరు 17న పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నరసింహారావు పిలుపునిచ్చారు. శనివారం కేయూలో పీడీఎస్‌యూ రాష్ట్ర కవిటీ నేతృత్వంలో రూపొందించిన చలో అసెంబ్లీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఏడాది పాలనలో విద్యారంగ సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని ఆందోళన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో విద్యాశాఖకు మంత్రి లేడని, బడ్జెట్‌లో విద్యకు కనీసం 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్‌చేశారు. ఫుడ్ పాయిజన్‌పై చర్యలు తీసుకోవాలని అన్నారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, బాకాయిలను విడుదల చేయాలని అన్నారు. విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని డిమాండ్ చేశారు. నిబంధనలు పాటించని కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. డిగ్రీ, పీజీ సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులన్నీ రెగ్యులర్ చేయాలని అన్నారు. ఇంటర్ విద్యార్థులందరికీ మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలన్నారు. వర్సిటీల్లో మెస్ బకాయిలను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు కావ్య, కేయూ నేతలు అనూష, సాధన, పృధ్వీరాజ్, పవన్, కల్యాణ్, దుర్గా ప్రసాద్, అరవింద్, కృష్ణ, నరేశ్, రాజ్‌కుమార్, సాయిచంద్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌యూ నరసింహారావు, తదితరులు

ఘనంగా కేంద్రియ విద్యాలయ సంఘటన్ వ్యవస్థాపక దినోత్సవం



కేవీలో నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

మడికొండ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట మండలం కడిపికొండలోని కేంద్రీయ విద్యాయలయంలో శనివారం కేంద్రియ విద్యాలయ సంఘటన్ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు కె.ప్రకాష్ ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు బాల్యం నుంచే మంచి అలవాట్లు, సత్ప్రవర్తనను అలవర్చుకోవాలని తెలిపారు. గొప్ప వ్యక్తుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని అన్నారు. ఏక్ భారత్, శ్రేష్ట భారత్ పోటీలలో పాల్గొని ప్రతిభ కనబర్చిన స్నిఖిత, ప్రణవి, వర్షిణిలను సన్మానించి సర్టిఫికేట్లు అందజేశారు. ఈసందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుభాషిణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బెల్టుషాపుల్లో విచ్చలవిడి విక్రయాలు

▸ ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు మద్యం

▸ చోద్యం చూస్తున్న ఎక్సైజ్ అధికారులు



హసన్‌పర్తి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): హసన్‌పర్తి మండలంలో అనధికారికంగా మద్యం విక్రయాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. మండల పరిధిలోని కొందరు వైన్‌షాపుల నిర్వాహకులు సిండికేట్ అయ్యి గ్రామాలను దత్తత తీసుకొని మద్యం విక్రయాలు జరుపుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బెల్టుషాపుల నిర్వాహకులకు ఒక్కో మద్యం బాటిల్‌పై ఎమ్మార్పీ కంటే అధిక ధరకు (25 శాతం) విక్రయిస్తూ అమ్మకాలు కొనసాగిస్తున్నట్లు మద్యం బాబులు గగ్గోలు పెడుతున్నారు. బెల్టుషాపుల విషయం సంబంధిత ఎక్సైజ్, పోలీసు, విజిలెన్స్ అధికారులకు తెలిసినప్పటికీ పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

అధిక రేట్లకు..

వైన్‌షాపు నిర్వాహకులు బెల్టుషాపులకు అధిక ధరలకు మద్యం విక్రయాలు కొనసాగిస్తున్నప్పటికీ ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోకపోవడం వెనుక మతల బేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. బెల్టుషాపులలో విక్రయించే మద్యం బాటిళ్లపై ఆయా వైన్ షాపు నిర్వాహకుల కోడ్ స్టిక్కర్లను అంటించి మరీ మద్యం విక్రయాలు జరుపుతున్నారు. బెల్టుషాపులలో స్టిక్కర్లు అంటించిన మద్యం పట్టుబడితే ఆయా వైన్‌షాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకోకుండా ముందస్తుగానే ఒప్పందం కుదుర్చుకుంటారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

తూతూ మంత్రంగా దాడులు

మండల పరిధిలో అనధికారికంగా విచ్చలవిడిగా బెల్టుషాపుల నిర్వహణ కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు నామమాత్రంగా దాడులు జరిపి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఇప్పటి వరకు ఎక్సైజ్ శాఖ అధికారులు మాత్రం బెల్టు షాపులను కట్టడి చేసిన దాఖలాలు కనిపించకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రభుత్వ ఆదాయానికి గండి

ప్రతీ వైన్ షాపు నిర్వాహకుడు మండల పరిధిలోని ఆయా గ్రామాలను దత్తత తీసుకొని ఎవరికి కేటాయించిన గ్రామాలలో వారు మద్యం విక్రయాలు కొనసాగిస్తున్నారు. దీంతో ఇటు సామాన్యుడికి అదనపు భారంతో పాటు ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. ఈ విషయంపై ఎక్సైజ్ అధికారులు స్పందించి బెల్టుషాపుల నిర్వాహణను కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మెల్సీ కోదండరామ్‌ను కలిసిన వర్సిటీ నేతలు



కోదండరామ్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న రంజిత్‌రెడ్డి

కేయూ క్యాంపస్ డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జేఏసీ నేత, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె. కోదండరామ్‌ను శనివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో సీనియర్ కాంగ్రెస్ నేత వీరమల్ల రంజిత్‌రెడ్డి నేతృత్వంలో వర్సిటీ నాయకులు, విద్యార్థులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందచేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో విద్యారంగం ఎదుర్కొంటున్న అంశాలను ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థి నేతలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



ఏటూరునాగారం ఏజెన్సీలో స్వెటర్లు ధరించి చలి మంట కాచుకుంటున్న వృద్ధులు

ఏజెన్సీలో చలి పులి

» పడిపోతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు ఇబ్బందులు
» రాత్రి వేళ శీతల గాలుల ప్రభావంతో అవస్థలు

ఏటూరునాగారం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో చలి పంజా విసురుతోంది. వారం రోజులుగా ములుగు జిల్లాలోని గోదావరి తీరంలో ఏజెన్సీ ప్రజలు చలి తీవ్రతకు గజగజ వణికిపోతున్నారు. శీతల గాలుల ప్రభావం, పొగ మంచు కురుస్తుండడంతో ఉదయం 10గంటల వరకు కూడా ఇళ్లనుంచి బయటకు రాలేకపోతున్నారు. సాయంత్రం 6 గంటల నుంచే చలి ప్రారంభమవుతోంది. ఉదయం 10గంటల వరకు సూర్యుడు మంచు తెరల మాటునే ఉంటున్నాడు. దీంతో రోడ్లు సరిగా కనిపించక వాహనదారులు తంటాలు పడుతున్నారు. వృద్ధులు, చిన్నారులు, యువతి, యువకులు, అనే తేడా లేకుండా చలి మంటలు కాగుతున్నారు. రోజు వారి అవసరాలు, వ్యవసాయ కూలి పనులకు వెళ్లే రైతులు, కూలీలు, చిరు వ్యాపారులు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు రగ్గులు, చలి కోట్లు, స్వెటర్లు ధరించి వెళుతున్నారు. ఏజెన్సీ ప్రాంతాలైన ఏటూరునాగారం, వాజేడు, కన్నాయిగూడెం, మంగపేట, (నూగూరు)వెంకటాపురం, త్వాడాయి మండలాల్లో చలి తీవ్రత అధికంగా ఉంటోంది. ఈ క్రమంలో శనివారం రాత్రి ఆయాప్రాంతాల్లో 11డిగ్రీల నుంచి 12 డిగ్రీల రాత్రి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

వారం క్రితం 18డిగ్రీలు ఉన్న రాత్రి ఉష్ణోగ్రతలు క్రమంగా పడిపోతున్నాయి. చలితో పాటు శీతల గాలులు చిన్నారులు, వృద్ధులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. చలి గాలుల కారణంగా శ్వాసకోశ సమస్యలు వస్తున్నాయి. ముఖ్యంగా రెండేళ్ల లోపు చిన్నారులు న్యుమోనియా బారిన పడుతున్నారని, ఆస్తమా బాధితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వైద్య సిబ్బంది చెబుతున్నారు.

సాగులో యంత్ర సాయం

» వరి కోతలకు హార్వెస్టర్.. గడ్డి కట్టేందుకు బేలర్
» కూలీల సమస్య నుంచి ఉపశమనం » పని సులభం, సమయం ఆదా

వర్ధన్నపేట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పంటల సాగంటేనే సవాలక్ష సమస్యలు. అందులో ప్రధానమైంది కూలీల కొరత. ప్రస్తుత పరిస్థితుల్లో ఇది రైతులకు భారంగా పరిణమించింది. ఈ సమస్యను అధిగమించడంతో పాటు సమయాన్నిన ఆదా చేసుకునేందుకు రైతులు యంత్రాల వినియోగంపై దృష్టిసారిస్తున్నారు. ఇందులో భాగంగా కోత, కలుపు తీతకు యంత్రాలను వినియోగిస్తున్నారు. అయితే హార్వెస్టర్లతో కోయడం వల్ల గడ్డి కట్టలు కట్టేందుకు వీలుగా ఉండని నేపథ్యంలో ఇప్పుడా గడ్డిని కట్టేందుకు కూడా బేలర్ యంత్రాలను యంత్రాలను వినియోగిస్తున్నారు. యంత్రాల రాక ముందు కరిగెట మొదలుకుని నాటు వేయడం, కలుపుతీయడం, మందులు చల్లడం, కోతలు కోయడం, ధాన్యం వేరు చేయడం, పశుగ్రాసాన్ని కూడగట్టడం అన్ని కూలీలతోనే చేయించుకోవాల్సి వచ్చేది. ప్రస్తుతం వ్యవసాయ రంగంలో వస్తున్న యాంత్రీకరణతో రైతులకు శ్రమ,



వరి పంటను కోస్తున్న హార్వెస్టర్

సమయాభావం తగ్గిస్తున్నాయి. ఒక్క ఎకరం వరి కోయడానికి సుమారు 12మంది కూలీలు కావాలి. ఒక్క రోజు కోస్తే మరో రోజు దగ్గరకి వేయాలి. మరుసటి రోజు పశువులతో బంతులు తొక్కించాలి. ఇలా తక్కవలో తక్కువ మూడు రోజులు పడుతుంది. అదే హార్వెస్టర్ అయితే ఒకే గంటలో ఎకరా పంట కోస్తుంది. ధాన్యం కూడా వెంటనే వస్తుంది. పైగా దీనికి కూలీలకంటే తక్కువ అంటే.. సుమారు రూ.3వేల నుంచి రూ.3,500 వరకు ఖర్చు అవుతుంది. అయితే ఇలా హార్వెస్టర్‌తో కోయడం వల్ల గడ్డి కట్టలు కట్టేందుకు అనుకూలంగా ఉండటం లేదు. అయితే పశువులకు పశుగ్రాసం అవసరమైన రైతులు.. ఆ గడ్డిని కట్టలు కట్టించేందుకు వ్యయప్రయాసలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో బేలర్ యంత్రం రావడంతో రైతుల బెంగతీరింది. హార్వెస్టర్లు కోసిన గడ్డిని బేలర్‌తో సునాయసంగా కట్టలు కట్టిస్తున్నారు. ఒక్క రోజులో పది ఎకరాల విస్తీర్ణంలో పశుగ్రాసాన్ని కట్టలు కడుతుండగా.. యంత్రం యజమానులు కట్టకు రూ.35లు చొప్పున తీసుకుంటున్నారు.



వరి గడ్డిని మోపులుగా చుడుతున్న బేలర్

కూలీల బాధ తప్పింది

బి. దేవేందర్‌రావు, వర్ధన్నపేట



ఐదు ఎకరాల్లో వరి వేశా. నాటు సమయంలో 60 మంది కూలీలకు రూ.60వేలు ఖర్చయ్యింది. నాటు వేసేందుకు మూడు రోజులు పట్టింది. ఈ క్రమంలో కూలీల కోసం ఇబ్బందులు పడ్డాం. ఇక పంట కోసేందుకు కూలీల కొరత ఉండటంతో హార్వెస్టర్‌తో కోయించాం. 6.30 గంటల సమయంలో పంట కోశాం. ఇందుకు రూ.20వేలు మాత్రమే ఖర్చయింది.

బేలర్‌తో గడ్డిని సులభంగా దగ్గర వేశాం..

కందుగుల నర్సయ్య, రైతు, వర్ధన్నపేట



ఈ రోజుల్లో పశుగ్రాసం డిమాండ్ బాగా పెరిగింది. యంత్రంతో కోసిన పశుగ్రాసం దగ్గర వేసుకోవడానికి బేలర్ ఎంతో మేలుగా ఉంది. ఒక్కగడ్డి కట్ట కట్టడానికి రూ.35 తీసుకుంటున్నారు. గతంలో గడ్డి కోసి కుప్పలు వేయడంతో పోలిస్తే బేలర్ వాడకంతో ఖర్చు బాగా తగ్గింది. పశుగ్రాసం కొరత ఏర్పడకుండా ఉంటుంది.



సిరులు కురిపిస్తున్న అరటి

నామమాత్రపు పెట్టుబడితో అధిక లాభాలు » ఒకసారి మొక్క నాటితే మూడు పంటలు

ఆత్మకూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : వాణిజ్య, సంప్రదాయ పంటలు సాగు చేసి నష్టపోతున్న రైతులు.. పంటల మార్పిడితో లాభాలబాట పడుతున్నారు. ఉద్యానశాఖ అధికారుల సూచనలతో పలు పంటలు సాగు చేస్తున్నారు. అందుకు ఆత్మకూరు మండలంలోని గూడెప్పాడ్, ఆత్మకూరు, చౌళ్లపల్లి, పెద్దాపురం, అక్కంపేట గ్రామాల్లోని పలువురు రైతులే నిదర్శనం. గతంలో పత్తి, మిర్చి పంటలు వేసి ఆర్థికంగా నష్టపోయి.. అప్పుల ఊబిలో నుంచి బయటపడేందుకు అరటి సాగుపై దృష్టి పెట్టారు. ఉద్యానశాఖ అధికారులు ఇస్తున్న సూచనలు, సలహాలను పాటించి తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందుతున్నారు. ఆత్మకూరు మండలం గూడెప్పాడ్ గ్రామానికి చెందిన తొట్ల రాజు అనే రైతు తనకున్న రెండు ఎకరాల్లో అరటి సాగు చేసి.. గేదెల పెండ, గొర్రెల మందలను పెట్టిన అనంతరం నర్సరీలోని మొక్కలను తీసుకవచ్చి మొక్కలను నాటారు. యూరియా, డీఏపీ, 20-20తో పాటు నామమాత్రంగా పై మందులను పిచికారీ చేస్తున్నారు. మధ్యలో కూలీలతో కలుపు తీయించి క్రమం తప్పకుండా నీటిని అందించారు. ఇందుకు గాను ఎకరం తోటకు రూ.60వేల వరకు ఖర్చు చేయగా.. ఇప్పటి వరకు నాలుగు సార్లు అరటి గెలలు చేతికొచ్చాయి. ఈ క్రమంలో గెలలు కోసిన ప్రతీసారి రూ.40 వేలపైగా లాభం వచ్చిందని ఆయన తెలిపారు. పెట్టిన పెట్టుబడులు పోను దాదాపు ఎకరానికి రూ.1.50లక్షల నుంచి రూ. 2లక్షలు లాభం వస్తుందన్నారు. ఒక్క సారి మొక్క నాటితే మూడు సంవత్సరాల వరకు సాగుకు అనుకూలంగా ఉంటుందని, అధికారుల సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవని రాజు తెలిపారు. అరటి గెల కొట్టిన వెంటనే మొగివరకు నరికి వేయాలని, అలాగే దాని చుట్టూ ఉన్న పిల్ల మొక్కల్లో ఒకదానిని మాత్రమే ఉంచి మిగితావి తొలగించాలన్నారు. అప్పుడే మొక్క ఏపుగా పెరుగుతుందని, గెల సైజు పెరుగుతుందన్నారు. అరటిలోని గడ్డి, ఇతర మొక్కలను ఎప్పటికప్పుడే తొలగించాలని రైతు తెలిపారు. హార్టికల్చర్ అధికారుల సూచనలు పాటిస్తే అధికదిగుబడులు వస్తాయన్నారు.

అరటి సాగుతో లాభాలు గడిస్తున్నారు

మధులిక, ఉద్యానశాఖ అధికారి



ఆత్మకూరు మండలంలోని పలు గ్రామాల 74 మంది రైతులు 122. 3హెక్టార్లలో అరటి సాగు చే స్తూ లాభాలను గడిస్తున్నారు. మా సూచనలు పాటిస్తూ తక్కువ మం దులను వాడడంతో పాటు పంటల మార్పిడి చేయడం వల్ల పంటలకు తెగుళ్ల నివాణతో పాటు పెట్టు బడి తక్కువవుతుంది. దిగుబడి రావడంతో రైతులు సంతోషంగా ఉంటున్నారు. పంటలను పరిశీ లించి అవసరమైన సూచనలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాం.



అరటి గెలను చూపిస్తున్న రైతు తొట్ల రాజు



అరటి గెలలను ట్రాలీలో ఎక్కిస్తున్న కూలీలు

ఆధ్యాత్మికం.. ఆరోగ్యం

» నియమాల మాలతో అయ్యప్ప దీక్ష
» ఉమ్మడి జిల్లాలో ఏటికేడు పెరుగుతున్న మాలధారుల సంఖ్య
» పడి పూజలతో ఉప్పొంగుతున్న భక్తిభావం



శబరిమలలో అయ్యప్ప దర్శనం కోసం క్యూలో నిలుచున్న మాలాధారులు

సండే స్పెషల్ SUNDAY SPECIAL

వర్ధన్నపేట రూరల్ / కరీమాబాద్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఎవరి నమ్మకాలు వారివి.. మతమేదైనా దైవ చింతన అనేది ఆరోగ్యానికి కూడా మంచిదే అనేదే అందరి అభిప్రాయం. దేవుడిని పూజించడం, ఆరాధించడం, వ్యసనాలకు దూరంగా ఉండటం లాంటి వాటితో పలు రుగ్మతలకు ఆసుపత్రులకు వెళ్లకుండానే సమాధానం దొరుకుతుందని చెబుతుంటారు. ఈ నేపథ్యంలో హిందువులు అన్ని మాసాల్లోకి పవిత్రంగా భావించే కార్తీకమాసం నుంచి సంక్రాంతి సమయం వరకు అయ్యప్పదీక్షలను తీసుకుంటారు. కార్తీక మాసం ప్రారంభం నుంచే అయ్యప్ప దీక్ష తీసుకునే స్వాములు రెండు పూజల్లో పాల్గొంటారు. ఈనెల 26 న శబరిమలలో జరిగే మండల పూజకు కొంత మంది స్వాములు హాజరయ్యేలా మాలధారణ చేస్తారు. మరికొంత మంది స్వాములు జనవరిలో సంక్రాంతి రోజున జ్యోతి దర్శనానికి వెళ్లేలా ప్రణాళిక సిద్ధం చేసుకుంటారు. సంక్రాంతి పండుగ రోజున అయ్యప్ప జ్యోతి రూపంలో దర్శనం ఇచ్చే రోజున స్వాములు ఎంతో భక్తిశ్రద్ధలతో శబరిమల సన్నిధానంలో వేచి చూస్తారు. ఇలా దీక్షలు తీసుకునేవారి సంఖ్య ఉమ్మడి జిల్లాలో ఏటికేడు పెరుగుతోంది. 41 రోజుల పాటు నియమాలతో కూడిన దీక్షను పాటించే స్వాములు క్రమశిక్షణ, ఆహారం విషయంలోనే కాకుండా వారి నడవడికలో మార్పు వస్తుంది. ఇందులో ఆధ్యాత్మికతకు తోడు ఆరోగ్య మానసిక అంశాలు ఇమిడి ఉన్నాయని నమ్ముతారు. తెల్లవారు జామున చన్నీటి స్నానం వల్ల శరీరంలో ఉష్ణోగ్రతల క్రమబద్ధీకరణ జరుగుతుందని, శరరీంపై ఒత్తిడి తగ్గుతుందని, ఒక పూట భోజనం వల్ల ప్రోటీన్లు, విటమిన్లు, పీచు పదార్థాలను శరీరం చక్కగా వినియోగించుకుంటుందని చెబుతారు. గ్యాస్, ఊబకాయం లాంటి ఇబ్బందులు నియంత్రణలో ఉంటాయని, నేలపై నిద్రించడం వల్ల నాడీ, రక్త ప్రసరణ వ్యవస్థలు సక్రమంగా పనిచేస్తాయని, శారీరక నొప్పులు తగ్గుతాయంటారు. కాళ్లకు చెప్పులు వేసుకోకపోవడం వల్ల పాదాలు నేలను తాకుతూ ఆ ఒత్తిడితో రక్త ప్రసరణ సక్రమంగా సాగుతుందట.

ఒక్కో దానిలో ఒక్కో ఆరోగ్య సూత్రం

● అయ్యప్ప మాలల్లో ఉండే రుద్రాక్షలు రక్త ప్రసరణను ప్రభావితం చేసి కోపాన్ని నియంత్రిస్తాయట. తులసి శరీరంలోని అధిక ఉష్ణాన్ని నియంత్రిస్తుందని, స్పటికాలు దేహంలోని ఇటాక్సిన్లను శిషించుకుంటాయని చెబుతున్నారు.

● సూర్యోదయానికి ముందు చన్నీటి స్నానంతో మెదడులోని కణాలు అధిక శక్తివంతంగా మారతాయని, సాయంత్రం చేసే స్నానం దేహశుద్ధితో పాటు మానసిక ప్రశాంతతకు ఉపకరిస్తుందని నమ్ముతారు.

● మాలాధారులు స్నానం అనంతరం నుదుటన విభూదిని ధరిస్తారు. నుదుటన ప్రతీ ఒక్కరికి జ్ఞాననేత్రం ఉంటుందని, విభూదిని ధరించడం ద్వారా జ్ఞానంతో పాటు రుద్రత్వం లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయి.

● విభూదితో పాటు ధరించే చందనం అనవసర దాహాన్ని నివారిస్తుందని, చందనం సువాసనతో క్రిమికీటకాలు దరిచేరవని స్వాములు చెబుతున్నారు.

● పాదరక్షలు లేకుండా నడక సాగిస్తే పాదాలకు ఇసుక, రాళ్ల ఒత్తిడి జరిగి ఆక్యుప్రెజర్ ఏర్పడుతుందని, తద్వారా రక్త ప్రసరణ బాగా జరుగుతుందని నమ్ముతారు.

● నల్లని రంగు దుస్తులను ధరించడంతో శరీర ఉష్ణోగ్రతలను నియంత్రిస్తూ చలి నుంచి కాపాడుతాయి.

● మరో ముఖ్యమైన అంశం భోజనం. మాలధారులు ఒంటి పూట భోజనం చేయడం ద్వారా ఆయుర్వేద వైద్యం ప్రకారం ప్రాంకియాసిస్, కాలేయం, పొట్ట శుభ్రమవుతుందని, శరీరంలో కొవ్వు తగ్గుతుందని, ఊబకాయానికి విరుగుడుగా పనిచేస్తుందని చెబుతున్నారు. అయ్యప్ప మాలధారులు మధ్యాహ్నం భిక్ష (భోజనం), రాత్రి సద్ది (అల్పాహారం) తీసుకుంటారు.

● నేలపై చాప, దిండు లేకుండా నిద్రించడంతో భూమికి ఉన్న అయస్కాంత శక్తి ప్రభావంతో మెడ, నడుము నొప్పులు తదితర రుగ్మతలు పోతాయట.

● కఠోర నియమాల కారణంగా వ్యసనాలకు దూరంగా ఉంటారు. కొందరు మద్యం, ధూమపానం తదితర వ్యవసనాల బారిన పడినవారు ఈ మాలధారణ సమయంలో వీటిని మరిచిపోయి.. ఇరుముడి అనంతరం కూడా క్రమశిక్షణతో ఉండటానికి దోహదపడుతుందని చెబుతున్నారు.

● రెండు పూటల పూజా సమయంలో కర్పూరం వెలిగించడం, హారతి తీసుకోవడం ద్వారా సైనస్ లాంటి అలర్జీలు పోతాయట.

● ఆలయాలు, దేవస్థానాల్లో జరిగే ఆధ్మాత్మిక కార్యక్రమాలు, మహాపడిపూజలు, సహపక్తి భోజనాలతో కుల, మత, జాతి, వర్ణ బేధాల్లేకుండా పాల్గొనడంతో అందరితో కలిసిపోయి సమస్యలను మరిచి ప్రశాంతతను పొందుతారు. భజనల్లో రెండు చేతులతో చప్పట్లు కొట్టడంతో శక్తి ఉత్పన్నమవుతూ రక్తప్రసరణ పెరుగుతుంది. ఇటీవల పలు గ్రామాల్లో ఇతర మతాల వారు కూడా అయ్యప్ప స్వాములకు భిక్ష, సద్ది లాంటివి ఏర్పాటు చేస్తూ సర్వమత సమానత్వాన్ని చాటుతున్నారు.

● ఇక అందనికీ స్వామి అని సంబోధించడం, భార్య సహా మహిళలందరీ మాత అంటూ పిలవడం ద్వారా స్త్రీల పట్ల గౌరవభావం పెంపొందుతుంది.

కఠినమైన దీక్షతో ఎంతో మార్పులొస్తాయి..

అంబటి రాజు, గంట స్వామి, ఇల్లంద



మూడో సారి అయ్యప్ప దీక్ష తీసుకున్నాను. మొదటి సారి కన్నెస్వా మిగా స్వామిగా, రెండోసారి కత్తి స్వామిగా సేవలో తరించాను. ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రతీ ఏటా మాలవేయాలని నిర్ణయించుకున్నాను. ఎంతో కష్టమైన ఈ దీక్షతో మనలో ఎన్నో మార్పులు వస్తాయి. ఆధ్యాత్మికతను, ఆరోగ్యాన్ని వేర్వేరుగా చూడలేం. దీక్ష చేపట్టిన తర్వాత గురుస్వాములు, ఆధ్యాత్మిక వేత్తలు చెబుతుంటే ఆరోగ్యానికి ఈ దీక్ష ఎంత మేలు చేస్తుందో అర్థమైంది. పలు రుగ్మతల నుంచి ఉపశమనం పొందిన స్వాములు ఎంతో మంది ఉన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



మరిపెడలో రిబ్బన్ కట్ చేసి అంబులెన్స్‌లను ప్రారంభిస్తున్న మంత్రి పొంగులేటి

- పేదల సంక్షేమమే సీఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్ష
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- మరిపెడలో న్యూ కామన్ డైట్ మెనూ ప్రారంభించిన మంత్రి

మరిపెడ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో శనివారం న్యూ కామన్ డైట్ మెనూ ప్రారంభించి విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు గుర్తు చేశారు. గత ప్రభుత్వం పదేళ్లలో రూ.7.19 లక్షల కోట్ల అప్పు చేయగా నెలకు వాటికి వడ్డీ రూ.6500 కోట్లను చెల్లిస్తూనే ఆరు గ్యారెంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. విద్యార్థుల సంక్షేమాన్ని విస్మరించిన బీఆర్ఎస్ ప్రభుత్వం నేడు గగ్గోలు పెడుతుందని ఆరోపించారు. విద్యార్థుల సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలల విద్యార్థులకు మంచి భోజనం పెట్టడానికి 40 శాతం మెస్ చార్జీలను పెంచి 200 శాతం కాస్మెటిక్ చార్జీలను ఇస్తున్నామన్నారు. కడుపునిండా తిండి ఉంటేనే విద్యార్థులు లక్ష్య సాధనను చేరుకుంటారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భావించి మెస్ చార్జీలు, కాస్మెటిక్ చార్జీలు పెంచడం జరిగిందన్నారు. దీంతో పాటు రాష్ట్రంలోని పాఠశాలల్లో 667.25 కోట్లతో మౌలిక సదుపాయాలకు కృషి చేస్తోందన్నారు. హాస్టళ్ల పనితీరును నిరంతరం పర్యవేక్షించేందుకు ఆకునూరి మురళి అధ్యక్షతన స్టేట్ ఎడ్యుకేషన్ కమిషన్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రూ.5 వేల కోట్లతో ప్రతి నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను ఏర్పాటు చేసి యువతను అన్ని స్థాయిల్లో తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి తీరుతామని పేర్కొన్నారు. విద్యాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపడుతుందన్నారు. రూ.10 లక్షల వరకు వైద్య బీమా కల్పించడం జరిగిందన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమ పథకం అందేలా ప్రభుత్వ కార్యచరణ రూపొందించి అమలు చేస్తుందన్నారు. అనంతరం ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచందర్‌నాయక్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు చేయలేని అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంవత్సర కాలంలోనే చేసి చూపించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్, అదనపు కలెక్టర్ వీరబ్రహ్మచారి, ప్రత్యేక అధికారి కిరణ్‌కుమార్, తొర్రూరు ఆర్డీవో, డీఎస్పీ, కాంగ్రెస్ నేతలు వంటికొమ్ము యుగంధర్‌రెడ్డి, పెండ్లి రఘువీర్‌రెడ్డి, తాజోద్దీన్, మాజీ ఎంపీటీసీ అంబరీష, మాజీ సర్పంచ్ రాంలాల్, ప్రిన్సిపల్ దయాకర్ పాల్గొన్నారు.

మంత్రి పర్యటనలో అనూహ్య సంఘటన

మరిపెడలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పర్యటనలో అనూహ్య సంఘటన చోటు చేసుకుంది. సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో 7వ తరగతి విద్యనభ్యసిస్తున్న ఓ విద్యార్థి మంత్రికి ఎదురుగా వచ్చి నమస్కారించి సార్ నేను మీ వీరాభిమానిని.. సార్ మా తల్లిదండ్రులు పూరిగుడిసెలో నివసిస్తున్నారు.. తమకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలంటూ వేడుకున్నాడు. స్పందించిన మంత్రి వెంటనే జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌తో మాట్లాడి ఆ విద్యార్థి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు గిఫ్టుగా ఇవ్వాలని ఆదేశించారు.

సాధికారతే లక్ష్యంగా పాలన

విద్య, వైద్య రంగాల అభివృద్ధి, మహిళాభ్యున్నతికి ప్రాధాన్యం
మాటకు కట్టుబడి ఆరోగ్యశ్రీని రూ.10లక్షలకు పెంచాం
రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



సభలో మాట్లాడుతున్న మంత్రులు రాజనర్సింహ, శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే సత్యనారాయణరావు

భూపాలపల్లి కలెక్టరేట్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్య, వైద్య రంగాల అభివృద్ధితోపాటు మహిళా సాధికారతే లక్ష్యంగా కాంగ్రెస్ పాలన కొనసాగుతోందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదార రాజనర్సింహ అన్నారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి ఆయన శనివారం భూపాలపల్లి జిల్లాలో పర్య టించారు. జిల్లా కేంద్రంలోని రామప్పకాలనీ క్వార్టర్స్ వద్ద నిర్మించిన 50 పడకల సమీకృత ఆయుష్ ఆస్పత్రిని ప్రారంభించారు. రూ.130 కోట్లతో నిర్మించనున్న మెడికల్ కాలేజీ క్యాంపస్ పనులకు, ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి (జీజీహెచ్)లో రూ. 13 కోట్లతో నిర్మించనున్న 90 పడకల అదనపు గదులకు, భూపాలపల్లి మునిసిపాలిటీలో రూ.4కోట్లతో చేపడుతున్న డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన చేశారు. మొగుళ్లపల్లి మండలానికి కేటాయించిన అంబులెన్స్‌ను ప్రారంభించారు. భూపాలపల్లి పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన ప్రజాపాలన బహిరంగసభలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం 8 మెడికల్ కాలేజీలు, 16 నర్సింగ్, 28 పారామెడికల్ కాలేజీలను ఏర్పాటు చేసిందన్నారు. విద్య, వైద్య రంగాల అభివృద్ధి, మహిళా సాధికారతకే ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. గతంలో రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో అద్భుత పాలనను అందించిందని గుర్తు చేశారు. గత ప్రభుత్వం మహిళ సాధికారతను విస్మరిస్తే, తమ ప్రభుత్వం మళ్లీ కొనసాగిస్తోందని తెలిపారు. ఎన్నికల హామీల్లో భాగంగా ఆరోగ్యశ్రీ పథకానికి రూ.5లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచామన్నారు. పేదల ఆరోగ్యం కోసం మరో రూ.10లక్షలు పెంచేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. విద్యార్థులకు పోషకాలతో కూడిన ఆహారం అందించేందుకు డైట్ చార్జీలు 40శాతం, కాస్మెటిక్ చార్జీలు 400 శాతం పెంచామన్నారు. జిల్లాకు రెండు సబ్ సెంటర్లు, రెండు పీహె చ్‌సీలను మంజూరు చేయనున్నట్లు ప్రకటించారు. జిల్లాలో జాతీయ రహదారి ఉండగా నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, ప్రజల ప్రాణాలను కాపాడుకునేందుకు అంబులెన్స్ మంజూరు చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కోరారని, దీన్ని తప్పకుండా అందిస్తామని హామీ ఇచ్చారు. ఆయన కోరిక మేరకు పలిమెల, గోరికొత్తపల్లి మండలాలకు అంబులెన్స్‌లను మంజూరు చేస్తామన్నారు. జిల్లాలో రూ. 130 కోట్లతో ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే, ఆయా శాఖల అధికారులు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

విద్య, వైద్యం ప్రభుత్వానికి రెండు కళ్లు : మంత్రి శ్రీధర్‌బాబు

విద్య, వైద్య రంగాలను రెండు కళ్లుగా భావిస్తున్న ప్రభుత్వం వీటికి ప్రాధాన్యమిస్తోందని మంత్రి శ్రీదర్‌బాబు అన్నారు. రాజకీయాలను అతీతంగా ఇందిరమ్మ ఇళ్లు కేటాయించనున్నట్లు తెలిపారు. 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు ఇస్తామని ఇచ్చిన మాటకు కట్టుబడి ఆ హామీని నెరవేర్చామన్నారు. జిల్లాకు 203 వైద్య పోస్టులు మంజూరైనట్లు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మృతదేహాలు భద్రపరిచేందుకు ఏసీ గదిని మంజూరు చేస్తామన్నారు. మహారాష్ట్ర నుంచి జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి రోగులు వస్తుంటారని, వారికి సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. చిట్యాల సీహెచ్‌సీలో ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. జిల్లాకు ప్రభుత్వం నర్సింగ్ కాలేజీని కేటాయించిందని, రూ. 26కోట్లతో కాలేజీ భవనం మంజూరైందని తెలిపారు.

అభివృద్ధిపై చిత్తశుద్ధితో ఉన్నాం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి నియోజకవర్గ అభివృద్ధిపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పేర్కొన్నారు. ప్రత్యేక నిధులు మంజూరు చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన ప్రభుత్వం వైద్యానికి ప్రాధాన్యమిస్తోదని, ఆయుష్ ఆస్పత్రి భవనంతో పాటు 200 పోస్టులు మంజూరు చేసిందన్నారు. ఇక సింగరేణి ఏరియా ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న పోస్టులను నింపేలా ఆ సంస్థ సీఎండీని ఆదేశించాలని మంత్రులను కోరారు, రామప్ప నుంచి డీబీఎం 38 కాల్వకు లింకు కలిపితే కొత్తపల్లిగోరు, రేగొండ, చిట్యాల, గణపురం మండలాల్లోని 44,700 ఎకరాలకు సాగునీరందించే అవకాశం ఉంటుందని తెలిపారు. దీన్ని మంత్రులు మంజూరు చేయించాలని విజ్ఞప్తి చేశారు.


సండే సెలబ్రిటీ



ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
ఇనిగ్మా	హాలీవుడ్ మూవీ	డిసెంబర్ 17
లవ్ టూ హేట్ ఇట్ జూలియాస్	హాలీవుడ్ మూవీ	డిసెంబర్ 17
స్టెప్పింగ్ స్టోన్స్	డాక్యుమెంటరీ మూవీ	డిసెంబర్ 18
ది డ్రాగన్ ప్రిన్స్	వెబ్‌సిరీస్	డిసెంబర్ 18
వర్జిన్ రివర్ 6	వెబ్‌సిరీస్	డిసెంబర్ 19
ద సిక్స్ ట్రిపుల్ ఎయిట్	హాలీవుడ్ మూవీ	డిసెంబర్ 20
యోయో హనీసింగ్	ఫేమస్ హిందీ డాక్యుమెంటరీ	డిసెంబర్ 21
అమెజాన్ ప్రైమ్		
గర్ల్స్ విల్ బీ గర్ల్స్	హిందీ చిత్రం	డిసెంబర్ 18
బీస్ట్ గేమ్స్	హాలీవుడ్ మూవీ	డిసెంబర్ 18
జియో సినిమా		
ట్విస్టర్స్	హాలీవుడ్ మూవీ	డిసెంబర్ 18
మూన్‌వాక్	హిందీ సిరీస్	డిసెంబర్ 20
తెల్మా	హాలీవుడ్ మూవీ	డిసెంబర్ 21
ఈటీవీ విన్		
లీలా వినోదం	తెలుగు చిత్రం	డిసెంబర్ 19
మనోరమా మ్యాక్స్		
పల్లొట్టి నైన్టీస్ కిడ్స్	మలయాళ చిత్రం	డిసెంబర్ 18
లయన్స్ గేట్ ప్లే		
బాయ్ కిల్స్ వరల్డ్	హాలీవుడ్ మూవీ (తెలుగులో)	డిసెంబర్ 20



మళ్లీ వచ్చిన ట్విస్టర్స్

పాతికేళ్ల కిందట వచ్చిన హాలీవుడ్ చిత్రం 'ట్విస్టర్స్'కు కొనసాగింపుగా అదే టైటిల్‌తో వచ్చిన ఈ చిత్రం హాలీవుడ్‌లో మంచి విజయం అందుకొంది. అమెరికాలో టోర్నడోల వల్ల జరిగే విధ్వంసం నుంచి వాతావరణ పరిశోధనలు జరిపే ఓ బృందం ఎలా తప్పించుకుంది అనే అంశం చుట్టూ ఆసక్తికరంగా కథ సాగుతుంది. సినిమా ఆద్యంతం ఉత్కంఠను రేకెత్తిస్తూ థ్రిల్లింగ్ సన్నివేశాలతో రక్తికట్టించారు దర్శకుడు లీ ఐజాక్ చుంగ్.





హీరోయిన్ అంటే కేవలం అందంగా ఉంటే చాలనుకొనే రోజులు పోయాయి. సోషల్ మీడియా యుగంలో అందంతో పాటు చదువు, వ్యక్తిత్వం లాంటి వాటిని కూడా ప్రేక్షకులు అంచనా వేసేస్తున్నారు. అందుకే బాగా చదువుకున్నవారు కూడా సినీరంగంలోకి రావటానికి ఉత్సాహం చూపిస్తున్నారు. అలాంటి వారిలో **నభా నటేష్** ఒకరు. 'స్వయంభూ', 'నాగబంధం' అనే రెండు భారీ సినిమాల్లో నటిస్తున్న నభా నటేష్‌ను 'నవ్య' పలకరించింది.

నిరీక్షణ తప్పదని అర్థమైంది

మీరు టాలీవుడ్‌లో ప్రవేశించి ఐదేళ్లు అవుతున్నట్లుంది. మీ సినిమా ప్రయాణం ఎలా సాగుతోంది?

బాగా సాగుతోంది. ప్రస్తుతం 'స్వయంభూ', 'నాగబంధం' అనే రెండు పాన్ ఇండియన్ సినిమాల్లో నటిస్తున్నా. ఈ రెండు సినిమాల్లోను నాకు చాలా మంచి పాత్రలు లభించాయి. ఇవి నేను ఇప్పటిదాకా చేసిన పాత్రల కన్నా భిన్నమైనవి. ఈ రెండూ విడుదలయిన తర్వాత నా కెరీర్ వేరే విధంగా ఉంటుందని ఆశిస్తున్నా.

ఈ ప్రయాణంలో సక్సెస్ ఫార్ములా ఏమిటో తెలుసుకున్నారా?

లేదు. తెలిస్తే బావుండేదని నాకూ అనిపిస్తుంది. నాకే కాదు, ఎవరికీ తెలియదు. అయితే నా గత అనుభవాల నుంచి నేర్చుకున్నా. నా ఉద్దేశంలో భిన్నమైన పాత్రలలో, మంచి ఎనర్జీతో కనిపిస్తే ప్రేక్షకులు ఇష్టపడతారు. ప్రేక్షకులకు నచ్చితే మంచి పాత్రలు వాటంతట అవే వస్తాయి. ఉదాహరణకు 'నన్ను దోచుకుందువటే..' సినిమాలో నాది చాలా మంచి పాత్ర. దానిలో అనేక భావోద్వేగాలు కనిపిస్తాయి. ఈ భావోద్వేగాలు మన చుట్టుపక్కల వాళ్లలో మనం చూడగలుగుతాం. అందుకే ఆ పాత్రకు అంత పేరు వచ్చింది. ఇక 'ఇస్మార్ట్ శంకర్'లో నాది మాస్ పాత్ర. తెలంగాణ యాసలో మాట్లాడుతూ ఉంటాను. 'డార్లింగ్'లో ఏడు కోణాలు కనిపిస్తాయి. అప్పటి దాకా అలాంటి పాత్ర నేను చేయలేదు. దానికి కూడా మంచి పేరు వచ్చింది. 'భిన్నమైన పాత్రలు చేస్తేనే మంచి నటిగా పేరు వస్తుంది' అనే విషయాన్ని ఈ అనుభవాల నుంచి తెలుసుకున్నా!

> శృంగేరీలో హఠాత్తుగా వానలు పడుతూ ఉంటాయి. ఎప్పుడు వాన పడుతుందో.. ఎప్పుడు తడుస్తామో తెలియదు. వాన పడితే అంతా తడిగా ఉంటుంది. ఎప్పుడు ఎండ వస్తుందో తెలియదు. ఇలాంటి వాతావరణ పరిస్థితులు మనలో సహనాన్ని, ఓపికను పెంచుతాయి.

ఒక స్క్రిప్ట్‌ను మీరు ఎలా ఎంచుకుంటారు?

ఒక కథ సినిమాగా మారాలంటే అనేక విషయాలు దోహదపడతాయి. మంచి నిర్మాణ సంస్థ కావాలి. మంచి దర్శకుడు కావాలి. మంచి సినిమా బృందం కావాలి. మంచి సహనటులు కావాలి.. ఇవన్నీ ఉంటే- సినిమా ఆడుతుందనే విషయం మనకు ముందుగానే తెలిసిపోతుంది. నా కెరీర్‌కు పనికొస్తుందని అర్థమవుతుంది. అంతేకాకుండా 'ఒక ప్రేక్షకురాలిగా చూస్తే నాకు నచ్చుతుందా?' అనే విషయాన్ని కూడా ఆలోచిస్తా. వీటన్నిటినీ పరిగణనలోకి తీసుకొని స్క్రిప్ట్‌లను ఎంచుకుంటా!

సినీ రంగంలో విజయం సాధించటానికి ప్రతి రోజూ కష్టపడుతూ ఉండాలి. అలాంటప్పుడు అసహనంగా అనిపించదా?

ఓపికగా ఉండటం అనేది చాలా ముఖ్యం. 'మనకు కూడా ఒక రోజు వస్తుంది. మంచి పాత్ర లభిస్తుంది.. అది విడుదల అవుతుంది' అనే నమ్మకంతో వేచి చూస్తూ ఉండాలి. పెద్ద సినిమాలు పూర్తి కావటానికి చాలా సమయం పడుతుంది. అప్పటిదాకా వేచి ఉండాల్సిందే! మొదట్లో చాలా అసహనంగా అనిపించేది. 'నా సినిమా ఎప్పుడు విడుదలవుతుందా?' అనిపించేది.. తర్వాత నిరీక్షణ తప్పదనే విషయం అర్థమయింది.



మిమ్మల్ని చాలా చిరాకు పెట్టే విషయం ఏమిటి?

నేను సెట్‌లో ఉన్నప్పుడు... ఎక్కువ పని లేకుండా ఖాళీగా ఉండాలంటే చాలా చిరాకుగా అనిపిస్తుంది. 48 గంటలు విరామం లేకుండా పనిచేయమన్నా చేస్తాను. కానీ నా సీన్స్ లేకుండా సెట్‌లో ఖాళీగా కూర్చోవాలంటే చాలా చిరాకు వస్తుంది. కెమెరా ముందుకు వచ్చి పనిచేస్తుంటే ఉత్సాహంగా ఉంటుంది. ఈ మధ్య కాలంలో ఈ చిరాకును కూడా అధిగమించటానికి ప్రయత్నిస్తున్నా!

మీ చిన్నతనం ఎక్కడ ఎలా గడించింది?

మాది చిక్‌మగళూరు పక్కన ఉన్న శృంగేరీ. ప్రపంచ ప్రఖ్యాతి చెందిన శారద పీఠం ఇక్కడే ఉంటుంది. శృంగేరీ చాలా అందమైన పట్టణం. శారద పీఠం వల్ల సంస్కృతి, సంప్రదాయాలు ఇక్కడ పరిఢవిల్లుతూ ఉంటాయి. అలాంటి చోట పుట్టి పెరిగాను కాబట్టి నేను చిన్నప్పటి నుంచి కర్ణాటక సంగీతం, భరతనాట్యం నేర్చుకున్నా. నా ఇంజనీరింగ్ పూర్తి అయిన తర్వాత ఒక థియేటర్ గ్రూపులో చేరాను. మొత్తం దేశమంతా తిరిగాను. ఇంగ్లీషులోని పేరు మోసిన నాటకాలన్నీ వేశాను. డైరెక్షన్, లైటింగ్... ఇలా అన్ని విభాగాల్లో పని చేశాను. ఈ నాటకాలు వేస్తున్న సమయంలోనే సినిమా ఆడిషన్స్ చేస్తూ ఉండేదాన్ని. ఇలా కొన్ని వందల ఆడిషన్స్ చేశాను. దానిలో 'వజ్రకాయ' అనే సినిమా ఆడిషన్ ఫలించింది. తొలిసారి సినిమా అవకాశం వచ్చింది. నాకు వచ్చిన పాత్రలన్నీ ఆడిషన్స్ ద్వారా వచ్చినవే!

మీ జీవితంలో ఆనందకరమైన విషయాలేమిటి?

ప్రతిరోజూ ఆనందంగా ఉండటానికి ప్రయత్నిస్తా. చిన్నా, పెద్ద అనేవి మనం ఏర్పరుచుకున్న గోడలు అనిపిస్తుంది. జాగ్రత్తగా చూస్తే ప్రతి రోజూ, ప్రతి విషయంలోనూ ఆనందం ఉంటుంది. నేను పెయింటింగ్ వేస్తా... దాంట్లో ఆనందం దొరుకుతుంది. డ్యాన్స్ చేస్తా... దాంట్లో ఆనందం దొరుకుతుంది. ప్రకృతిలో మమేకమై ప్రయాణాలు చేస్తూ ఉంటా... దాంట్లో ఆనందం దొరుకుతుంది. చివరకు మబ్బుల్లేని నీలి ఆకాశంలో నక్షత్రాలను చూడటంలో కూడా ఆనందం లభిస్తుంది. అందువల్ల నా ఆనందం సంఘటనల మీద ఆధారపడి ఉండదు.

• సివిఎల్‌ఎన్ ప్రసాద్

ఆంక్షలు వద్దు

పిల్లలను పెంచే విషయంలో తల్లిదండ్రులు చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా ఆడపిల్లల విషయంలో. చదువు, ఆటలు ఇలా ఎన్నో అంశాలకు సంబంధించి తెలిసో తెలియకో ఆడపిల్లలకు పరిమితులు విధిస్తుంటారు. ఇది సమర్థనీయం కాదు. తల్లిదండ్రులు పిల్లలందరినీ సమాన దృష్టితో చూడాలి. ఆడపిల్లలకు ఎటువంటి ఆంక్షలు పెట్టకూడదో తెలుసుకుందాం.

వృత్తి

• ప్రతి ఒక్కరికీ తమకు నచ్చిన వృత్తి ఎంచుకునే స్వేచ్ఛ ఉంది. మీ అమ్మాయి ఏదైనా వృత్తి ఎంచుకోవాలనుకుంటే మొదట్లోనే వద్దని చెప్పకండి. అది ఏ రంగానికి సంబంధించింది అయినా అందులో ఎదిగేలా ప్రోత్సహించండి. ఇది అబ్బాయిల వృత్తి అంటూ నిరాశపరచకూడదు.

బరువు

• అమ్మాయి కొద్దిగా బరువు పెరగగానే తల్లిదండ్రులు కంగారు పడిపోతుంటారు. ఆడపిల్లలు ఇంత బరువు ఉండకూడదు అంటూ ముఖంమీదే చెప్పేస్తూ ఉంటారు. ఇలా నేరుగా చెప్పకుండా ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్ల గురించి వాళ్లకి వివరించండి. వయసుకు మించి బొద్దుగా కనిపించడం వల్ల కలిగే నష్టాలను మెల్లగా చెప్పండి.

దుస్తులు

• ఆధునిక దుస్తులు వేసుకోవద్దని చెప్పవద్దు. చూడడానికి హుందాగా కనిపించే దుస్తులు ఎంచుకోమని చెప్పండి. దుస్తులు మన వ్యక్తిత్వాన్ని, ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబించేలా ఉండాలని వివరించండి

ధైర్యం

• ఆడపిల్లలు మాట్లాడకూడదు అంటూ వారిని అధైర్యపరచకండి. మనసులో మాట చెప్పే అవకాశం ఇవ్వండి. ధైర్యంగా ఆడపిల్లలు తమ అభిప్రాయం తెలిపేలా ప్రోత్సహించండి.

నవ్వడం

• ఆడపిల్లలు గట్టిగా నవ్వకూడదు అంటూ తల్లిదండ్రులు హెచ్చరించడం ఇప్పటికీ మనం చూస్తూనే ఉంటాం. ఇలా కాకుండా పదిమందిలో అహ్లాదకరంగా తమ భావాన్ని వెలిబుచ్చే పద్ధతిని వాళ్లకి నేర్పించాలి. గట్టిగా అరవడం, గట్టిగా నవ్వడం కాకుండా భావోద్వేగ నియంత్రణని తెలియజెప్పాలి.



సామర్థ్యం

• ఈ పని నువ్వు చేయలేవు అని ఆడపిల్లల ముందు అనవద్దు. ఇది వారి సామర్థ్యాన్ని తక్కువ చేసినట్లు అవుతుంది. వారి ఆసక్తిని గమనించి ఒక ప్రయత్నం చేయనివ్వండి.

జామ ఆకు టీతో ప్రయోజనాలెన్నో

జామకాయతోపాటు జామాకు కూడా ఆరోగ్యానికి చాలా మంచిది. ఇందులో టానిన్ కెమికల్స్, ఫ్లేవనాయిడ్స్, కెరోటినాయిడ్స్, పాలీఫెనాల్స్, యాంటీ బ్యాక్టీరియల్ సమ్మేళనాలు, విటమిన్లు, ఖనిజ లవణాలు, మరెన్నో పోషకాలు ఉంటాయి. జామాకు టీ తయారు చేసుకోవడం చాలా సులువు. స్టవ్ మీద గిన్నె పెట్టి అందులో ఒక గ్లాసు నీళ్లు పోయండి. అందులో అయిదు జామాకులు వేసి మరిగించండి. తరవాత ఆ నీటిని వడబోసి కొద్దిగా నిమ్మరసం, పటికబెల్లం వేసి కలిపితే చాలు. ఈ టీ తాగితే ఆరోగ్య ప్రయోజనాలెన్నో...

శిరోజాలకు: జామాకు టీ తాగడం వల్ల వెంట్రుకల కుదుళ్లు గట్టిపడతాయి. జుట్టు రాలడం తగ్గుతుంది. రాలిన వెంట్రుకల స్థానంలో కొత్తవి వస్తాయి. జామాకు టీతో తలమీద మర్దన చేస్తే శిరోజాలకు తేమ, పోషణ అంది నల్లగా మెరుస్తాయి.

చర్మానికి: జామాకు టీలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు చర్మం మీద ఉండే ఫ్రీ రాడికల్స్‌తో పోరాడతాయి. జామాకు టీలో కొద్దిగా తేనె కలుపుకుని తాగితే చర్మం తేమతో నిండి నిగారింపు సంతరించుకుంటుంది. ముఖం మీద మొటిమలు, మచ్చలు తొలగిపోతాయి. అకాల వార్ధక్యం వల్ల వచ్చే ముడతలు, గీతలు తొలగిపోతాయి. కళ్ల చుట్టూ నల్లని వలయాలు క్రమంగా తగ్గుతాయి.

బరువుకు: రోజుకి రెండుసార్లు జామాకు టీ తాగడం వల్ల అందులోని ఫినోలిక్ సమ్మేళనాలు రక్తంలో చక్కెర స్థాయిని తగ్గిస్తాయి. దీనితో జీవక్రియలు వేగంగా జరిగి శరీర బరువు నియంత్రణలో ఉంటుంది. మధుమేహం, రక్తపోటు వంటి సమస్యలు రావు. భోజనం తరవాత ఈ టీ తాగితే మంచి ఫలితం కనిపిస్తుంది.

జీర్ణక్రియకు: జామాకు టీలో యాంటీ మైక్రోబయల్ సమ్మేళనాలు, పీచు పదార్థాలు ఉంటాయి. ఇవి జీర్ణాశయాన్ని ఆరోగ్యవంతంగా మార్చి జీర్ణక్రియ సజావుగా జరిగేలా చూస్తాయి. ఈ టీ తాగడం వల్ల డయేరియా, కడుపు ఉబ్బరం, మలబద్ధకం వంటి సమస్యలు దరిచేరవు. పేగులు కూడా శుభ్రపడతాయి.

నెలసరికి: జామాకు టీని తరచూ తాగుతూ ఉంటే నెలసరి సమస్యలు తగ్గుతాయి. ఇందులోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ



గుణాలు నెలసరి సమయంలో వచ్చే నొప్పులను, అసౌకర్యాన్ని తొలగిస్తాయి. మహిళల్లో హార్మోన్లను సంతులనం చేసి రుతుక్రమాన్ని క్రమబద్ధీకరిస్తాయి.

రోగనిరోధక శక్తికి: జామాకు టీలో ఉండే ఔషధ గుణాలు శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతాయి. చలికాలంలో రోజుకు రెండుసార్లు జామాకు టీ తాగితే శరీరానికి సి విటమిన్, ఐరన్ తగు మోతాదులో అంది జలుబు, దగ్గు, జ్వరం లాంటి సమస్యలు రాకుండా ఉంటాయి. రక్తంలో హిమోగ్లోబిన్ శాతం పెరుగుతుంది.

గుండెకు: ప్రతిరోజూ ఉదయాన్నే జామాకు టీ తాగితే రక్తంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయి తగ్గి మంచి కొలెస్ట్రాల్ స్థాయి పెరుగుతుంది. దీనివల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. రక్తప్రసరణ వ్యవస్థ సక్రమంగా పనిచేయడం వల్ల గుండె జబ్బులు రావు.

వ్యాపారంలోనూ స్టార్లే

అగ్రతారలు చిత్ర పరిశ్రమలో సంపాదించిన సొమ్మును తిరిగి అదే రంగంలో పెట్టుబడిగా పెట్టడం మొదటి నుంచీ ఉన్నదే. తమకు బాగా పట్టున్న రంగం కావడం దానికి కారణం. ఎన్టీఆర్, ఏఎన్నార్ లాంటి పాత తరం అగ్రహీరోలు స్టూడియోలు, ప్రొడక్షన్ హౌస్‌లు, థియేటర్ల రంగంలో పెట్టుబడులు పెట్టి, చిత్ర పరిశ్రమ అభివృద్ధికి తమవంతు పాటుపడ్డారు. ఆ తర్వాత తరంలోనూ చిరంజీవి, నాగార్జున, వెంకటేశ్ లాంటి కొంత మంది హీరోలు అదే ఒరవడిని కొనసాగిస్తున్నారు. అయితే చాలావరకూ తమ వ్యాపారాలను సినీరంగానికే పరిమితం చేసుకున్నారు. వారికి భిన్నంగా కోట్లాది రూపాయల పారితోషికం అందుకుంటున్న ఈ తరం తారలు చాలామంది పెట్టుబడులకు అనువైన ఇతర రంగాల వైపు దృష్టి సారిస్తున్నారు. వారిలో కొందరు అక్కడా మంచి విజయాలను అందిపుచ్చుకుంటుండగా, మరికొందరు విఫలమై వెనుదిరుగుతున్నారు.



బిజినెస్‌మాన్...

టాలీవుడ్ అగ్రనటుడు మహేశ్‌బాబు కథానాయకుడిగా నటించిన చిత్రం 'బిజినెస్‌మాన్'. ఇప్పుడు ఆయన ఆ టైటిల్‌కు తగ్గ పాత్రను తన నిజ జీవితంలో పోషిస్తున్నారు. సినీరంగానికి సంబంధించిన పలు వ్యాపారాల్లో అడుగుపెట్టి విజయవంతంగా కొనసాగిస్తున్నారు. 'జీఎంబీ' పేరుతో సొంతంగా నిర్మాణ సంస్థను ఏర్పాటు చేసి, సినిమాలు నిర్మిస్తున్నారు. అలాగే 'ఏఎంబీ' పేరుతో మల్టీప్లెక్స్ థియేటర్స్ నడుపుతున్నారు. సినీ రంగానికి బయట కూడా ఆయన తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరిస్తున్నారు. 'ది హంబల్ కో' పేరుతో 2019లోనే ఆయన వస్త్ర వ్యాపారంలోకి అడుగుపెట్టారు. గతంలో ఆయన 'ఫిట్ డే' అనే అంకుర సంస్థలో పెట్టుబడులు పెట్టారు. చిరుధాన్యాలతో ఆరోగ్యకరమైన ఆహారోత్పత్తులను తయారు చేయడం ఆ సంస్థ ప్రత్యేకత. మహేశ్ శ్రీమతి నమ్రతా శిరోద్కర్ ఇటీవలే రెస్టారెంట్ బిజినెస్‌లోకి అడుగుపెట్టారు. తాజాగా మరో కొత్త రంగంలో ఆయన పెట్టుబడులు పెట్టారని తెలుస్తోంది. సౌర విద్యుత్ ఉత్పత్తి రంగానికి చెందిన ప్రముఖ సంస్థకు ప్రచారకర్తగా నియమితుడైన మహేశ్ అదే కంపెనీలో వాటాలు కొన్నారని తెలుస్తోంది.

అక్కడా అదే జోరు...

అభిమానులను 'రౌడీస్' అంటూ ముద్దుగా పిలుచుకునే విజయ్ దేవరకొండ 'రౌడీ వేర్' బ్రాండ్ పేరుతో వస్త్ర వ్యాపారంలోకి అడుగుపెట్టారు. ప్రస్తుతం ఆ వ్యాపారం విజయవంతంగా కొనసాగుతోంది. అలాగే భవిష్యత్‌లో మంచి వృద్ధికి అవకాశముందని భావిస్తున్న ఎలక్ట్రానిక్ వెహికల్ రంగంలోనూ తన వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు విజయ్. ఎలక్ట్రిక్ బైక్స్, స్కూటర్స్ అద్దెకు ఇచ్చే ఓ కంపెనీలోనూ విజయ్ పెట్టుబడులు పెట్టారు. సినీరంగానికే పరిమితమైన తమ కుటుంబ వ్యాపారాలకే వెంకటేశ్ పరిమితమయ్యారు ఇప్పటివరకు. అయితే ఇటీవల ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలకు ఛార్జింగ్ స్టేషన్లను నిర్వహించే ఓ కంపెనీలో పెట్టుబడి పెట్టి ఆశ్చర్యపరిచారు. 'వివాహ భోజనంబు' పేరుతో రెస్టారెంట్స్ ఛైన్‌ను ప్రారంభించి, విజయవంతంగా కొనసాగిస్తున్నారు సందీప్ కిషన్. ఆయన క్యూబీఎస్ సంస్థతో కలసి సెలూన్ ఫ్రాంఛైజీలను ప్రముఖ నగరాల్లో ప్రారంభించారు. అల్లు అర్జున్ కుటుంబానికి పలు సినీ వ్యాపారాలతో పాటు... బన్నీ హైదరాబాద్‌లో ప్రఖ్యాత స్పోర్ట్స్ బార్ అయిన 'బి-డబ్స్' ఫ్రాంఛైజీని ఏర్పాటు చేశారు. అలాగే గతంలో ఓ స్విస్ బేకరీని, రెస్టారెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఒకప్పుడు నాగార్జున, చిరంజీవి ఓ టీవీ ఛానల్‌కు సహ భాగస్వాములుగా ఉన్నారు. తర్వాత తమ వాటాలు అమ్ముకున్నారు. నాగార్జున బ్యాడ్మింటన్ లీగ్, ఫుట్‌బాల్ లీగ్‌లో జట్టుకు యజమానిగా వ్యవహరించారు. మంచు విష్ణు తమ కుటుంబానికి చెందిన విద్యాసంస్థల వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. కల్యాణ్‌రామ్ సొంతంగా వీఎఫ్ఎక్స్ సంస్థను నడుపుతున్నారు. ప్రకాశ్‌రాజ్ 'లైఫ్ ఎట్ ప్రకాశం' పేరుతో ఓ రిసార్ట్‌ను నిర్వహిస్తున్నారు.



వెంకటేశ్, మహేశ్‌బాబు, అల్లు అర్జున్, ప్రభాస్, విజయ్ దేవరకొండ, రవితేజ థియేటర్లను నిర్మిస్తున్నారు. ఇక తమిళ అగ్రహీరో కమల్ హాసన్ భారతీయ ఖద్దరును పాశ్చాత్య దేశాల్లో విక్రయించేందుకు సిద్ధమయ్యారు. 'కేహెచ్ హౌజ్ ఆఫ్ ఖద్దర్' పేరుతో ఈ వస్త్రాలను మార్కెట్లోకి తెచ్చారు. అమెరికాలోని షికాగోలో తొలి స్టోర్ ప్రారంభించారు. మరో తమిళ హీరో అజిత్ డ్రోన్ల తయారీ రంగంలోకి దిగారు.

వారికి నష్టాలు...

అయితే కొంతమంది హీరోలకు మాత్రం వ్యాపారాలు అంతగా అచ్చిరాలేదు. రామ్‌చరణ్ గతంలో ప్రముఖ ఎయిర్‌లైన్స్ సంస్థలో పెట్టుబడులు పెట్టారు. ఆ తర్వాత ఆ సంస్థ తన వ్యాపార కార్యకలాపాలను నిలిపివేసింది. నటుడిగా అరంగేట్రానికి ముందు రానా వీఎఫ్ఎక్స్ స్టూడియోను నడిపారు. ఆ తర్వాత దాన్ని అమ్మేసి, ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో రాణిస్తున్న పురుషుల కోసం డిక్రాఫ్ సంస్థతో కలసి కొన్ని ఉత్పత్తులను తీసుకొచ్చారు.

తెరవెనుక ఉంటూ...

ముందుచూపుతో స్థిరాస్తి రంగంలో పెట్టుబడులు పెట్టి అద్భుతాలు చూపించిన శోభన్‌బాబు బాటలోనే చాలా మంది సినిమావాళ్లు కొనసాగుతున్నారు. తమ సంపదను స్థిరాస్థిరంగంలో మదుపు చేయని తారలు అరుదనే చెప్పాలి. కొందరు ధర తక్కువగా ఉన్నప్పుడే వ్యవసాయ భూములు కొనుగోలు చేస్తుండగా, మరికొందరు రియల్ ఎస్టేట్ వెంచర్లలో పెట్టుబడులు పెడుతున్నారు. అయితే స్థిరాస్తి రంగంలో పెట్టుబడులు పెట్టే సినీ ప్రముఖులు బినామీలు, కొన్ని ప్రముఖ కంపెనీల ద్వారా పెట్టుబడులు పెట్టడమే తప్ప తెరముందు మాత్రం రావడంలేదు.



కథానాయికలకు కలిసొచ్చింది

హీరోలతో పోల్చితే కథానాయికలకు సుదీర్ఘమైన కెరీర్ ఉండదు కాబట్టి అవకాశాలు తగ్గేలోపు ఏదో ఒక వ్యాపారంలో నిలదొక్కుకొనేందుకు ప్రయత్నిస్తున్నారు. సమంత 'సాకీ' పేరుతో వస్త్ర వ్యాపారంలోకి అడుగుపెట్టారు. అలాగే చెన్నైలో 'ఏకమ్ ఎర్లీ లెర్నింగ్ సెంటర్' పేరుతో విద్యా సంస్థను నిర్వహిస్తున్నారు. కాజల్ అగర్వాల్, తమన్నా బంగారు ఆభరణాల వ్యాపారంలో రాణిస్తున్నారు. రకుల్ ప్రీత్‌సింగ్ 'ఎఫ్ 45' ఫిట్‌నెస్ స్టూడియోను నడుపుతున్నారు. తాప్సీ 'ది వెడ్డింగ్ ఫ్యాక్టరీ' పేరుతో ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థను నడుపుతున్నారు. కీర్తి సురేశ్ చర్మ సౌందర్య ఉత్పత్తుల తయారీ సంస్థను ప్రారంభించారు.

భవిష్యత్ యుద్ధాలకు ఏరోస్పేస్ కీలకం

- ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్
- దుండిగల్‌లో 214 కోర్సు కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్

అల్వాల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో యుద్ధాలకు గగనతల సైనిక శక్తి, సామర్థ్యాలు(ఏరోస్పేస్ పవర్) కీలకం కానున్నాయని ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్ అన్నారు. శనివారం దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో నిర్వహించిన 214 కోర్సు కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భారత వైమానిక దళం గౌరవాన్ని, సంప్రదాయాలను యువ అధికారులు కాపాడాలన్నారు. కొత్తగా నియమించిన అధికారుల్లో 178 మంది యువకులు, 26 మంది యువతులు ఉన్నారు. మొత్తం 204 మంది గ్రాడ్యుయేషన్‌ను పూర్తి చేసుకున్నారు. ఐఏఎఫ్‌లో వివిధ శాఖల్లో వీరు చేరారు. మరోవైపు, భారత నావికాదళానికి చెందిన 9 మంది అధికారులు, ఇండియన్ కోస్ట్‌గార్డ్ నుంచి 9 మంది అధికారులు, వియత్నాం పీపుల్స్ ఎయిర్‌ఫోర్స్ నుంచి ఒకరు ఈ వేడుకల్లో 'వింగ్స్' అవార్డును అందుకున్నారు. మరోవైపు, భారత వైమానికదళంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఆయుధ వ్యవస్థ విభాగం(వెపన్ సిస్టమ్ బ్రాంచ్)లోకి ఈ గ్రాడ్యుయేషన్ బృందం నుంచే అధికారులను నియమించారు. పరేడ్ తర్వాత, ఎయిర్ ఫోర్సు అకాడమీలో ప్రదర్శించిన స్కైడైవింగ్, ఎయిర్ క్రాఫ్ట్ విన్యాసాలు ప్రేక్షకులను అబ్బురపరిచాయి. వాయుసేనకు చెందిన ఎయిర్ వారియర్ డ్రిల్ టీమ్ నిర్వహించిన డ్రిల్ విశేషంగా ఆకట్టుకొంది.

బెయిల్ ఉత్తర్వులు అందినా..
అక్రమంగా నిర్బంధించారు

- ప్రభుత్వం సమాధానం చెప్పాలి
- అల్లు అర్జున్ అడ్వొకేట్ అశోక్‌రెడ్డి
- కాంగ్రెస్‌ను వీడే యోచనలో అల్లు అర్జున్ మామ


అల్లు అర్జున్ తరపు న్యాయవాది అశోక్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మధ్యంతర బెయిల్ ఉత్తర్వులు అందిన తర్వాత కూడా అల్లు అర్జున్‌ను విడుదల చేయకుండా అక్రమంగా నిర్బంధించారని ఆయన తరపు న్యాయవాది అశోక్‌రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. హైకోర్టు ఇచ్చిన బెయిల్ ఉత్తర్వుల్లో తక్షణమే విడుదల చేయాలని స్పష్టంగా ఉన్నా జైలు అధికారులు పాటించలేదని విమర్శించారు. అందుకు ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. ఈ విషయమై న్యాయ ప్రక్రియ కొనసాగిస్తామని పేర్కొన్నారు. కాగా అల్లు అర్జున్ మామ కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి కాంగ్రెస్ వీడనున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఎలాంటి తప్పు లేకున్నా అల్లుడిని అరెస్టు చేశారని, బెయిల్ వచ్చినా జైలుకి పంపారని అనుచరుల వద్ద ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితిలో పార్టీలో కొనసాగితే అవమానం అనే భావనతో కాంగ్రెస్‌కు రాజీనామా చేయాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది.

ఆందోళనకరంగానే శ్రీతేజ ఆరోగ్యం

- 10రోజులుగా వెంటిలేటర్‌పైనే చికిత్స.. కిమ్స్ హెల్త్ బులెటిన్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాటలో గాయపడ్డ బాలుడు శ్రీతేజ ఆరోగ్య పరిస్థితి ఇంకా ఆందోళనకరంగానే ఉందని కిమ్స్ వైద్యులు తెలిపారు. గత 10 రోజులుగా శ్రీతేజ వెంటిలేటర్‌పైనే ఉంచి చికిత్స అందిస్తున్నామన్నారు. ఈ మేరకు శనివారం హెల్త్ బులెటిన్ విడుదల చేశారు. శ్రీతేజకు పీఐసీయూలో చికిత్స కొనసాగుతోందని, ట్యూబ్‌ల ద్వారా ఆహారం అందిస్తున్నామని కిమ్స్ వైద్యులు చేతన్ ఆర్.ముందాడ, విష్ణు తేజ్‌లు వెల్లడించారు. మెదడు పనితీరులో మెరుగుదల కనిపించడంలేదని, దీంతో బాలుడి ఆరోగ్య పరిస్థితిపై స్పష్టత ఇవ్వలేకపోతున్నామన్నారు. రక్తపోటు, గుండె కొట్టుకోవడం, రక్తప్రసరణ సరిగానే ఉందని.. కానీ లోఫీవర్‌తో బాధపడుతున్నట్లు వివరించారు. కాగా, శ్రీతేజ శరీరంలో కొంతమేర కదలికలు కనిపిస్తున్నాయని.. అయితే వైద్యులు ఆరోగ్య పరిస్థితిపై స్పష్టత ఇవ్వలేదని శ్రీతేజ బంధువులు చెప్పారు.

నేను రమ్మంటేనే మీడియా లోపలికి..

- నిస్సహాయ స్థితిలో నేనే ఆశ్రయించా
- వాళ్ల తప్పులేదు.. ఎక్స్‌లో మంచు మనోజ్
- నాపై రెండ్రోజుల్లో రెండు సార్లు దాడి
- ఎప్పటికైనా నిజమే గెలుస్తుందని వ్యాఖ్య

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): సినీ నటుడు మోహన్ బాబు నివాసంలో మీడియాపై దాడి ఘటనపై అతని కుమారుడు మంచు మనోజ్ స్పందించారు. ఈ విషయంలో మీడియా వారి తప్పేమీ లేదని, తాను రమ్మంటేనే మీడియా వారు తమ ఇంట్లోకి వచ్చారని స్పష్టం చేశారు. నిస్సహాయ స్థితిలో తానే మీడియాను ఆశ్రయించానని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో శనివారం ఓ పోస్టు చేశారు. తొమ్మిది నెలల వయస్సున్న తన బిడ్డను జల్‌పల్లిలోని ఇంట్లోనే ఉంచి.. తనకు జరిగిన అన్యాయాన్ని వివరించేందుకు డిసెంబరు 10న తన భార్యతో కలిసి డీజీపీ కార్యాలయానికి వెళ్లానని మనోజ్ పేర్కొన్నారు. అయితే, సాయంత్రం తిరిగి వచ్చేసరికి ఇంట్లోకి వెళ్లకుండా తనని అడ్డుకున్నారని తెలిపారు. దీంతో గేటును బద్దలుకొట్టి తాను లోపలికి వెళుతుండగా బౌన్సర్లు, భద్రతా సిబ్బంది తనపై దాడి చేశారని ఆరోపించారు. ఈ క్రమంలో తన చొక్కా చిరిగిందని, తెల్ల దుస్తుల్లో ఉన్న ఓ వ్యక్తి ఛాతీపై కొట్టాడని పేర్కొన్నారు. ఆత్మరక్షణ కోసం తాను అతన్ని దూరంగా నెట్టానని తెలిపారు. ఆ సమయంలో తాను మద్యం మత్తులో లేనని స్పష్టం చేశారు. రెండు రోజుల్లో తనపై రెండు సార్లు దాడి జరిగిందని చెప్పారు. ఇలా తనని అడ్డుకుంటుండంతో చిరిగిన చొక్కాతో నిస్సహాయ స్థితిలో బయటకు వచ్చి మీడియా సాయం కోరినట్టు మనోజ్ వివరించారు. ఆ రెండు రోజులు తమ నివాసంలో ఏం జరిగిందో తెలియాలంటే సీసీ కెమెరా ఫుటేజీలను బయటపెట్టాలని తన సోదరుడు మంచు విష్ణుకు సన్నిహితుడైన రాజ్ కొండూరును డిమాండ్ చేశారు. ఈ వివాదానికి సంబంధించి కిరణ్, విజయ్ అనే ఇద్దరు పోలీసుల అదుపులో ఉన్నారని, సీసీ ఫుటేజీల ఆధారంగా వారిని విచారిస్తే వాస్తవాలు బయటికి వస్తాయని మనోజ్ పేర్కొన్నారు.

ఆ కాసేపు కనిపించని విష్ణు

ఇక, తనపై దాడి చేసి చొక్కా చిరిగిన సమయంలో మంచు విష్ణు కాసేపు కనిపించకుండా పోయాడని మనోజ్ ఆరోపించారు. తన తండ్రి మోహన్ బాబు మీడియా వారిపై దాడి చేసి ఇంట్లోకి తిరిగి వెళ్లిన తర్వాత తిరిగి విష్ణు బయటికొచ్చాడని తెలిపారు. తమ తండ్రిని విష్ణు ఆస్పత్రికి తీసుకెళ్లాడని చెప్పారు. దీనిని కొన్ని గంటల ముందు తనకు మద్దతుగా వచ్చిన వారిని విష్ణు భయపెట్టేందుకు యత్నించారని ఆరోపించారు. అవసరమైతే ఆయుధాలు కూడా తెప్పిస్తానని తన బౌన్సర్లకు విష్ణు చెప్పాడని అన్నారు. అయితే, తన కుటుంబం పట్ల వినయ్ వ్యవహరిస్తున్న తీరు అన్యాయం, అనైతికమని మనోజ్ ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఎలాంటి తప్పు చేయలేదని, ఎక్కడికీ పారిపోనని, ఎప్పటికైనా నిజమే గెలుస్తుందని పేర్కొన్నారు.

13 గంటలు జైల్లో!

శనివారం ఉ. 6:30 గంటలకు జైలు నుంచి విడుదలైన అల్లు అర్జున్

- అరెస్టయిన రోజు సాయంత్రం చాయ్, బిస్కెట్లు.. జైలులో ఎగ్‌ఫ్రైడ్ రైస్‌తో డిన్నర్
- బ్యారక్‌లో బెడ్, కుర్చీ ఏర్పాటు
- ఇదే కేసులో మరో ఇద్దరు బెయిల్‌పై విడుదల
- బాధిత కుటుంబాన్ని త్వరలో పరామర్శిస్తా: అల్లు అర్జున్


చంచల్‌గూడ జైలు నుంచి వచ్చిన అల్లు అర్జున్‌కు నివాసం వద్ద దిష్టి తీస్తున్న బామ్మ

సైదాబాద్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): సినీనటుడు, పుష్ప చిత్రం కథానాయకుడు అల్లు అర్జున్ 13 గంటలు చంచల్‌గూడ జైల్లో ఉన్నారు. అరెస్టయిన రోజు రాత్రి జైలు క్యాంటీన్‌లో వండిన ఎగ్‌ఫ్రైడ్ రైస్ తిన్నారు. రాత్రిపూట చలితో ఇబ్బందిపడ్డారు. చాలాసేపు మెలకువగానే ఉన్న ఆయన, అర్ధరాత్రి తర్వాత నిద్రపోయారు. ఎక్స్‌రోడ్‌లోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట, మహిళ మృతి కేసులో శుక్రవారం అరెస్టయి రిమాండ్ ఖైదీగా సాయంత్రం 5:30 గంటలకు చంచల్‌గూడ జైలుకు వెళ్లారు. శనివారం ఉదయం 6:30 గంటలకు మధ్యంతర బెయిల్ మీద జైలు నుంచి విడుదలయ్యారు. అల్లు అర్జున్ అరెస్టయిన గంటలోనే హై కోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసినప్పటికీ.. బెయిల్ పత్రాలు సమయానికి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ కాకపోవడం, ఇతర సాంకేతిక కారణాలతో విడుదల జాప్యమైంది. జైల్లో అల్లు అర్జున్‌ను అధికారులు అండర్ ట్రయల్ ఖైదీ నంబర్ 7697 కేటాయించి మంజీరా బ్యారక్‌లో గట్టి బందోబస్తు మధ్య ఉంచారు. జైలు అధికారులు అల్లు అర్జున్‌కు తొలుత చాయ్, బిస్కెట్లు ఇచ్చారు. హైకోర్టు మధ్యంతర బెయిల్ ఇచ్చిందన్న సమాచారం మేరకు అధికారులు ఎలాంటి ఏర్పాట్లు చేయలేదు. న్యాయస్థానం ఆదేశాల మేరకు స్పెషల్ కేటగిరి సదుపాయాలు కల్పించాల్సి ఉండటంతో ఆయనకు ఒక బెడ్, కుర్చీ ఏర్పాటు చేశారు. రాత్రి ఎగ్‌ఫ్రైడ్ రైస్ తిన్నారు. వాస్తవానికి డిన్నర్ చేయడానికి ఆయన ఇష్టపడలేదు. ఏదైనా తినాలి కదా? బయట నుంచైనా భోజనం తెప్పించుకుంటారా? అని జైలు అధికారులు ఆయన్ను అడిగినట్లు తెలిసింది. దీనికి అల్లు అర్జున్.. ఇక్కడే ఏదైనా దొరుకుతుందా? అని అడగడంతో క్యాంటీన్‌లో ఎగ్ ఫ్రైడ్‌రైస్ చేయిస్తామని అధికారులు చెప్పారు. రాత్రిపూట చలి ఎక్కువగా ఉండటంతో అధికారులు అల్లు అర్జున్‌కు కొత్త రగ్గు, దుప్పట్లను అందజేశారు. అర్ధరాత్రి చాలాసేపటి వరకు మెలకువగా ఉన్న అల్లు అర్జున్ ఆ తర్వాత తనకు కేటాయించిన బెడ్‌పై నిద్రపోయారు. తెల్లవారుజామున 5.30 గంటలకు ఆయన్ను జైలు సిబ్బంది నిద్రలేపి విడుదలకు సిద్ధం చేసినట్లు తెలిసింది. విడుదల సమయంలో ఆయన తండ్రి అల్లు అరవింద్, మామ కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి జైలు వద్దకు చేరుకున్నారు. ఉదయం 6.30 గంటలకు అల్లు అర్జున్ జైలు బయటకొచ్చారు. ఈ సందర్భంగా జైలు సిబ్బంది ఆయనతో సెల్ఫీ తీసుకునేందుకు పోటీ పడ్డారు. సెక్యూరిటీ కారణంగా పోలీసుల ఆదేశాలతో అల్లు అర్జున్‌ను జైలు వెనుక మార్గం నుంచి పంపించారు. అక్కడి నుంచి తండ్రి అల్లు అరవింద్‌తో కలిసి ఆయన వెళ్లిపోయారు. ఇదే కేసులో అరెస్టయిన నిందితుల్లో ఇద్దరు.. థియేటర్ పార్టనర్స్ అగమాటి పెద్ద రామారెడ్డి, అగమాటి చిన్న రామారెడ్డికి బెయిల్ మంజూరైంది. వారు కూడా శనివారం బెయిల్‌పై విడుదలైనట్లు జైలు అధికారులు వెల్లడించారు.

ఒంటిపై డీజిల్ పోసుకొని అభిమాని హంగామా

అల్లు అర్జున్‌ను వెంటనే విడుదల చేయాలంటూ ఓ అభిమాని జైలు ముందు ఒంటిపై డీజిల్ పోసుకుని నిప్పంటించుకునేందుకు ప్రయత్నించాడు. అతడిని పోలీసులు అడ్డుకున్నారు. అల్లు అర్జున్‌ను ఎందుకు అరెస్ట్ చేశారంటూ పోలీసులతో అతడు వాగ్వివాదానికి దిగాడు. అతడిని పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సదరు వ్యక్తి బాలాపూర్‌కు చెందిన ఆటో డ్రైవర్ ముదావత్ రాజు(31)గా గుర్తించారు. అతడిపై డబీర్‌పురా పోలీసులు కేసు నమోదు చేశారు.

చట్టాన్ని గౌరవిస్తాను: అల్లు అర్జున్

సంధ్య థియేటర్ వద్ద జరిగిన తన ప్రమేయం లేదని, 20 ఏళ్ల నుంచి ప్రేక్షకులతో కలిసి ఆ థియేటర్‌లో సినిమా చూస్తున్నానని సినీ నటుడు అల్లు అర్జున్ అన్నారు. థియేటర్‌లో మహిళ మృతిచెందడం ప్రమాదవశాత్తు జరిగిన ఘటన అని, అది చాలా దురదృష్టకరమని పేర్కొన్నారు. తాను చట్టాన్ని గౌరవిస్తానని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి తాను అండగా ఉంటానని, త్వరలోనే ఆ కుటుంబసభ్యులను పరామర్శిస్తానని చెప్పారు. తాను బాగానే ఉన్నానని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. తనకు మద్దతు తెలిపిన అభిమానులు, సినీ ప్రముఖులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇక మహిళ మృతి ఘటనలో తన కుమారుడికి సంబంధం లేదని, ఆ ఘటన దురదృష్టకరం అని అల్లు అరవింద్ అన్నారు. బన్నీని జైలు నుంచి బయటకు తీసుకొచ్చేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ, మీడియాకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని చెప్పారు.

అరెస్టుతో ప్రభుత్వానికి
సంబంధం లేదు

- అల్లు అర్జున్‌పై సర్కారుకు ఎలాంటి ద్వేషం లేదు
- చట్టం తన పని తాను చేసుకుపోతుంది: సీతక్క
- అల్లు అర్జున్ మామ కాంగ్రెస్ నేతే
- ఫార్ములా -ఈ స్కామ్‌లో అక్రమాలు తేలితే.. కేటీఆర్‌పైనా చర్యలు : మహేశ్ కుమార్ గౌడ్

ఖానాపూర్/ఉట్నూర్, హైదరాబాద్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సినీ కథానాయకుడు అల్లు అర్జున్ అరెస్టుతో తమ ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని మంత్రి సీతక్క పేర్కొన్నారు. సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట, ఓ మహిళ మృతి కేసులో చట్టం తనపని తాను చేసుకుపోతుందని చెప్పారు. శనివారం నిర్మల్ జిల్లా కడెం మండలంలో పర్యటించిన సందర్భంగా అల్లు అర్జున్ అరెస్టుపై మాట్లాడారు. అల్లు అర్జున్‌పై తమ ప్రభుత్వానికి ఎటువంటి ద్వేషం లేదని, ఆ మాటకొస్తే అల్లు అర్జున్ మామ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బంధువేనని చెప్పారు. సినీ హీరో చిరంజీవి కూడా కాంగ్రెస్ నేపథ్యం ఉన్న వారేనన్నారు. చట్టపరంగా జరిగే అంశాలపై రాద్ధాంతం తగదన్నారు. ఇక చట్టానికి ఎవరూ అతీతులు కాదని, దాని ముందు అందరూ సమానమేనని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించారు. సంజయ్‌గాంధీ 44వ వర్ధంతి సందర్భంగా గాంధీ భవన్‌లో శనివారం ఆయన చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం విలేకరులతో ఆయన అల్లు అర్జున్ అరెస్టుపై మాట్లాడారు. సంధ్య థియేటర్‌లో జరిగిన తొక్కిసలాటలో ఒక సామాన్యురాలు ప్రాణాలు కోల్పోయిందని, ఆమె కుమారుడు చావు, బతుకుల మధ్య కొట్టు మిట్టాడుతున్నాడని గుర్తు చేశారు. అల్లు అర్జున్‌కు పిల్లనిచ్చిన మామ.. కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకుడేనని, సీఎం రేవంత్‌రెడ్డికీ.. అల్లు అర్జున్ కుటుంబంతో బంధుత్వం ఉందన్నారు. అయినా చట్టం ముందు అందరూ సమానమేనని చెప్పారు. తెలుగు చిత్రసీమకు, కాంగ్రెస్ పార్టీకి విడదీయరాని బంధం ఉందన్నారు. కాగా.. ఫార్ములా-ఈ రేసింగ్‌లో నిధుల్లో గోల్‌మాల్ జరిగినట్లుగా అధికారులు గుర్తించారని, ఇందులో కేటీఆర్ అక్రమాలకు పాల్పడినట్లు తెలితే ఆయనపైనా చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడి కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేసిందన్నారు. పదేళ్ల అధికారంలో ఉండి తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు పైనా ఎందుకు ధ్యాస పెట్టలేదో కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు, కవిత చెప్పాలన్నారు.

నవ్య | చిత్రజ్యోతి



నరసింహం చేసే సవారి

బాలకృష్ణ కథానాయకుడిగా బాబీ కొల్లి తెరకెక్కిస్తున్న చిత్రం 'డాకు మహారాజ్'. బాబీ డియోల్, శ్రద్ధా శ్రీనాథ్, ప్రగ్యా జైస్వాల్, చాందినీ చౌదరి కీలక పాత్రలు పోషిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టైటిల్ టీజర్ సినిమాపై అంచనాలను పెంచేసింది. శనివారం ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'ద రేజ్ ఆఫ్ డాకు'ను విడుదల చేశారు మేకర్స్. అనంత శ్రీరామ్ రచించిన ఈ గీతాన్ని నకాశ్ అజీజ్, భరత్‌రాజ్, రితేశ్.జి.రావు, కె.ప్రణతి ఆలపించారు. తమన్ సంగీతం అందించారు. సంక్రాంతి కానుకగా వచ్చే ఏడాది జనవరి 12న ఈ సినిమా విడుదలవుతోంది.



మరో విజయం ఖాయం

నాని

సుబ్బు మంగదేవి దర్శకత్వంలో అల్లరి నరేశ్, అమృత అయ్యర్ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'బచ్చలమల్లి'. రాజేశ్ దండా, బాలాజీ గుత్తా నిర్మించారు. ఈనెల 20న విడుదలవుతోందీ చిత్రం. ఈ సందర్భంగా ట్రైలర్‌ను హీరో నాని శనివారం లాంచ్ చేశారు. ఆయన మాట్లాడుతూ "బచ్చలమల్లి' సినిమాతో అల్లరి నరేశ్ మరో విజయం సాధించడం ఖాయం. టీజర్, ట్రైలర్ అదిరిపోయాయి. నాకు బాగా నచ్చిన సంగీత దర్శకుడు విశాల్ చంద్రశేఖర్. ఆయన సంగీతం ఈ సినిమాకు ప్రత్యేకాకర్షణగా నిలుస్తుంది" అన్నారు. అల్లరి నరేశ్ మాట్లాడుతూ 'సుబ్బు ఎంత అద్భుతంగా ఈ కథ చెప్పారో అంతకన్నా విన్నగా తెరపైకి తెచ్చారు. ఈ సినిమా నా కెరీర్‌లో గుర్తుండిపోతుంది' అని అన్నారు. ప్రేక్షకులు మా చిత్రాన్ని ఆదరించాలని హీరోయిన్ అమృత అయ్యర్ కోరారు. సుబ్బు మాట్లాడుతూ 'కథను అర్థం చేసుకొని నరేశ్ పాత్రోచితంగా నటించినందువల్లే ఈ సినిమా ఇంత గ్రాండ్‌గా వచ్చింది' అని అన్నారు. నిర్మాత రాజేశ్ దండా మాట్లాడుతూ ' ఈ క్రిస్మస్‌కి 'బచ్చలమల్లి' మోత మోగిపోద్ది. సినిమాపై అంత కాన్ఫిడెంట్‌గా ఉన్నాను' అని తెలిపారు.


పుష్ప ఇంటికి సినీ ప్రముఖులు

- కంటతడి పెట్టిన సురేఖ, సుకుమార్
- పలువురు సినీ ప్రముఖుల పరామర్శ



'పుష్ప 2' ప్రీమియర్ షో సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట కేసులో అరెస్టయిన అల్లు అర్జున్ మధ్యంతర బెయిలుపై శనివారం ఉదయం చంచల్‌గూడ జైలు నుంచి విడుదలయ్యారు. అక్కడి నుంచి తన తండ్రి అల్లు అరవింద్‌తో కలసి నేరుగా గీతా ఆర్ట్స్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ న్యాయవాది అశోక్ రెడ్డితో అరగంట చర్చించిన అనంతరం ఇంటికి వెళ్లారు. ఆయన ఇంటికి చేరుకోగానే అక్కడ వాతావరణం అంతా ఒక్కసారిగా ఉద్విగ్నభరితంగా మారింది. అల్లు అర్జున్ సతీమణి స్నేహారెడ్డి, కుమారుడు అయాన్, కూతురు అర్హ భావోద్వేగానికి గురయ్యారు. ఆయనను చూడడానికి అభిమానులు భారీగా తరలివచ్చారు. పలువురు సినీ ప్రముఖులు అల్లు అర్జున్‌ను కలసి పరామర్శించారు. దర్శకుడు సుకుమార్, చిరంజీవి సతీమణి, సురేఖ.. అల్లుఅర్జున్‌ను హత్తుకుని కంటతడి పెట్టారు. దర్శకుడు కె.రాఘవేంద్రరావు, వంశీ పైడిపల్లి, కొరటాల శివ, హరీష్ శంకర్, బోయపాటి శ్రీను నిర్మాత నవీన్ యెర్నేని, వై. రవిశంకర్, దిల్‌రాజు, డి. సురేశ్‌బాబు హీరో వెంకటేశ్, విజయ్ దేవరకొండ, ఆనంద్ దేవరకొండ, దగ్గుబాటి రానా, నాగచైతన్య, ఉపేంద్ర, సిద్ధు జొన్నలగడ్డ, సుధీర్‌బాబు, శర్వానంద్, ఆర్.నారాయణమూర్తి, సంగీత దర్శకుడు తమన్, రాజశేఖర్, జీవిత తదితరులు అల్లు అర్జున్‌ను కలిశారు. ప్రభాస్, జూనియర్ ఎన్టీఆర్ అల్లు అర్జున్‌తో ఫోన్‌లో మాట్లాడారు. శ్రీలీల, మంచు మనోజ్ సోషల్ మీడియా వేదికగా బన్నీకి మద్దతు తెలిపారు.

అల్లు అర్జున్‌కు చంద్రబాబు ఫోన్



సినీ హీరో అల్లు అర్జున్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫోన్ చేసి మాట్లాడారు. శనివారం అల్లు అర్జున్ జైలు నుంచి విడుదలై ఇంటికి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి ఆయనకు ఫోన్ చేసి పరామర్శించారని తెలుగుదేశం పార్టీ వర్గాలు తెలిపాయి. ఏం జరిగిందో అడిగి తెలుసుకొని భరోసా ఇచ్చారని వివరించాయి. అల్లు అర్జున్ అరెస్టు జరిగిన తర్వాత శుక్రవారం రాత్రి ఆయన తండ్రి అల్లు అరవింద్‌కు చంద్రబాబు ఫోన్ చేసి మాట్లాడారు. ఆందోళన చెందవద్దని, సమస్య పరిష్కారం అవుతుందని ధైర్యం చెప్పారని సమాచారం.

-అమరావతి (ఆంధ్రజ్యోతి)

నేను పారిపోలేదు



తాను ఎక్కడికీ పారిపోలేదని, తన ముందస్తు బెయిల్‌ను న్యాయస్థానం తిరస్కరించలేదని సినీ నటుడు మోహన్‌బాబు వెల్లడించారు. ఈ విషయాన్ని శనివారం సోషల్ మీడియా ద్వారా తెలిపారు. ప్రస్తుతం అనారోగ్యంతో బాధపడుతున్నానని, జల్‌పల్లిలోని ఇంట్లో వైద్యుల పర్యవేక్షణలో ఉన్నానని వెల్లడించారు. మీడియా వాస్తవాలను వెల్లడించాలని, తప్పుడు ప్రచారాలు చేయొద్దని కోరారు. జర్నలిస్టుపై జరిగిన దాడి కేసులో 'మోహన్‌బాబుకు న్యాయస్థానంలో ఊరట లభించలేదు, ఆయన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను న్యాయస్థానం తిరస్కరించింది' అంటూ జరుగుతున్న ప్రచారంలో నిజంలేదని ఆయన తెలిపారు. జల్‌పల్లిలోని తన నివాసంలో మీడియాపై దాడి చేసిన ఘటనలో పహాడీషరీఫ్ పోలీసులు ఆయనపై హత్యాయత్నం కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో విచారణను న్యాయస్థానం ఈనెల 19కి వాయిదా వేసినట్లు తెలిసింది.

- హైదరాబాద్ సిటీ (ఆంధ్రజ్యోతి)

హెచ్‌బీఎల్ ఇంజనీరింగ్‌కు రూ.1,522 కోట్ల ఆర్డర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హెచ్‌బీఎల్ ఇంజనీరింగ్ లిమిటెడ్ (గతంలో హెచ్‌బీఎల్ పవర్ సిస్టమ్స్ లిమిటెడ్).. చిత్తరంజన్ లోకోమోటివ్ వర్క్స్ నుంచి రూ.1,522.40 కోట్ల విలువైన ఆర్డర్‌ను చేజిక్కించుకున్నట్లు ప్రకటించింది. ఆర్డర్‌లో భాగంగా 2,200 లోకోమోటివ్స్‌కు ఆన్-బోర్డ్ కొలిషన్ అవాయిడెన్స్ సిస్టమ్ (టీసీఏఎస్, కవచ్) పరికరాల సరఫరా, ఇన్‌స్టలేషన్, కమిషనింగ్ చేయాల్సి ఉంటుందని తెలిపింది. 12 నెలల కాలంలో ఈ ఆర్డర్‌ను పూర్తి చేయాల్సి ఉంటుందని హెచ్‌బీఎల్ ఇంజనీరింగ్ వెల్లడించింది.

18న ఐడెంటికల్ బ్రెయిన్స్ ఐపీఓ

న్యూఢిల్లీ: వీఎఫ్ఎక్స్ కంపెనీ ఐడెంటికల్ బ్రెయిన్స్ స్టూడియోస్ (ఐబీఎస్).. పబ్లిక్ ఇష్యూ ఈ నెల 18న ప్రారంభమై 20న ముగియనుంది. పబ్లిక్ ఇష్యూలో భాగంగా ఒక్కో షేరు ధరను రూ.51-54గా ఖరారు చేసింది. కంపెనీ ఈ షేర్లను ఎన్ఎస్ఈ ఎమర్జ్ ప్లాట్‌ఫామ్‌పై లిస్ట్ చేయనుంది. ఈ ఐపీఓ ద్వారా కంపెనీ రూ.19.95 కోట్లను సమీకరించాలని భావిస్తోంది.

ఐపీఓకి ఎలిగాంజ్ ఇంటీరియర్స్: ఎలిగాంజ్ ఇంటీరియర్స్ పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ఈ మేరకు ఎన్ఎస్ఈ ఎమర్జ్‌కు ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఇష్యూతో కంపెనీ కొత్తగా రూ.10 ముఖ విలువతో కూడిన 60.05 లక్షల షేర్లను జారీ చేయనుంది.

2025 డిసెంబరు నాటికి నిఫ్టీ @ 26,100

కోటక్ సెక్యూరిటీస్ అంచనా



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఈ ఏడాది దేశీయ స్టాక్ మార్కెట్ భారీ ఒడుదుడుకులకు లోనైంది. వరుస రికార్డులు మురిపించగా.. భారీ పతనాలు కుదిపేశాయి. ఈ సెప్టెంబరులో సరికొత్త జీవితకాల గరిష్ఠ స్థాయి 26,277 వద్దకు ఎగబాకిన నిఫ్టీ.. విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలు పోటెత్తించడంతో అక్టోబరు, నవంబరులో భారీ నష్టాలను చవిచూసింది. ప్రస్తుతం సూచీ 24,750 ఎగువ స్థాయిలో ట్రేడవుతోంది. అయినప్పటికీ, ఈ ఏడాదిలో ఇప్పటివరకు సూచీ 11 శాతం మేర వృద్ధి కనబరిచింది. అయితే, వచ్చే ఏడాదిలో మార్కెట్ పనితీరుపై కోటక్ సెక్యూరిటీస్ అప్రమత్తతతో కూడిన ఆశాభావాన్ని వ్యక్తపరిచింది. 2025 డిసెంబరు నాటికి నిఫ్టీ 26,100 వద్దకు చేరవచ్చని తాజా నివేదికలో అంచనా వేసింది. ప్రస్తుత స్థాయితో పోలిస్తే, వచ్చే ఏడాది కాలంలో సూచీ కేవలం 6 శాతం వృద్ధి కనబరిచే అవకాశం ఉంది.

వచ్చే డిసెంబరు నాటికి నిఫ్టీ అంచనా

బుల్ ట్రెండ్	28,800
బేరిష్ ట్రెండ్	23,300
బేస్ కేస్	26,100

ఐటీ, ఫార్మా పనితీరు మెరుగ్గా ఉండే చాన్స్

సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో జీడీపీ వృద్ధి రేటు రెండేళ్ల కనిష్ఠ స్థాయి 5.4 శాతానికి జారుకుంది. అక్టోబరులో రిటైల్ ధరల ఆధారిత ద్రవ్యోల్బణం 6 శాతానికి ఎగువన నమోదైంది. నవంబరులో 5.48 శాతానికి దిగివచ్చినప్పటికీ.. ఇంకా ఆందోళనకర స్థాయిలోనే ఉంది. నెమ్మదించిన వృద్ధి, దిగిరానంటోన్న ధరలతో పాటు అమెరికా కొత్త అధ్యక్షుడు ట్రంప్ వాణిజ్య విధానాలు, సుంకాల వడ్డనలు, బలోపేతమవుతున్న డాలర్ వంటి అంశాలు మార్కెట్లకు సవాళ్లుగా పరిణమించవచ్చని కోటక్ సెక్యూరిటీస్ భావిస్తోంది. ఈ నేపథ్యంలో వచ్చే ఏడాది ఈక్విటీ రిటర్నులపై పెద్దగా ఆశలు పెట్టుకోవద్దని సూచిస్తోంది.

కొత్త సంవత్సరంలో బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ), ఐటీ, రియల్టీ, ఫార్మా అండ్ హెల్త్‌కేర్ రంగాలు మెరుగైన పనితీరు కనబరిచే అవకాశం ఉందని నివేదికలో పేర్కొంది. ఇప్పటికే చాలా కంపెనీల షేర్లు అధిక ధరల వద్ద ట్రేడవుతున్న నేపథ్యంలో ఆకర్షణీయ ధరల్లో లభిస్తోన్న నాణ్యమైన స్టాక్స్‌ను ఎంచుకోవడం మేలని కోటక్ సూచిస్తోంది.

రూపాయి మరింత పతనం

వచ్చే ఏడాదిలో రూపాయి విలువ మరింత క్షీణించవచ్చని కోటక్ సెక్యూరిటీస్ భావిస్తోంది. వచ్చే ఏడాది చివరి నాటికి డాలర్‌తో రూపాయి మారకం రేటు రూ.86/87 స్థాయికి చేరవచ్చని అంచనా వేసింది. డాలర్ ఆధిపత్యమే లక్ష్యంగా ట్రంప్ చేపట్టనున్న ఆర్థిక, వాణిజ్య విధానాలు, సుంకాలు వడ్డనలు ప్రపంచ మార్కెట్లను, కరెన్సీలను తీవ్రంగా ప్రభావితం చేయవచ్చని బ్రోకరేజీ సంస్థ అభిప్రాయపడింది.

గోల్డెన్ ఇయర్

ఈ ఏడాదిలో 30 శాతానికి పైగా పెరిగిన పసిడి

- దశాబ్దకాలంలో ఇదే అత్యుత్తమ వృద్ధి
- సెంట్రల్ బ్యాంకులు, ఇన్వెస్టర్ల డిమాండే కారణం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఈ ఏడాది (2024) బంగారం మదుపరులకు అద్భుతమైన రిటర్నులు అందించింది. ఈ ఏడాది ఇప్పటివరకు పసిడి ధర గ్రాముకు ఏకంగా రూ.7,300 మేర (30 శాతానికి పైగా) పెరిగింది. బులియన్ ఇన్వెస్టర్లకు దశాబ్ద కాలంలో ఇదే అత్యుత్తమ వార్షిక ప్రతిఫలమని ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) తాజా నివేదిక వెల్లడించింది. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో ఇన్వెస్టర్లతో పాటు పలు దేశాల సెంట్రల్ బ్యాంకులు భారీగా బంగారం కొనుగోళ్లకు పాల్పడటం ఇందుకు కారణమైంది. అయితే, ధర అమాంతం పెరగడంతో సామాన్య ప్రజానీకం స్వర్ణాభరణాల కొనుగోళ్లు గణనీయంగా తగ్గాయి.

ఈ ఏడాదిలో సెప్టెంబరుతో ముగిసిన మూడు త్రైమాసికాల్లో ప్రపంచ దేశాల సెంట్రల్ బ్యాంకులు మొత్తం 694 టన్నుల బంగారం కొనుగోలు చేశాయి. అందులో భారత్ వంటి వర్ధమాన దేశాల సెంట్రల్ బ్యాంకుల కొనుగోళ్లే అధికమని రిపోర్టు పేర్కొంది. భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) అక్టోబరులోనే 27 టన్నులు కొనుగోలు చేసింది. ఈ ఏడాది అక్టోబరు వరకు ఆర్‌బీఐ బంగారం నిల్వలను 77 టన్నుల మేర పెంచుకుంది. 2023తో పోలిస్తే ఐదు రెట్లు ఎక్కువ కొనుగోలు చేసింది. కాగా, టర్కీ 72 టన్నులు, పోలాండ్ 69 టన్నుల కొనుగోళ్లు జరిపింది. రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయెల్-పాలస్తీనా మధ్య ఉద్రిక్తతలు, యూఎస్ ఫెడ్ రేట్ల తగ్గుదల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లో బంగారంలో పెట్టుబడులకు డిమాండ్ ఊపందుకుంది. దాంతో ఈ ఏడాది ద్వితీయార్ధంలో పసిడి వేగంగా పరుగు తీసింది.

2025లో రిటర్నులు అంతంతే..

అయితే 2025లో మాత్రం పసిడి పరుగు నెమ్మదించవచ్చని బులియన్ మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అమెరికా కొత్త అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నిక, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, ఆర్థిక సేవల మార్కెట్‌పై ఆయన వాణిజ్య విధానాల ప్రభావంతో పాటు బులియన్ ర్యాలీకి పలు సవాళ్లు ఎదురుకావచ్చన్నారు. ప్రపంచంలో అతిపెద్ద బంగారం వినియోగదారైన చైనా ఆర్థిక పరిస్థితులూ బులియన్ డిమాండ్‌ను ప్రభావితం చేయనున్నాయి. ధరలు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో చైనాలోనూ వినియోగదారులు బంగారం కొనుగోళ్ల విషయంలో వేచి చూసే ధోరణిని కనబరుస్తున్నారని డబ్ల్యూజీసీ పేర్కొంది. సెంట్రల్ బ్యాంకులు, ఇన్వెస్టర్ల కొనుగోళ్లు అంచనాలను మించితే తప్ప వచ్చే ఏడాదీ పసిడి జోరు కొనసాగకపోవచ్చని భావిస్తున్నారు.

2025 డిసెంబరు నాటికి ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ 3,000-3,150 డాలర్ల స్థాయికి చేరుకోవచ్చని అంతర్జాతీయ ఆర్థిక సేవల దిగ్గజం గోల్డ్‌మన్ శాక్స్ అంచనా వేసింది. అంటే, ప్రస్తుత 2,650 డాలర్ల స్థాయితో పోలిస్తే వచ్చే ఏడాది పసిడి 17 శాతం వరకు పెరిగే అవకాశాలున్నాయి. కాగా, వచ్చే ఏడాది డిసెంబరు నాటికి ఔన్స్ గోల్డ్ 2,900-3,000 డాలర్లకు చేరవచ్చని స్విస్ బ్యాంకింగ్ దిగ్గజం యూబీఎస్ అంచనా వేసింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,890 ▼	71,400 ▼	1,00,000 ▼
విజయవాడ	78,000 ▼	72,000 ▼	93,000 ▲
విశాఖపట్నం	77,220 ▼	70,790 ▼	90,920 ▲
రాజమండ్రి	77,780 ▼	71,300 ▼	92,000 ▼
ప్రొద్దుటూరు	78,000 ▼	72,230 ▼	92,000 ▼
ముంబై	76,922 ▼	70,461 ▼	89,976 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

15వ తేదీ

హైదరాబాద్	620	విజయవాడ	630
వరంగల్	622	గోదావరి	630
చిత్తూరు	633	విశాఖపట్నం	620

దజను గుడ్లు రూ. 84

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	101	విజయవాడ	104
వరంగల్	101	గుంటూరు	107
కరీంనగర్	101	ఒంగోలు	107
మహబూబ్‌నగర్	101	చిత్తూరు	90
కర్నూలు	101	నెల్లూరు	90
విశాఖపట్నం	108	అనంతపురం	90
గోదావరి	104		

కొత్త సంవత్సర వేడుకలు.. జీఎస్‌టీ..?

ఇదీ GST



రాంబాబు గొండాల

కుల, మత, ప్రాంతాలకు అతీతంగా ప్రపంచవ్యాప్తంగా ప్రజలందరూ ఉత్సాహంగా జరుపుకునే వేడుక ఏదైనా ఉందంటే అది నూతన సంవత్సర వేడుక మాత్రమే. ముఖ్యంగా పాత సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ విశ్వవ్యాప్తంగా డిసెంబరు 31 రాత్రి సంబరాలు జరుపుకోవటం పరిపాటి. ఈ వేడుకలు భారీ ఎత్తున నిర్వహించటానికి వివిధ హోటళ్లు, క్లబ్బులు, రిసార్టులు ఈ మధ్య కాలంలో విపరీతంగా పోటీ పడుతున్నాయి. జాతీయ, అంతర్జాతీయ కళాకారులతో వివిధ రకాల వినోద కార్యక్రమాలతో ఈ వేడుకలను అట్టహాసంగా జరుపుతుంటారు. దీనికి సంబంధించి ప్రత్యేక ప్యాకేజీలను కూడా ఆయా సంస్థలు అందిస్తుంటాయి. ఉదాహరణకు ఒక రిసార్ట్ డిసెంబరు 31ని పురస్కరించుకుని ఒక ప్రత్యేక ఈవెంట్‌ను నిర్వహిస్తుందనుకుందాం. దీనికి సంబంధించి ప్రవేశ రుసుము ఒక్కరికి రూ.5,000. టికెట్ తీసుకున్న వ్యక్తి ఆ ఈవెంట్‌కు సంబంధించిన వినోద కార్యక్రమాలు వీక్షించటంతో పాటు ఆహార, పానీయాలు అంటే ఆల్కహాల్ కూడా పొందవచ్చు. అలాగే స్పెషల్ ఈవెంట్‌తో పాటు ఒక రోజు రిసార్ట్‌లో ఉండేటట్లు రూమ్‌తో కూడిన మరొక ప్యాకేజీ ఉంది. దీంతోపాటుగా తమ థీమ్ పార్క్ లేదా అమ్యూజ్‌మెంట్ పార్క్ సందర్శనతో కూడిన ఇంకొక ప్యాకేజీ రూపొందించింది. మరి ఈ ప్యాకేజీలకు జీఎస్‌టీ ఎలా చెల్లించాలి?

ఇది అర్థం చేసుకోవటానికి ముందుగా హోటల్స్‌లో లేదా రిసార్ట్స్‌లో పన్ను రేటు ఎలా ఉంటుందో తెలుసుకోవాలి. రూములకు జీఎస్‌టీ అనేది 12 శాతం లేదా 18 శాతంగా వాటి విలువను బట్టి ఉంటుంది. ఒకరోజు అద్దె రూ.7,500 లేదా అంతకంటే తక్కువ ఉన్న వాటికి 12 శాతంగా, రూ.7,500కి పైన ఉన్న వాటికి 18 శాతంగా నిర్ణయించటం జరిగింది. అలాగే అక్కడి రెస్టారెంట్ సేవలకు హోటల్ టైపును బట్టి జీఎస్‌టీ 5 శాతం, 18 శాతంగా నిర్ణయించటం జరిగింది. అలాగే ఈవెంట్స్‌కు వసూలు చేసే ప్రవేశ రుసుము మీద 18 శాతం జీఎస్‌టీ చెల్లించాలి. ఇంకొక ముఖ్య విషయం ఏమిటంటే, మామూలుగా అయితే రెస్టారెంట్ సర్వీస్‌లలో ఆల్కహాల్ మీద జీఎస్‌టీ వర్తించదు. బిల్లులో ఆల్కహాల్ మేర తగ్గించి మిగతా మొత్తం మీద జీఎస్‌టీ చెల్లించాలి. మరి ఇప్పుడు ఈ డిసెంబరు 31 ప్రత్యేక ప్యాకేజీలో అన్ని కలిపి ఉంటాయి. మరి జీఎస్‌టీ ఎలా లెక్కించాలి. అలాగే విలువలో లిక్కర్ మేరకు తగ్గించాలా లేదా అనేది సమస్య.

జీఎస్‌టీ చట్టంలో మిక్స్‌డ్, కాంపోజిట్ సరఫరా అనే రెండు రకాల సరఫరాలు ఉంటాయి. కాంపోజిట్ సరఫరాలో ఒక ప్రధాన సరఫరా ఉంటుంది. దీనికి అనుబంధంగా ఒకటి లేదా అంతకంటే ఎక్కువ సరఫరాలు ఉంటాయి. ఇవన్నీ సహజంగా కలిసి ఉంటాయి. ఉదాహరణకు ఏదేనీ బహుమతి కొన్నప్పుడు దానికి ఒక గిఫ్ట్ పేపర్ చుట్టటం, హోటల్‌లో రూమ్‌తో అల్పాహారం ఇవ్వటం, రైలు ప్రయాణంతో భోజనం కలిపి ఇవ్వటం. వీటిలో గిఫ్ట్, హోటల్ రూమ్, రైలు ప్రయాణం అనేవి ప్రధాన సరఫరా. ప్రధాన సరఫరాకు వర్తించే జీఎస్‌టీ రేటు కాంపోజిట్ సరఫరాకు వర్తిస్తుంది. ఇక మిక్స్‌డ్ సరఫరాలో కూడా రెండు లేదా అంతకంటే ఎక్కువ సరఫరాలు ఉన్నా ఇందులో ఒక ప్రధాన సరఫరా అంటూ ఉండదు. అన్నీ విడివిడిగా అమ్మగలిగే విధంగా ఉన్నప్పటికీ సౌలభ్యం కోసం ఒకటే రుసుము వసూలు చేస్తారు. ఉదాహరణకు సూపర్ మార్కెట్లో వాషింగ్ పౌడర్, బకెట్ కలిపి లేదా టూత్‌పేస్టు, బ్రష్ కలిపి ఒక ప్యాకేజీగా ఇవ్వటం. నిజానికి ఇవన్నీ విడివిడిగా కూడా అమ్మవచ్చు. మిక్స్‌డ్ సరఫరాలో ఏ సరఫరాకు ఎక్కువ పన్ను రేటు ఉంటే అది మొత్తం బిల్లు మీద వర్తిస్తుంది. ఇక్కడ బకెట్, వాషింగ్ పౌడర్‌లో లేదా పేస్టు, బ్రష్‌లలో దేనికి ఎక్కువ పన్ను రేటు ఉంటే అది మొత్తం బిల్లు మీద వర్తిస్తుంది.

ఈ విధంగా చూస్తే డిసెంబరు 31 ఈవెంట్ టికెట్‌లో ఈవెంట్ ప్రవేశం, ఆహార, పానీయాలు కలిపి ఉన్నా ప్రధాన సరఫరా ఈవెంట్ ప్రవేశం. అంటే ఇది కాంపోజిట్ సరఫరా. కాబట్టి ప్రధాన సరఫరా అయిన ఈవెంట్ టికెట్ మీద వర్తించే జీఎస్‌టీ అంటే 18 శాతం మొత్తం టికెట్ విలువ మీద చెల్లించాలి. అలాగే వసతి, రెస్టారెంట్, అమ్యూజ్‌మెంట్ పార్క్ సందర్శన, ఈవెంట్ ప్రవేశం ఇలా అన్ని కలిపి ఉన్నప్పుడు ప్రధాన సరఫరా ఏది ఉందో చూడాలి. ప్రధాన సరఫరా లేకుండా అవన్నీ విడివిడి సరఫరాలుగా భావించినప్పుడు వీటన్నిటిలో ఎక్కువ పన్ను రేటు దేనికి ఉందో అది మొత్తం బిల్లు మీద చెల్లించాలి. అలా చూసినా 18 శాతం అనేది వీటన్నిటిలో అత్యధిక పన్ను రేటు కాబట్టి మొత్తం రుసుము మీద 18 శాతం చెల్లించాలి.

కాబట్టి ఇలా రెండు లేదా అంతకంటే ఎక్కువ సరఫరాలు ఉన్నప్పుడు అది కాంపోజిట్ సరఫరా కిందికి వస్తుందో లేదా మిక్స్‌డ్ సరఫరా కిందికి వస్తుందో చూసుకుని అందుకుతగ్గట్టుగా జీఎస్‌టీ చెల్లించాలి.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.



గంటన్నర ఆటే..

నేటి ఉదయం 5.20 నుంచే మ్యాచ్

తొలి రోజు వరుణుడి ఆటంకం
ఆసీస్ మొదటి ఇన్నింగ్స్ 28/0
భారత్‌తో మూడో టెస్టు

బ్రిస్బేన్: గాబాలో తొలి రోజే వరుణుడు గట్టి షాక్ ఇచ్చాడు. ఎడతెరిపిలేని వర్షం కారణంగా శనివారం భారత్-ఆస్ట్రేలియాల మధ్య ఆరంభమైన మూడో టెస్టు కేవలం గంటన్నర మాత్రమే సాగింది. టాస్ గెలిచిన భారత్ ఫీల్డింగ్ ఎంచుకోగా.. ఆసీస్ ఇన్నింగ్స్ ఆరో ఓవర్‌లోనే చిరుజల్లులు కురిశాయి. దీంతో అర్ధగంట మ్యాచ్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ సమయంలో ఆటు ఆసీస్ ఓపెనర్లు ఖవాజా (19 బ్యాటింగ్), మెక్‌స్వీనే (4 బ్యాటింగ్) చక్కటి డిఫెన్స్‌తో భారత పేసర్లను ఎదుర్కొంటూ నిలదొక్కుకునే ప్రయత్నం చేశారు. కానీ సవ్యంగా సాగుతుందనుకున్న వేళ వరుణుడు మరోసారి దెబ్బతీశాడు. ఆట 13.2 ఓవర్ల వద్ద కురిసిన భారీ వర్షం ఈసారి ఏమాత్రం తెరిపినివ్వలేదు. ఈలోపునే ఇరు జట్లు లంచ్ బ్రేక్ కూడా తీసుకున్నాయి. ఆ తర్వాత కూడా వాతావరణంలో మార్పు కనిపించలేదు. ఆటగాళ్లంతా డ్రెస్సింగ్ రూమ్‌కే పరిమితం కాగా, ఈ సెషన్ కూడా వర్షార్పణమైంది. చివరకు ఆసీస్ కాలమానం ప్రకారం సాయంత్రం 4.15 గంటలకు ఆటను రద్దు చేస్తున్నట్టు అంపైర్లు ప్రకటించారు. ఆ సమయానికి ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టపోకుండా 28 పరుగులు చేసింది. మరోవైపు ఈ టెస్టుకు భారత జట్టులో రెండు మార్పులు చేశారు. అశ్విన్ స్థానంలో జడేజా, పేసర్ హర్షిత్ స్థానంలో ఆకాశ్ దీప్‌ను బరిలోకి దించారు. అలాగే ఓపెనర్‌గా రాహుల్‌నే కొనసాగించగా, కెప్టెన్ రోహిత్ విడిలార్డర్‌లో ఆడనున్నాడు.

స్కోరుబోర్డు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: ఖవాజా (బ్యాటింగ్) 19; మెక్‌స్వీనే (బ్యాటింగ్) 4; **ఎక్స్‌ట్రాలు:** 5; **మొత్తం: 13.2 ఓవర్లలో 28/0; బౌలింగ్:** బుమ్రా 6-3-8-0; సిరాజ్ 4-2-13-0; ఆకాశ్ దీప్ 3.2-2-2-0.

నేడు 98 ఓవర్ల ఆట

తొలి రోజు ఆట పూర్తిగా సాగకపోవడంతో ఆదివారం మ్యాచ్‌ను 98 ఓవర్లపాటు పొడిగించాలని నిర్ణయించారు. ఇందుకోసం అర్ధగంట ముందుగా ఉదయం 5.20కే మ్యాచ్ ఆరంభం కానుంది. కానీ రెండో రోజు కూడా వర్షం కురిసే అవకాశం 46 శాతం ఉంది. అలాగే రాబోయే నాలుగు రోజులు కూడా బ్రిస్బేన్‌లో ఆకాశం మేఘావృతంగానే ఉండి వరుణుడితో అంతరాయం కలగవచ్చు.

టిక్కెట్ల సొమ్ము వెనక్కి..

మూడో టెస్టు తొలి రోజు ఆట కోసం గాబాకు తరలివచ్చిన 30 వేల మంది ప్రేక్షకులు వర్షంతో నిరాశకు గురయ్యారు. దాంతో క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) మాత్రం వారికి ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. మ్యాచ్ గంటన్నరపాటు సాగినప్పటికీ వారికి తమ టిక్కెట్ల పూర్తి సొమ్మును రిఫండ్ చేయాలని నిర్ణయం తీసుకుంది. ఎందుకంటే.. సీఏ పాలసీ ప్రకారం ఒక రోజు ఆటలో 15 ఓవర్ల లోపే మ్యాచ్ ఆగితే పూర్తి టిక్కెట్ సొమ్మును రిఫండ్ చేయాల్సి ఉంటుంది. దీంతో మరో 10 బంతుల దూరంలోనే ఆట ఆగిపోవడంతో ప్రేక్షకులు లాభపడ్డారు.



సిరాజ్‌ను వదలడం లేదు..

అడిలైడ్‌లో ట్రావిస్ హెడ్‌కు సెండాఫ్ ఇచ్చిన తీరుతో పేసర్ సిరాజ్ ఆసీస్ ప్రేక్షకుల ఆగ్రహానికి గురవుతున్నాడు. వేదిక బ్రిస్బేన్‌కు మారినా అతడిని గేలి చేయడం మానడం లేదు. తొలి రోజు ఆటలో సిరాజ్ 4 ఓవర్లు వేయగా తను బంతి తీసుకున్న ప్రతిసారీ ప్రేక్షకులు పెద్దపెట్టున అరుస్తూ ఎగతాళి చేయడం కనిపించింది. అయితే ప్రేక్షకుల తీరును మాజీ కెప్టెన్ గవాస్కర్ తప్పుబట్టాడు. యాషెస్ సిరీస్‌లో మీ ఆటగాళ్ల ప్రత్యర్థి బ్యాటర్లకు ఇలాగే సెండాఫ్ ఇస్తే సంతోషపడరా? అని ప్రశ్నించాడు. పేసర్లకు ఇలాంటి భావోద్వేగాలు సహజమేనని చెప్పాడు.

ఫైనల్లో భారత్ X చైనా

జూనియర్ ఆసియా కప్ హాకీ

మస్కట్: డిఫెండింగ్ చాంపియన్ భారత మహిళల జట్టు జూనియర్ ఆసియా కప్ హాకీ టోర్నమెంట్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఆదివారం రాత్రి 8.30 గంటలకు జరిగే ఫైనల్లో భారత జట్టు చైనాతో తలపడనుంది. శనివారం ఇక్కడ జరిగిన సెమీఫైనల్లో భారత్ 4-1తో జపాన్‌పై గెలిచింది. టీమిండియా తరపున ముంతాజ్ ఖాన్ (4వ నిమిషంలో), సాక్షి రాణా (5వ), దీపిక (13వ) తలో గోల్ కొట్టారు. మరో సెమీస్‌లో చైనా 4-1 గోల్స్‌తో కొరియాను ఓడించింది.

గుకేష్‌కు మస్క్ అభినందన



న్యూఢిల్లీ: ప్రపంచ చెస్ చాంపియన్‌గా నిలిచిన భారత గ్రాండ్‌మాస్టర్ గుకేష్‌ను స్పేస్ ఎక్స్ సీఈవో ఎలాన్ మస్క్ అభినందించాడు. '18వ ఏట 18వ వరల్డ్ చాంపియన్. అతి చిన్న వయస్సులో అద్భుత విజయం అందుకున్నావు. అభినందనలు' అని ఎక్స్‌లో.. ఆ సంస్థ యజమాని మస్క్ పోస్ట్ చేశాడు.



రా. 7నుంచి స్పోర్ట్స్ 18లో

హర్మన్

హర్మన్ సారథ్యానికి మరో సవాల్

వెస్టిండీస్‌తో నేడు తొలి టీ20

నవీ ముంబై: తన నాయకత్వ పటిమపై ఇప్పటికే విమర్శలు వెల్లువెత్తుతుండడంతో తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్న కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ మరో కఠిన పరీక్షకు సిద్ధమైంది. ఆస్ట్రేలియా పర్యటనలో ఆడిన మూడు వన్డేల సిరీస్‌ను 0-3తో కోల్పోయి డీలాపడిన మన అమ్మాయిలు వెస్టిండీస్‌తో టీ20 సిరీస్‌కు సిద్ధమయ్యారు. మూడు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లోని మొదటి మ్యాచ్ ఆదివారం జరగనుంది. అయితే 2019 నవంబరు నుంచి ఇప్పటివరకు వెస్టిండీస్‌తో తలపడిన ఎనిమిది టీ20ల్లోనూ భారత జట్టే గెలుపొందడం సానుకూలాంశం. ప్రత్యర్థిపై ఈ విజయ పరంపరను కొనసాగించాలంటే మాత్రం హర్మన్‌సేన తీవ్రంగా శ్రమించాల్సి ఉంటుంది. ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్‌కు జట్టును ఎంపిక చేసిన తీరు హర్మన్ సారథ్యంపైనా సందేహాలను లేవనెత్తింది. ఈనేపథ్యంలో స్మృతీ మంధానాకు కెప్టెన్సీ ఇవ్వాలన్న డిమాండ్ వినిపిస్తోంది. హర్మన్‌ప్రీత్ బ్యాటింగ్ జట్టులోని మిగిలిన క్రికెటర్ల కంటే మెరుగ్గానే ఉన్నా..తెల్లబంతుల ఫార్మాట్‌లో ఆమె ఇంకా పాత పద్ధతుల్లోనే జట్టును నడిపించడాన్ని ఆక్షేపిస్తున్నారు. ఇక..స్వదేశంలో టీ20లలో షఫాలీకి మెరుగైన బ్యాటింగ్ రికార్డు ఉన్నా విండీస్‌తో సిరీస్‌కు ఆమెను పక్కనబెట్టారు. ఇది బ్యాటింగ్ విభాగంపై ప్రభావం చూపే అవకాశముంది. షఫాలీతోపాటు పూజా వస్త్రాకర్, శ్రేయాంక పాటిల్, యాస్తికా భాటియా, ప్రియా పూనియా వంటి స్టార్లు లేకుండా బరిలో దిగుతున్న భారత్ ఏమాత్రం రాణిస్తుందో చూడాలి. అలాగే ఆసీస్‌తో వన్డే సిరీస్‌లో..ఈ ఫార్మాట్‌లో రెండో అత్యుత్తమ ప్రదర్శన కనబరచిన (10-2-26-4) భారత బౌలర్‌గా రికార్డు నెలకొల్పిన హైదరాబాద్ పేసర్ అరుంధతి రెడ్డిని వెస్టిండీస్‌తో టీ20లకు పక్కనబెట్టడం గమనార్హం.



నా పెళ్లికి రండి

సీఎంకు సింధు ఆహ్వానం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22న జరగనున్న తన వివాహానికి హాజరై దీవెనలు అందించాల్సిందిగా సీఎం రేవంత్‌రెడ్డిని బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు ఆహ్వానించింది. శనివారం నాడు సీఎంను ఆయన నివాసంలో కలిసిన సింధు.. ఈ మేరకు వివాహ ఆహ్వాన పత్రాన్ని అందించింది. సింధుతోపాటు ఆమె తల్లిదండ్రులు వెంకటరమణ, విజయ ఉన్నారు.

నేడు డబ్ల్యూపీఎల్ మినీ వేలం

బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్-2025 మినీ వేలానికి సర్వం సిద్ధమైంది. ఆదివారం ఇక్కడ జరిగే వేలంలో 120 మంది క్రికెటర్లు బరిలో నిలిచారు. ఇందులో 91 మంది భారత క్రీడాకారిణులుకాగా, 29 మంది విదేశీయులున్నారు. భారత్ నుంచి 82 మంది, విదేశాల నుంచి 8 మంది అన్‌క్యాప్డ్ క్రీడాకారిణులు అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. వాస్తవంగా 400 మంది క్రికెటర్లు వేలానికి తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ఆ జాబితాను 120 మందికి బీసీసీఐ కుదించింది. అయితే ఐదు జట్లలో కలిపి మొత్తం 19 స్థానాల భర్తీకే అవకాశముంది.

ఘనంగా సింధు నిశ్చితార్థం

హైదరాబాద్: బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు నిశ్చితార్థం శనివారం జరిగింది. కాబోయే వధూవరులు సింధు, వెంకట దత్త సాయి ఈ వేడుకలో ఉంగరాలను మార్చుకున్నారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన ఫొటోను సింధు సోషల్ మీడియాలో పంచుకుంది. పోసిడెక్స్ టెక్నాలజీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకట దత్తసాయిని సింధు ఈనెల 22న వివాహమాడనుంది. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ఈ జంట ఒక్కటి కానుంది. ఈనెల 24న హైదరాబాద్‌లో రిసెప్షన్ జరగనుంది. 20న పెళ్లి వేడుకలు మొదలు కానున్నట్టు సింధు కుటుంబసభ్యులు వెల్లడించారు.



57 ఏళ్ల తర్వాత..

హైదరాబాద్‌లో మొదలైన సంతోష్ ట్రోఫీ పోటీలు

హైదరాబాద్: ఎన్నాళ్లకెన్నాళ్లకు.. ఏకంగా 57 ఏళ్ల తర్వాత తొలిసారిగా హైదరాబాద్‌లో సంతోష్ ట్రోఫీ.. అవును సుదీర్ఘ విరామానంతరం ఈ ప్రతిష్ఠాత్మక ఫుట్‌బాల్ టోర్నీకి నగరం వేదికగా నిలిచింది. అజీజ్ నగర్‌లోని శ్రీనిధి ఫుట్‌బాల్ క్లబ్‌లో శనివారం ఈ పోటీలు మొదలయ్యాయి. ప్రారంభ మ్యాచ్‌లో మణిపూర్ 1-0తో సర్వీసెస్‌పై గెలిచింది. ఇక, ఆతిథ్య తెలంగాణ తన పోరును డ్రాతో ప్రారంభించింది. రాజస్థాన్‌తో మ్యాచ్‌ను 1-1తో డ్రా చేసుకుంది. కాగా, ఈనెల 29న సెమీఫైనల్స్, 31న ఫైనల్ మ్యాచ్‌లకు గచ్చిబౌలి స్టేడియం ఆతిథ్యమివ్వనుంది. తెలంగాణ క్రీడాప్రాధికార సంస్థ (శాట్) చైర్మన్ శివసేనా రెడ్డి టోర్నీని ప్రారంభించారు.



సౌథీ

న్యూజిలాండ్ 315/9

- ఇంగ్లండ్‌తో మూడో టెస్ట్

హామిల్టన్: బ్యాటర్లు రాణించడంతో ఇంగ్లండ్‌తో శనివారం ఆరంభమైన మూడో టెస్ట్‌లో న్యూజిలాండ్ మెరుగైన స్కోరు చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కివీస్ తొలి ఇన్నింగ్స్‌లో 9 వికెట్లకు 315 పరుగులు చేసింది. లాథమ్ (63), విలియమ్సన్ (44), యంగ్ (42) రాణించారు.

గేల్ సరసన సౌథీ

కెరీర్‌లో చివరి టెస్ట్ ఆడుతున్న కివీస్ పేసర్ సౌథీ టెస్ట్ క్రికెట్‌లో ఎక్కువ సిక్స్‌లు కొట్టిన వారి జాబితాలో క్రిస్ గేల్ రికార్డును సమం చేశాడు. ఈ మ్యాచ్‌లో కేవలం 10 బంతులే ఆడి 23 పరుగులు చేసిన సౌథీ అందులో 3 సిక్స్‌లు కొట్టడం విశేషం. ఓవరాల్‌గా 98 సిక్స్‌లు బాదిన సౌథీ.. అత్యధిక సిక్స్‌లు బాదిన వారి జాబితాలో గేల్‌తో సంయుక్తంగా నాలుగో స్థానంలో నిలిచాడు. స్టోక్స్ (133 సిక్స్‌లు), బ్రెండన్ మెకల్లమ్ (107), గిల్‌క్రిస్ట్ (100) టాప్-3లో ఉన్నారు.

కాళేశ్వరంపై..
18 నుంచి ఐఏఎస్‌ల విచారణ

- జాబితాలో స్మితాసబర్వాల్, రజత్‌కుమార్.. వికాస్‌రాజ్, ఎస్‌కే జోషి, సోమేశ్‌కుమార్

హైదరాబాద్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీల నిర్మాణంలో అవకతవకతలపై విచారణలో భాగంగా జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ 18 నుంచి క్రాస్ ఎగ్జామినేషన్‌ను ప్రక్రియను పునః ప్రారంభించనుంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో సంబంధం ఉన్న ఐఏఎస్, మాజీ ఐఏఎస్ అధికారులతోపాటు బ్యారేజీల నిర్మాణ సంస్థల ప్రతినిధులకు ఈ దఫా కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్‌లో ప్రశ్నించనుంది. ఇక ఈ నెల 17న జస్టిస్ పినాకి చంద్రఘోష్ హైదరాబాద్‌కు రానుండగా, మరుసటి రోజు(ఈనెల 18వ తేదీ) నుంచి విచారణ ప్రక్రియను ప్రారంభించనున్నారు. ఈ దఫా నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులుగా వ్యవహరించిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు ఎస్‌కే జోషీ, రజత్‌కుమార్, ఇన్‌చార్జి కార్యదర్శులుగా పనిచేసిన సోమేశ్‌కుమార్, వికాస్‌రాజ్, స్మితా సభర్వాల్ తదితరులను కమిషన్ క్రాస్ ఎగ్జామిన్ చేయనుంది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణ సంస్థల ప్రతినిధులను సైతం ఇదే దఫాలో ప్రశ్నించనుంది. కమిషన్ విచారణ గడువు ఈ నెలాఖరుతో ముగియనుండడంతో.. రెండునెలలు పొడిగించే సూచనలు కనిపిస్తున్నాయి.

కెమెరాల ముందు హంగామా కాదు.. గురుకులాల బిడ్డల గుండె చప్పుడు వినండి

- తెలంగాణ అస్థిత్వంపై సర్కారు కుట్ర: కేటీఆర్

హైదరాబాద్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): "బీఆర్ఎస్ చేపట్టిన గురుకులాల బాటతో ఎట్టకేలకు కాంగ్రెస్ సర్కారులో చలనం వచ్చింది. ఇప్పుడు గురుకులాలకు వెళ్తున్నారు. కెమెరాల ముందు హంగామా కాకుండా గురుకులాల బిడ్డల గుండెచప్పుడు వినండి" అని మాజీ మంత్రి కేటీఆర్ శనివారం ఎక్స్‌లో పేర్కొన్నారు. సంక్షేమ పాఠశాలలను సంక్షోభ పాఠశాలలుగా మార్చారని, సామాన్య విద్యార్థుల్లో భయాందోళనలు రేపారన్నారు. బీఆర్ఎస్ పాలనలో గురుకులాల విద్యార్థులు ఎవరెస్టు వంటి అత్యున్నత శిఖరాలను అధిరోహిస్తే ఏడాది కాంగ్రెస్ పాలనలో ఆస్పత్రి ఎక్కించారని ఎద్దేవా చేశారు. గురుకులాల్లో మొక్కుబడి సందర్శన వద్దని, ఆ విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని కోరారు. కాగా, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గంలో మంత్రి పర్యటన సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను పోలీసులు అడ్డుకోవడం సరికాదని కేటీఆర్ అన్నారు. ప్రజాపాలనలో ప్రజా ప్రతినిధులకు ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. మరోవైపు శనివారం ప్రముఖ కవి నందిని సిధారెడ్డిని ఆయన ఇంట్లో కేటీఆర్ కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కోటి నగదు పారితోషికం, ప్లాట్‌ను సిధారెడ్డి తిరస్కరించడం తెలంగాణ అస్థిత్వ పరిరక్షణలో మైలురాయిగా నిలుస్తుందన్నారు.

అంగన్వాడీలకు జీతాలివ్వరా..?: హరీశ్ రావు



హైదరాబాద్/బంజారాహిల్స్ డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు నెల ప్రారంభమై 14 రోజులు అవుతున్నా రాష్ట్రంలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు జీతాలు ఇవ్వలేదని, దీంతో వారు ఆవేదన చెందుతున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. వెంటనే అంగన్వాడీలకు జీతాలు చెల్లించాలని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఒకటో తేదీన అందరికి జీతాలు అని గప్పాలు కొట్టిన సీఎం రేవంత్ రెడ్డి.. 39,568 అంగన్వాడీల పరిస్థితి ఆయన దృష్టికి రాలేదా అని ప్రశ్నించారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులకు సకాలంలో జీతాలు అందక నరకం అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో మీరు సాధించిన ఘనత ఇదేనా అని సీఎం రేవంత్ రెడ్డిని ఆయన ప్రశ్నించారు. కాగా, గిరిజన హాస్టళ్లలో విద్యార్థులకు కలుషిత ఆహారాన్ని అందిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఇదంతా జరుగుతోందని హరీశ్ ఆరోపించారు. తాండూరు గిరిజన ఆశ్రమ పాఠశాలలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై నిమ్స్‌లో చికిత్స పొందుతున్న సరస్వతి అనే విద్యార్థినిని శనివారం ఆయన పరామర్శించారు. వైద్యులను అడిగి ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు.

కేటీఆర్‌ను అరెస్టు చేస్తే అగ్నిగుండమే: కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న మాజీ మంత్రి కేటీఆర్‌ను అరెస్టు చేస్తే తెలంగాణ అగ్నిగుండం అవుతుందని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హెచ్చరించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ సర్కారు విస్మరించడం వల్లే తాము ప్రశ్నిస్తున్నామన్నారు. అందుకే తప్పుడు కేసులు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. శనివారం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. లగచర్ల రైతులు ప్రభుత్వానికి భూములు ఇవ్వనందుకే కేసులు పెట్టి జైల్లో పెట్టిస్తున్నారన్నారు. సినీ నటుడు అల్లు అర్జున్‌పై ముఖ్యమంత్రి కక్ష కట్టారని.. కావాలనే అరెస్టు చేయించారని ఆరోపించారు.

పెట్టుబడిదారీ ప్రయోజనాల కోసమే జాతీయవాద నినాదం: చింతకింది కాశీం



మహబూబ్‌నగర్ న్యూటౌన్/పాలమూరు,డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమే రాజ్యం జాతీయవాద నినాదాన్ని దేశ ప్రజలపై బలవంతంగా రుద్దుతోందని ప్రొఫెసర్ చింతకింది కాశీం విమర్శించారు. సమూహ ప్రథమ మహాసభలు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని క్రౌన్ ఫంక్షన్ హాల్‌లో కల్లూరి భాస్కర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభలో బహుళ అస్తిత్వాలు- సాంస్కృతిక జాతీయవాద సవాళ్లపై కాశీం ప్రసంగించారు. బుర్జువా సంస్కరణల్లో భాగంగానే జాతీయ వాదాన్ని తెరపైకి తీసుకువచ్చారన్నారు. దేశంలో భిన్న కులాలు ఉన్నప్పుడు ఏకత ఎలా సాధ్యమవుతుందని ఆయన ప్రశ్నించారు. రాజ్యాంగంపై దాడి చేసే కుట్రలో భాగంగానే ఈ జాతీయత భావం తెరపైకి వచ్చిందన్నారు. కేంద్రానికి అదానీ, అంబానీ, అమెరికా ప్రయోజనాలే తప్ప దేశ ప్రయోజనాలు పట్టవని కాశీం ఆరోపించారు. సభలో ఉమ్మడి జిల్లా నుంచి వచ్చిన కవులు, కళాకారులు, లౌకికవాదులు పాల్గొన్నారు.

కథా సాహిత్యానికి మంచి రోజులు

- ప్రముఖ స్త్రీవాద రచయిత్రి ఓల్గా
- ఘనంగా ప్రారంభమైన కథాంతరంగం



ఖమ్మం సాంస్కృతికం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కథా సాహిత్యానికి మళ్లీ మంచి రోజులు వస్తున్నాయని ప్రముఖ స్త్రీవాద రచయిత్రి ఓల్గా అన్నారు. ఈస్థటిక్స్ స్పేస్ ఆధ్వర్యంలో శనివారం ఖమ్మంలో మొదలైన కథాంతరంగం సాహిత్య కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కేంద్ర సాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యుడు ప్రసేన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఓల్గా మాట్లాడారు. కవిత్వంతో పోలిస్తే కథకు ఆదరణ తగ్గిందని, కథ పని అయిపోయిందని సాహిత్యకారులు అభిప్రాయపడుతున్న దశలో యువ కథకుల కథా ప్రతిభ చూస్తుంటే కథకు పూర్వయుగం ప్రారంభమైనట్లు అనిపిస్తోందన్నారు. సండే మ్యాగజైన్లు, కథల పోటీలు, కథా సంపుటాలు, సంకలనాల్లో కొత్త కథకుల ప్రతిభ తెలుస్తోందన్నారు. కవిత్వ గుమ్మంగా ఉన్న ఖమ్మం నుంచి కథ పరిపుష్టం చేసే క్రతువును ఈస్థటిక్స్ స్పేస్ సాహిత్య సంస్థ భుజాన వేసుకోవటం అభినందనీయం అన్నారు. అంతరించి పోయే దశకు చేరిన కథ ఖమ్మం వేదికగా తిరిగి ప్రాణం పోసుకుంటుండటం సంతోషకరమని ప్రముఖ సాహితీవేత్త ఎల్ఎస్ఆర్ ప్రసాద్ అన్నారు. సాహిత్యం సమాజానికి దిక్సూచీ అని ఈస్థటిక్స్ స్పేస్ సాహిత్య సంస్థ బాధ్యుడు, కవి, విద్యావేత్త రవి మారుత్ అన్నారు. కార్యక్రమంలో కాళోజీ అవార్డు గ్రహీత డాక్టర్ సీతారాం, ప్రముఖ సాహితీవేత్త మువ్వా శ్రీనివాసరావు, ప్రముఖ కథా రచయిత, విమర్శకుడు వంశీ కృష్ణ, జాషువా సాహిత్య సంస్థ బాధ్యుడు డాక్టర్ పగిడిపల్లి వెంకటేశ్వర్లు, ప్రముఖ సాహితీవేత్త ముక్కామల చక్రధర్ తదితరులు కథాంతరంగం కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.

బహుజనుల ప్రభుత్వం

పథకాలతో బలహీనవర్గాలకే ఎక్కువ లబ్ధి.. రాష్ట్రంలో కులగణన 98% పూర్తయింది

- కురుమలు మృదు స్వభావులు
- ఎన్నికల్లో వారి ప్రాతినిధ్యం పెంచుతాం
- వరంగల్ విమానాశ్రయానికి.. కొమురయ్య పేరు పెట్టడంపై ఆలోచిస్తాం
- 'దొడ్డి కొమురయ్య కురుమ ఆత్మగౌరవ భవనం' ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్
- ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ అనుకూలం
- నియామకాల్లో మాదిగలకు ప్రాధాన్యం
- ఓయూ చరిత్రలో తొలిసారి వీసీగా చాన్స్
- 'గ్లోబల్ మాదిగ డే-2024'లో సీఎం



కోకాపేటలో దొడ్డి కొమురయ్య కురుమ భవనాన్ని ప్రారంభించి ఆయన విగ్రహానికి పూల మాల వేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం బలహీన వర్గాల, బహుజనుల ప్రభుత్వమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. వారి కోసమే పలు పథకాలను చేపట్టి అమలు చేస్తోందని చెప్పారు. రైతు రుణమాఫీలో అత్యధికంగా బలహీన వర్గాలకే న్యాయం జరిగిందని, వరి ధాన్యానికి ఇస్తున్న రూ.500 బోనస్‌తో, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్తు, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల మేర వైద్యంతో పథకాలతో బలహీన వర్గాలకే అధికంగా ప్రయోజనం చేకూరుతోందని తెలిపారు. నగర శివార్లలోని కోకాపేటలో నిర్మించిన 'దొడ్డి కొమురయ్య కురుమ ఆత్మగౌరవ' భవనాన్ని శనివారం సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బలహీన వర్గాల విద్యార్థులకు డైట్ చార్జీలు, కాస్మొటిక్ చార్జీలు పెంచడానికి గత పాలకులకు పదేళ్లుగా మనసు రాలేదని విమర్శించారు. తమ ప్రభుత్వం వచ్చాక 40 శాతం మేర డైట్ చార్జీలు, 200 శాతం మేర కాస్మొటిక్ చార్జీలను పెంచామని తెలిపారు. పిల్లలకు మంచి భోజనం, నాణ్యమైన విద్యను అందించడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. కాగా, కురుమలు నమ్మకస్తులు, "ఎవరికీ కష్టం, నష్టం కలిగించకూడదనే మృదు స్వభావం కలిగినవాళ్లు అని అన్నారు. తమ శ్రమను నమ్ముకునే వాళ్లు.. అవసరైతే ఒక గంట ఎక్కువ పని చేయాలనుకునేవాళ్లు అని తెలిపారు. అలాంటి కురుమల సామాజికవర్గం నుంచి వచ్చిన దొడ్డి కొమురయ్య గొప్ప పోరాట యోధుడు అని కొనియాడారు.

తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలి..

నిజాం సర్కారుకు, రజాకార్లకు వ్యతిరేకంగా జరిగిన సాయుధ రైతాంగ పోరాటాన్ని దొడ్డి కొమురయ్య ముందుండి నడిపారని సీఎం రేవంత్ అన్నారు. రజాకార్లను గ్రామాల్లోకి రానీయకుండా అడ్డుకట్ట వేయాలని, దొరల పెత్తనాన్ని, ఆధిపత్యాన్ని అణచడానికి దుడ్డు కర్రల సంఘాన్ని పెట్టి బడుగులు, దళితులను కాపాడారని, ఆయన జ్ఞాపకార్థం ఒక భవనాన్ని నిర్మించి, ప్రారంభించుకున్నామని పేర్కొన్నారు. రేపటి భవిష్యత్తు తరాలు గొర్రెలు, బర్రెల చుట్టూ తిరగకుండా, పీజీలు, పీహెచ్‌డీలు చదివి తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో చేపట్టిన కులగణన ఇప్పటికి 98 శాతం పూర్తయిందని, మిగిలిన రెండు శాతం కూడా పూర్తయ్యాక.. రాష్ట్రంలో కురుమ సోదరులు ఎంత మంది ఉన్నారో పక్కాగా లెక్క తేల్చి.. రాబోయే స్థానిక సంస్థలు, శాసనసభ, పార్లమెంటు ఎన్నికల్లో కురుమ సోదరుల ప్రాతినిధ్యాన్ని పెంచుతామని ప్రకటించారు. మొన్నటి శాసనసభ ఎన్నికల్లో కురుమలు, యాదవులకు చెరో రెండు సీట్లు ఇచ్చామని గుర్తు చేశారు. కురుమల్లో ఎవరికి అవకాశం వచ్చినా అందరూ కలిసికట్టుగా ఉండి గెలిపించుకుంటేనే ఉనికి, మనుగడ కొనసాగుతుందని అన్నారు. అలాగైతేనే ఏ రాజకీయ పార్టీ అయినా టికెట్ ఇస్తుందని, లేకపోతే.. కురుమలకు గెలిచే అవకాశాలు తక్కువగా ఉంటాయని, వేరేవారికి టికెట్లు మళ్లిస్తాయని తెలిపారు.

సందర్భం వచ్చినప్పుడు వినియోగించుకోవాలి..

బీర్ల ఐలయ్య విప్ అయ్యారంటే కురుమలు ఎమ్మెల్యేగా గెలిపించినందువల్లేననే విషయాన్ని గుర్తుంచుకోవాలని సీఎం అన్నారు. "పక్క రాష్ట్రం (కర్ణాటక)లో సీఎం సిద్దరామయ్య కురుమ సోదరుడు. 40, 50 ఏళ్లుగా రాజకీయాల్లో ఉండి, ఒక ముఖ్యమంత్రిగా రాణిస్తున్నాడంటే కాంగ్రెస్ పార్టీ అవకాశం ఇవ్వడం వల్లే. ఆ అవకాశాన్ని ఆయన అందిపుచ్చుకున్నారు. సందర్భం వచ్చినప్పుడు మన సంఘాన్ని గెలిపించుకోవాలంటే.. అందరూ ఏకం కావాలి" అని సీఎం సూచించారు. వరంగల్ ఎయిర్‌పోర్టుకు దొడ్డి కొమురయ్య పేరు పెట్టాలన్న ప్రతిపాదనపై సహచర మంత్రులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్, కర్నాటక మాజీ మంత్రి హెచ్ఎం రేవణ్ణ, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై వారం రోజుల్లో నివేదిక

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు కాంగ్రెస్ అనుకూలంగా ఉందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక దీనిపై కచ్చితమైన నిర్ణయం తీసుకుంటుందంటూ ఎన్నికల ముందు రాహుల్‌గాంధీ స్పష్టమైన ప్రకటన చేశారని గుర్తు చేశారు. శనివారం హైదరాబాద్‌లోని హోటల్ దసపల్లాలో జరిగిన 'గ్లోబల్ మాదిగ డే-2024' కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై గత ప్రభుత్వాలు సుప్రీంకోర్టులో సరైన వాదనలు వినిపించలేదని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న ఈ కేసులో బలమైన వాదనలు వినిపించేలా దామోదర రాజనర్సింహ నేతృత్వంలో న్యాయవాదులను నియమించామని తెలిపారు. తీర్పు రావడంలో రాష్ట్ర ప్రభుత్వం క్రియాశీల పాత్ర పోషించిందని పేర్కొన్నారు. తీర్పును తప్పకుండా అమలు చేస్తామని శాసనసభ వేదికగా ప్రకటించామని గుర్తు చేశారు. వర్గీకరణ అనేది తెలంగాణ సమస్యలాగే జటిలమైనదని, అయితే కొన్ని సందర్భాల్లో ప్రజల ఆకాంక్ష మేరకు ప్రభుత్వాలు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని సీఎం అభిప్రాయపడ్డారు. మాదిగల వాదనలో బలం ఉందని, న్యాయం చేయాలన్న ఆలోచన ప్రభుత్వానికి ఉందన్నారు. న్యాయపరమైన చిక్కులు రాకుండా అమలుపై అధ్యయనం చేసేందుకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేశామన్నారు. 60 రోజుల్లో నివేదిక ఇవ్వాలని జ్యుడీషియల్ కమిషన్‌ను నియమించామని, వారం రోజుల్లో ఈ నివేదిక వచ్చే అవకాశం ఉందని తెలిపారు. సీఎం పేషీలో మాదిగలు ఉండాలని డా.సంగీతను నియమించామన్నారు. వందేళ్ల ఉస్మానియా చరిత్రలో ఎన్నడూ వీసీగా దళితుణ్ని నియమించలేదని, కానీ.. తాము మొదటి సారి అవకాశం కల్పించామని పేర్కొన్నారు. రాజకీయ పరమైన, అధికార నియామకాలు ఏవి చేపట్టినా.. మాదిగ సామాజికవర్గం అడగకముందే వారికి కావాల్సిన దానికంటే ఒక ముద్ద ఎక్కువ పెట్టేందుకే తమ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. తన రాజకీయ ప్రస్థానంలో మాదిగ సామాజికవర్గం పాత్ర ఎంతో ఉందని, ఈ ప్రభుత్వంలో వారికి న్యాయం చేసే బాధ్యత తనదని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు.




ఫోన్ ట్యాపింగ్, లగచర్ల కేసుల్లోనూ
కేటీఆర్‌కు నోటీసులు?

ఒక దాని తర్వాత మరో కేసు ప్లాన్!

- ఫార్ములా-ఈపై వచ్చే వారమే కేసు?
- పక్కా వ్యూహంతో కదలనున్న పోలీసులు
- అల్లు అర్జున్ అరెస్టు అందరికీ ఓ ఝులక్

హైదరాబాద్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): కేటీఆర్ పేరు వినవస్తున్న అన్ని కేసుల్లోనూ త్వరలో ఆయనపై చర్యలు తీసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఫార్ములా-ఈ రేసు కేసులో కేటీఆర్‌పై ముందుకు కదలడానికి ఏసీబీకి గవర్నర్ నుంచి ఆమోదం లభించడంతో ఆయన పాత్ర ఉందని చెబుతున్న ఇతర కేసుల్లోనూ పోలీసులు తదుపరి చర్యలు ప్రారంభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కేటీఆర్ పేరు ఇప్పటి వరకు ఎఫ్ఐఆర్‌లో లేదు. కానీ, అరెస్టయిన పోలీసు అధికారి ఇచ్చిన వాంగ్మూలాల ఆధారంగా ఎప్పుడైనా కేటీఆర్ తదితరుల పేర్లు జత చేసే అవకాశం రాష్ట్ర పోలీసులకు ఉంది. అలాగే, లగచర్ల కేసులోనూ ఇప్పటికే అరెస్టయిన మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ స్థానిక నేత సురేష్ వాంగ్మూలాలు, ఫోన్ కాల్స్ వివరాలు, ఇతర సాంకేతిక ఆధారాలతో కేటీఆర్ పేరును నిందితుల జాబితాలో చేర్చే అవకాశం ఉంది. ప్రజాప్రతినిధుల అవినీతికి సంబంధించిన కేసుల్లో మాత్రమే గవర్నర్ అనుమతి అవసరం. క్రిమినల్ కేసుల్లో గవర్నర్ ముందస్తు అనుమతి పోలీసు శాఖకు అవసరం లేదు. అయినప్పటికీ ఫార్ములా ఈ కేసును ముందుంచి మిగతా కేసుల్లోనూ కేటీఆర్‌ను విచారించే అవకాశాలు కన్పిస్తున్నాయి. సోమవారం తర్వాత ఫార్ములా-ఈ కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారని, ఆ తర్వాత కేటీఆర్‌కు నోటీసులు ఇస్తారని సమాచారం. ఈ కేసులో కేటీఆర్ మీద తదుపరి చర్యలు తీసుకున్న తర్వాత మిగతా కేసుల్లో నోటీసుల పరంపర మొదలవుతుందని అంటున్నారు. పక్కాగా సాక్ష్యాధారాలు సేకరించిన తర్వాతే నిందితుల్లో కేటీఆర్‌ను చేర్చే విషయంలో ముందుకు వెళ్లాలని పోలీసు ఉన్నతాధికారులు భావిస్తున్నట్లు సమాచారం. సంధ్య థియేటర్‌లో జరిగిన తొక్కిసలాటకు సంబంధించి హీరో అల్లు అర్జున్‌ను అరెస్టు చేయడం ద్వారా వివిధ కేసుల్లో వాంటెడ్ లిస్టులో ఉన్న వారందరికీ ప్రభుత్వం ఒక ఝులక్ ఇచ్చినట్లయ్యిందని మాజీ పోలీసు అధికారులు అభిప్రాయపడుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సైతం అల్లు అర్జున్ అరెస్టు తర్వాత జాతీయ మీడియాతో మాట్లాడిన మాటలను గమనిస్తే, చట్టం తన పని తాను చేసుకుని పోతుందన్న వ్యాఖ్యల వెనుక అనేక అర్థాలున్నాయని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతుంది.



ఎన్టీఆర్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఏపీ సీఎం చంద్రబాబు

ఎన్టీఆర్ యుగపురుషుడు

భారతరత్న అవార్డు ఇవ్వాలి

- అప్పటి వరకు పోరాటం చేస్తాం
- ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ సభలో చంద్రబాబు

విజయవాడ, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): 'సినీ రంగాన్ని, రాజకీయ రంగాన్ని ఏలిన నిజమైన యుగపురుషుడు ఎన్టీఆర్. ఆయనకు భారతరత్న ఇచ్చి తీరాల్సిందే. అప్పటి వరకు పోరాటం సాగిస్తాం. ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటిస్తే ఆ గౌరవం తెలుగుజాతికే కాదు, దేశానికి దక్కుతుంది' అని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. శనివారం రాత్రి కృష్ణా జిల్లా పెనమలూరు మండలం పోరంకిలోని ప్రైవేటు రిసార్ట్‌లో ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ సభ నిర్వహించారు. తొలుత ఎన్టీఆర్‌పై రూపొందించిన 'తారకరామం' పుస్తకాన్ని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. అనంతరం ఎన్టీఆర్ సినీ ప్రస్థానం పుస్తకాన్ని చంద్రబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యుగపురుషులను సమాజం ఎప్పటికీ మరవదన్నారు. దీనికి ఎన్టీఆర్ నిదర్శనమన్నారు. 'ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా తెలుగువారంటే ఎన్టీఆర్ గుర్తుకొస్తారు. సాధారణ రైతు కుటుంబంలో జన్మించి తెలుగువారి ఆత్మగౌరవం, అచ్చ తెలుగుదనంగా మారారు. పార్టీని స్థాపించిన తొమ్మిది నెలల్లో సీఎం కావడం ఒక చరిత్ర. 1945లో మద్రాసుకు రైలు ఎక్కాక ఆయన జైత్రయాత్ర ఆగలేదు. సినీ పరిశ్రమలో ముందుగా జీతానికి ఉద్యోగంలో చేరి తర్వాత వెండితెరను ఏలారు. వైవిధ్యమైన పాత్రలను పోషించారు. శ్రీకృష్ణుడు, వేంకటేశ్వరస్వామి పాత్రలను పోషించాల్సి వచ్చినప్పుడు మాంసాహారం తీసుకునేవారు కాదు. నేలపైనే నిద్రించేవారు. తనను ఆదరించిన ప్రేక్షకుల కోసం ఆయన శేషజీవితాన్ని అంకితం చేశారు. తొమ్మిది నెలల పాటు చైతన్యరథంపై రాష్ట్రమంతా పర్యటించారు. చివరికి పిల్లల పెళ్లిళ్లకు కూడా వెళ్లకుండా ప్రజల మధ్య ఉన్నారు. ఆయన సీఎంగా పాలనకు కొత్త అర్థాన్ని ఇచ్చారు. రాజకీయంగా మహిళలకు రిజర్వేషన్లు కల్పించారు. ఢిల్లీని గజగజలాడించి నేషనల్ ఫ్రంట్‌ను అధికారంలోకి తీసుకొచ్చారు. సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అన్న నినాదాన్ని తీసుకొచ్చారు. క్యాపిటలిజం, కమ్యూనిజం.. మీది ఏ ఇజం అన్న విలేకరుల ప్రశ్నకు మరో ఆలోచన లేకుండా హ్యూమనిజం అని సమాధానం ఇచ్చారు. సమాజంలో ఆర్థిక అసమానతలను తొలగించడానికి ఎన్టీఆర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి. తెలుగుజాతి ఉన్నంత వరకు తెలుగుదేశం పార్టీ ఉంటుంది' అని చంద్రబాబు అన్నారు.

అమ్మో పులి..!



వరుస దాడులతో అటవీ సమీప గ్రామాల ప్రజలు హడల్

- మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణ వైపు పెద్దపులులు
- జాడ గుర్తించేందుకు డ్రోన్లు.. రంగంలోకి ప్రత్యేక బృందాలు

హైదరాబాద్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంత శివారు గ్రామాల ప్రజలు భయంతో వణికిపోతున్నారు. పెద్దపులులు, చిరుతలు దాడి చేస్తుండటంతో ఎప్పుడేం జరుగుతోందోనని ఆందోళన చెందుతున్నారు. ఆదిలాబాద్, ములుగు జిల్లాల్లో వరుసగా వెలుగు చూస్తున్న పులి దాడులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతాల నుంచి పులులు, చిరుతలు ఇతర అడవి జంతువులు తెలంగాణ అటవీ ప్రాంతాల్లోకి వస్తున్నాయి. మహారాష్ట్రలోని తిప్పేశ్వర్, తాడోబా అభయారణ్యం నుంచి పెద్ద పులులు తెలంగాణవైపునకు వస్తున్నాయి. నవంబరు నుంచి ఫిబ్రవరి వరకు జత కట్టే సమయం కావడంతో తెలంగాణ వైపు పెద్ద పులుల రాక ఇటీవల కాలంలో మరింతగా పెరిగింది. ఈ క్రమంలోనే అవి పశువులు, మనుషులపై దాడులకు పాల్పడుతున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రోజుల వ్యవధిలోనే పులి దాడులు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. గత నెలలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పులి దాడిలో ఓ మహిళ మృతి చెందింది. ఆసిఫాబాద్ జిల్లాలో లక్ష్మి అనే మహిళపై పెద్ద పులి దాడి చేసి ప్రాణాలు తీసింది. ఆ తర్వాత కొద్ది గంటల్లోనే దుబ్బగూడెంలో పొలం పనుల్లో ఉన్న రైతు సురేశ్‌పై పులి దాడి చేసి గాయపరిచింది. కొద్ది రోజుల క్రితం తిప్పేశ్వర్ అభయారణ్యం నుంచి వచ్చిన పెద్దపులి నిర్మల్ జిల్లాలో అలజడి సృష్టించింది. బోథ్ మీదుగా సారంగపూర్ అటవీ ప్రాంతంలోకి వచ్చింది. సమీప ప్రాంతాల్లో సంచరించి తిరిగి మహారాష్ట్ర వైపు వెళ్లినట్లు అటవీ శాఖ అధికారులు గుర్తించారు. బోథ్ మండలంలోనూ చిరుత సంచారం హడలెత్తిస్తోంది. మేకల మందపై చిరుత దాడి చేసింది. తాజాగా ఆదిలాబాద్ జిల్లాలోని డెడ్రా గ్రామంలో చిరుత పులి మహిళపై దాడి చేసింది. కొద్ది రోజుల క్రితం ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతం నుంచి వచ్చిన పులి ములుగు జిల్లా అటవీ ప్రాంతంలో సంచరించింది. గతంలోనూ పులులు, చిరుతల దాడుల్లో పలువురు అటవీ సమీప ఆవాస ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. పులులు, చిరుతలు, ఇతర అడవి జంతువుల దాడుల్లో తరచూ ప్రజలు ప్రాణాలు కోల్పోతుండటం, తీవ్రంగా గాయపడ్డంతోపాటు పశువుల మందలపైనా దాడులు చేసి నోటకరుచుకుని వెళ్తున్నాయి.

జాగ్రత్తలు చేపట్టిన అటవీ శాఖ

అటవీ సమీప ప్రాంతాల్లో వణ్య ప్రాణుల దాడులుపెరిగిన నేపథ్యంలో అటవీ శాఖ అధికారులు జాగ్రత్త చర్యలు చేపట్టారు. పులి జాడలు గుర్తించేందుకు ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు డ్రోన్‌లను ఉపయోగిస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లాకు ఇటీవలే హైదరాబాద్ అటవీ శాఖ ప్రధాన కార్యాలయం నుంచి అత్యాధునిక థర్మల్ డ్రోన్‌లను తరలించారు. పగలు, రాత్రి వేళల్లోనూ డ్రోన్లను ఉపయోగించి పులి జాడ తెలుసుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. అవసరమైన ప్రాంతాల్లో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడ్డారు. జత కోసం తిరుగుతున్న పులి బారినపడకుండా ఉండేందుకు కొంత కాలం పాటు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే ప్రజలు పొలం పనులకు వెళ్లాలని సూచిస్తున్నారు. విజిల్స్, మాస్కులు అందిస్తున్నారు. ఒంటరిగా కాకుండా గుంపులు గుంపులుగా తిరగాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు.

మహిళపై చిరుత దాడి

- ఆదిలాబాద్ జిల్లా డేడ్రా గ్రామంలో ఘటన
- తలకు గాయం.. రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స

బజార్‌హత్నూర్, డిసెంబరు14 (ఆంధ్రజ్యోతి): బహిర్భూమి కోసం గ్రామ శివార్లోకి వెళ్లిన మహిళపై చిరుత పులి దాడి చేసింది. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం డెడ్రా గ్రామంలో జరిగింది. బాధితురాలు అదే గ్రామానికి చెందిన అరక భూంబాయి. ఆమె వ్యవసాయ కూలీ. శనివారం ఉదయం గ్రామ శివారులోకి వెళ్లగా.. ఒక్కసారిగా చిరుత మీద పడింది. ఆమెకు తల భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. భూంబాయి గట్టిగా కేకలు వేయడంతో చిరుత సమీపంలోని అడవుల్లోకి వెళ్లిపోయింది. మహిళ అరుపులు విని వెంటనే అక్కడికి చేరుకున్న డెడ్రా గ్రామస్థులు.. బాధితురాలిని బజార్‌హత్నూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం ఆమె కోలుకుంటోందని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు తెలిపారు. మహిళపై చిరుత దాడి విషయం తెలుసుకున్న డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్ తన సిబ్బందితో కలిసి వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. డెడ్రా గ్రామస్థులతో పాటు సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పలు సూచనలు చేశారు. కాగా, మహిళపై చిరుత పులి దాడి చేసి గాయపర్చిన ఘటనపై మంత్రి కొండా సురేఖ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చిరుత దాడి నేపథ్యంలో డెడ్రా గ్రామ ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని అటవీ శాఖ అధికారులను ఆమె ఆదేశించారు. చిరుత కదలికపై నిరంతరం నిఘా పెంట్టాలని, అవసరమైన టెక్నాలజీని ఉపయోగించుకోవాలని సీపీ పీఎఫ్ డోబ్రియాల్‌కు సూచించారు. బాధితురాలికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని ఆదేశించారు.

రేవంత్ రూపొందించింది కాంగ్రెస్ మాతను: కల్వకుంట్ల కవిత

- తెలంగాణ అస్తిత్వంపై దాడి అంశంపై ప్రెస్‌క్లబ్‌లో చర్చ



హైదరాబాద్ సిటీ, డిసెంబరు14 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ తల్లి రూపురేఖలు మార్చి, అవహేళన చేస్తున్నారని తెలంగాణ జాగృతి సంస్థ వ్యవస్థాపకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చెప్పారు. శనివారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో "తెలంగాణ అస్తిత్వంపై దాడి" అంశంపై ఆమె రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. తెలంగాణ తల్లి పేరుతో రేవంత్ ఏర్పాటుచేసిన రూపాన్ని కాంగ్రెస్ మాతగా నామకరణం చేద్దామని కవిత తీర్మానించారు. బతుకమ్మను తెలంగాణ తల్లి చేతిలో నుంచి తీసేయడం తెలంగాణ సంస్కృతిపై దాడేనని, దీన్ని తెలంగాణ సమాజమంతా వ్యతిరేకించాలని కవిత పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పాలకులు తెలంగాణ తల్లి రూపురేఖలు మార్చి ప్రజలందరినీ అవమానించారని కేవీ రమణాచారి ఆరోపించారు. తెలంగాణ తల్లి రూపురేఖలు మార్చడాన్ని చరిత్ర హర్షించదని ప్రత్యేక తెలంగాణ ఉద్యమకారిణి తిరునగరి దేవకీదేవి చెప్పారు. ఉద్యమకాలం నాటి తెలంగాణ తల్లి విగ్రహాలను తాకితే జనం చూస్తూ ఊరుకోరని, తిరగబడతారని తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్ హెచ్చరించారు. తెలంగాణ తల్లి రూపాన్ని మార్చడమంటే శిల్పిగా తనను చంపేసినట్టేనని తెలంగాణ తల్లి రూపశిల్పి బీవీఆర్ చారి చెప్పారు. కార్యక్రమానికి తెలంగాణ గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అయాచితం శ్రీధర్ సభాధ్యక్షత వహించగా, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, సురభి వాణీదేవి, మాజీ ఎమ్మెల్సీ దేవీప్రసాద్, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్, దళిత స్త్రీవాద రచయిత్రి గోగు శ్యామల, విశ్లేషకుడు వి. ప్రకాష్, ఆచార్య కె. సీతారామారావు, సీనియర్ జర్నలిస్టులు టంకశాల అశోక్,వేణుగోపాల స్వామి, జమాతే ఇస్లామీ ప్రతినిధి హమీద్ ముహమ్మద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.


బోనకల్ గురుకుల పాఠశాలలో భోజనం చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి


మహ్మదాపురం పాఠశాలలో మంత్రి పొంగులేటి


గండుగులపల్లిలోని ఏకలవ్య గురుకుల పాఠశాలలో విద్యార్థులతో కలిసి అల్పాహారం చేస్తున్న మంత్రి తుమ్మల

బడి.. పెట్టుబడి

ఇది ఖర్చు కాదు.. భవిష్యత్తు తరాల నిర్మాణం

బహుముఖ ప్రతిభకు కేంద్రాలుగా.. గురుకులాలు!

విద్యాశాఖను నేనే చూస్తున్నా.. గాడిలో పెడతా..

రూ.21 వేల కోట్లు ఇచ్చాం.. మరింత పెంచుతాం

చిల్కూరు సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో

కామన్ డైట్ ప్లాన్ ప్రారంభంలో సీఎం రేవంత్

ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ పార్టీ అనుకూలం

వారంలో జ్యుడీషియల్ కమిషన్ నివేదిక: రేవంత్



చిలుకూరులో కామన్ డైట్ ప్లాన్‌ను ప్రారంభించి, విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న సీఎం రేవంత్

రంగారెడ్డి అర్బన్/మొయినాబాద్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న గురుకుల పాఠశాలలను బహుముఖ ప్రతిభకు కేంద్రాలుగా తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. విద్యార్థుల కోసం చేస్తున్న ఖర్చును భవిష్యత్తు తరాల నిర్మాణానికి పెడుతున్న పెట్టుబడిగా భావిస్తున్నామన్నారు. ఈ పెట్టుబడి తెలంగాణను బలోపేతం చేస్తుందని, అభివృద్ధి వైపు నడిపిస్తుందని, రాష్ట్ర ప్రతిష్ఠను నిలబెడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి శనివారం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం చిల్కూరులోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో కామన్ డైట్ ప్లాన్‌ను (ఉమ్మడి ఆహార ప్రణాళిక)ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యాశాఖకు రూ.21 వేల కోట్లు కేటాయించామని, భవిష్యత్‌లో ఇంకా నిధులు పెంచుతామన్నారు. విద్యాశాఖను గాడిలో పెట్టేందుకు ఆ శాఖను తానే స్వయంగా చూస్తున్నానని తెలిపారు. 'రానున్న రోజుల్లో నేను ఎక్కడికెళ్లినా రెసిడెన్షియల్ స్కూల్స్‌ను సందర్శిస్తా. పిల్లలతో మాట్లాడుతా. భోజనాన్ని పరిశీలిస్తా. ఎవరైనా తప్పిదాలకు పాల్పడితే వారిపై కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. గురుకులాల విద్యార్థులు అనాథలు కాదు.. వాళ్లు రాష్ట్ర సంపద. వారికి నాణ్యమైన విద్యతో పాటు మౌలిక వసతులు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉంది' అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. విద్యార్థులతో మెస్ మేనేజ్‌మెంట్ కమిటీలను ఏర్పాటు చేయాలని, వారు తినే ఆహారాన్ని వాళ్లే పర్యవేక్షించే వీలు కల్పించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. 1971లో ఉమ్మడి రాష్ట్రంలో పీవీ నరసింహారావు మొట్టమొదటిసారి రెసిడెన్షియల్ స్కూళ్లను ప్రారంభించినట్లు సీఎం రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. రెసిడెన్షియల్ స్కూళ్లలో చదువుకున్న వాళ్లు ఎంతోమంది గొప్పగా రాణించారని.. ఐఏఎస్, ఐపీఎస్‌లుగా ఎంపికయ్యారని.. బుర్రా వెంకటేశం ఐఏఎస్, మహేందర్ రెడ్డి ఐపీఎస్.. రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులే అని చెప్పారు. విద్యావ్యవస్థను సమూల ప్రక్షాళన చేసి, విద్యా ప్రమాణాలు పెంచాలన్న దృఢ సంకల్పంతో ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. పెరిగిన ధరలు, విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని డైట్ చార్జీలను 40 శాతం, కాస్మోటిక్ చార్జీలను 200 శాతం పెంచుతున్నామని.. దేశ చరిత్రలో ఒకేసారి ఇంత మొత్తం పెంచడం ఎక్కడా జరగలేదని రేవంత్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత కరెంట్ ఇచ్చేందుకు ఆదేశాలు జారీ చేస్తున్నట్లు సీఎం తెలిపారు.

ప్రభుత్వ టీచర్లకంటే ఎక్కువ అర్హతలున్నాయా?

రాష్ట్రంలోని 26 వేల ప్రభుత్వ పాఠశాలల్లో 23 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటుండగా, 11 వేల ప్రైవేటు స్కూళ్లలో 33 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ప్రైవేట్ స్కూల్స్‌లో చదువు చెప్పే వారికి ప్రభుత్వ ఉపాధ్యాయుల కంటే ఎక్కువ అర్హతలున్నాయా అని ప్రశ్నించారు. బహుముఖ ప్రజ్ఞాశాలులుగా విద్యార్థులను మనం ఎందుకు తయారు చేయలేకపోతున్నాం? ఈ దిశగా మనం ఎందుకు ఆలోచించొద్దు? ఇది మన బాధ్యత కాదా? అని ప్రశ్నించారు. పిల్లలు మట్టిలో మాణిక్యాలని.. వారిలో ఉన్న బహుముఖ ప్రజ్ఞను గుర్తించాలని సూచించారు.

ఆత్మపరిశీలన అవసరం

'ఆర్థిక ఇబ్బందుల వల్ల తల్లితండ్రులు తమ పిల్లలను హాస్టళ్లలో చేర్పిస్తున్నారు. మనల్ని నమ్మి వారి పిల్లలను ఇక్కడకు పంపిస్తున్నారు. విద్యార్థుల మృతిపై మనం ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఫుడ్ పాయిజన్ జరిగి ఈ మధ్య ఒక బాలిక మరణించింది. ఆ బాలిక తల్లిదండ్రులు ఎంత బాధపడి ఉంటారు? శ్రీమంతుడైనా, పేదవాడైనా కన్నబిడ్డలను ఒకే విధంగా ప్రేమిస్తారు. మనల్ని నమ్మి వాళ్లు హాస్టళ్లకు పంపితే.. మనం ఎంత బాధ్యతగా ఉండాలో ఒక్కసారి ఆలోచన చేయాలి. ఇది మన గౌరవ ప్రతిష్ఠలను పెంచేదా? తగ్గించేదా? ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది' అని సీఎం రేవంత్ అధికారులకు, ఉపాధ్యాయులకు హితవు పలికారు. నైపుణ్యం లేకపోవడం వల్లే నిరుద్యోగ సమస్య పెరుగుతోందని సీఎం పేర్కొన్నారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా నిరుద్యోగులకు నైపుణ్యాలను అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. మహేశ్వరంలో 60 ఎకరాల్లో యంగ్ ఇండియా స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించి తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములను చేయాలని ప్రభుత్వం కృషి చేస్తోందని సీఎం వెల్లడించారు. ఇంజనీరింగ్ కోర్సు నాలుగేళ్లు కాగా రెండేళ్లు థియరీ, రెండేళ్లు శిక్షణ ఉండేలా సిలబస్‌ను మార్చటంపై ప్రభుత్వం కసరత్తు చేస్తుందని తెలిపారు. విద్యార్థుల యూనిఫామ్ కుట్టు పని రాష్ట్రంలోని మహిళా సంఘాలకు అప్పగించామన్నారు. కుట్టు పనికి ఇచ్చే రుసుం రూ.25 నుంచి రూ.75కు పెంచి వారికి అప్పగించామని తెలియజేశారు.

మీలో టాలెంట్‌కు సాన పెట్టండి

2028 ఒలింపిక్స్ లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటు చేయబోతున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. క్రీడల్లో రాణించిన వారిని ప్రోత్సహించే ఉద్దేశంతో నిఖత్ జరీన్, సిరాజ్ లాంటి వారికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామన్నారు. 'క్రీడల్లో రాణించండి.. మీలో టాలెంట్‌కు సానపెట్టండి' అని విద్యార్థులకు పిలుపునిచ్చారు. విద్యార్థులలో ఉన్న నైపుణ్యాలను ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. వారికి కావాల్సిన శిక్షణ అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు. కార్పొరేట్‌కు ధీటుగా ప్రతీ నియోజకవర్గంలో 25 ఎకరాల విస్తీర్ణంలో రూ.120 కోట్ల పెట్టుబడితో 2 వేల మంది విద్యార్థులు చదువుకునేలా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.


హైదరాబాద్‌లోని మహేంద్రహిల్స్‌లోని గురుకులంలో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

వివిధ జిల్లాల్లో పాల్గొన్న మంత్రులు

తెలంగాణ ప్రజాపాలన ఉత్సవాల్లో భాగంగా శనివారం 'గురుకుల బడి-అమ్మఒడి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు సర్కారు బడుల బాట పట్టారు. ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని తనిఖీ చేశారు. అనంతరం కొత్త మెనూను ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వికారాబాద్ జిల్లా ఎన్నపల్లి చౌరస్తాలోని మైనారిటీ పాఠశాల, జూనియర్ కళాశాల (బాలికల)లో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ విద్యార్థులకు నూతన డైట్‌ను ప్రారంభించారు. ఖమ్మం జిల్లా బోనకల్ మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల బాలుర పాఠశాలలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కామన్ డైట్ మెనూ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం మహ్మదాపురం గిరిజన గురుకుల పాఠశాలలో, వరంగల్ జిల్లా మరిపెడలో సోషల్ వెల్ఫేర్ గురుకుల స్కూళ్లో కామన్‌డైట్ ప్రోగ్రాంను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. హైదరాబాద్‌లోని మహేంద్రహిల్స్‌లోని గురుకులంలో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, షేక్‌పేట్ గురుకులంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కామన్ డైట్ మెనూను ప్రారంభించారు. నాగర్‌కర్నూలు జిల్లా కొల్లాపూర్‌లోని గురుకుల బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలలో మంత్రి జూపల్లి కృష్ణారావు కామన్‌డైట్ మెనూను ప్రారంభించారు.


హైదరాబాద్‌లోని షేక్‌పేట్ గురుకులంలో మంత్రి పొన్నం ప్రభాకర్


నాగర్‌కర్నూలు జిల్లా కొల్లాపూర్‌లోని గురుకుల బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలలో మంత్రి జూపల్లి కృష్ణారావు


హైదరాబాద్‌లోని షేక్‌పేట్ గురుకులంలో మంత్రి సీతక్క

ద్వితీయ శ్రేణి పట్టణాల్లోనూ.. ఐటీ పరిశ్రమలు నెలకొల్పండి!

- గ్రామాల్లో ప్రతిభావంతులకు కొదవలేదు
- త్వరలో రాష్ట్రవ్యాప్తంగా టీఫైబర్ నెట్‌వర్క్
- ఐటీ కంపెనీలు సద్వినియోగం చేసుకోవాలి
- టెక్‌వేవ్ గ్లోబల్ సెంటర్ ప్రారంభోత్సవంలో ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లోనూ ఐటీ పరిశ్రమలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. గ్రామీణ యువతకు ఉపాధి కల్పించటంలో ఈ పరిశ్రమలు తోడ్పడతాయని తెలిపారు. గ్రామాల్లో ప్రతిభావంతులకు కొదవలేదన్నారు. హైదరాబాద్‌లో టెక్‌వేవ్ కంపెనీ రెండో గ్లోబల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను మంత్రి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మంథని లాంటి మారుమూల గ్రామాల నుంచి కూడా వర్క్‌ఫ్రమ్ హోం ద్వారా బహుళజాతి కంపెనీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు వందల సంఖ్యలో ఉన్నారన్నారు. తెలంగాణలో ప్రస్తుతం 220కిపైగా అంతర్జాతీయస్థాయి కంపెనీల కేంద్రాలు ఉన్నాయని, వాటిని 400కు పెంచాలన్నది తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. హైదరాబాద్ కేంద్రంగా ఐటీ పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయని.. అయితే.. ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లో కూడా ఐటీ సంస్థలను నెలకొల్పి గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు పెంచాలని కోరారు. అమెరికాలోని హ్యూస్టన్‌లో ప్రధాన కార్యాలయం ఉన్న టెక్‌వేవ్ సంస్థ.. యూకే, హంగరీ, దక్షిణాఫ్రికా వంటి 11 దేశాల్లో ఐటీ సేవలు అందిస్తోందన్నారు. టెక్‌వేవ్ కంపెనీ హైదరాబాద్‌లో 2400 మంది, ఖమ్మంలో 500 మంది ఐటీ ఉద్యోగులను నియమించుకోవటంపై శ్రీధర్‌బాబు హర్షం వ్యక్తం చేశారు. అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా టెక్‌వేవ్ సంస్థ పనిచేస్తోందన్నారు. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా టీ ఫైబర్ నెట్‌వర్క్‌ను అందుబాటులోకి తీసుకొస్తామని, దీన్ని ఐటీ కంపెనీలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. టెక్‌వేవ్ సహ వ్యవస్థాపకుడు, ఛైర్మన్ గుమ్మడపు దామోదర్‌రావు మాట్లాడుతూ.. 20వ వార్షికోత్సవం సందర్భంగా తమకు ఇది ప్రత్యేకమైన సందర్భం అని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా 4 వేల మంది ఐటీ ఉద్యోగులతో తమ కార్యాలయాలు పని చేస్తున్నాయన్నారు. నూతన సాంకేతిక ఆవిష్కరణలకు తమ బృందం శక్తి వంచన లేకుండా పనిచేస్తుందని తెలిపారు. కాగా, హైదరాబాద్‌లోని నానక్‌రాంగూడలో సుమారు లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటైన టెక్‌వేవ్ సంస్థ కార్యాలయంలో 1200 మంది కొత్తగా పనిచేసే అవకాశం ఉంది. ఐటీలో ప్రపంచవ్యాప్తంగా సేవలు అందిస్తున్న టెక్‌వేవ్ ఏర్పాటు చేసిన ఏఐ ఆధారిత గ్లోబల్ డెవలప్‌మెంట్ సెంటర్.. డిజిటల్ తెలంగాణకు మైలురాయిగా నిలుస్తుందని సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు.

నిలువ నీడలేదు సార్.. ఇందిరమ్మ ఇల్లు ఇప్పించండి

- మంత్రి పొంగులేటిని కోరిన విద్యార్థి
- వెంటనే మంజూరు చేయాలని కలెక్టర్‌కు మంత్రి ఆదేశం
- వరంగల్ మరిపెడ సోషల్ వెల్ఫేర్ స్కూల్‌లో ఘటన

మరిపెడ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో శనివారం 'న్యూ కామన్ డైట్ మెనూ' ప్రారంభించడానికి వచ్చిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పర్యటనలో అనూహ్య సంఘటన జరిగింది. పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థి మంత్రి వద్దకు వచ్చి.. 'సార్ నేను మీ వీరాభిమానిని. మా కుటుంబానికి ఇల్లులేదు. పూరిగుడిసెలో ఉంటున్నాం. అమ్మానాన్న కష్టపడుతున్నారు. మాకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వండి సార్' అని వెక్కి వెక్కి ఏడ్చాడు. స్పందించిన మంత్రి బాలుడిని ఓదార్చి.. వెంటనే ఆ విద్యార్థి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్‌ను ఆదేశించారు.

హాస్టల్ విద్యార్థుల భోజనమిదీ...



గురుకుల విద్యాలయాల హాస్టళ్లలో కలుషిత ఆహారం తిని విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నందున... ప్రభుత్వం ఆహార పదార్థాల విషయంలో జాగ్రత్తలు తీసుకున్నది. హాస్టళ్లలో విద్యార్థులకు అందించే ఆహార పదార్థాల(మెనూ)ను నిర్దేశించింది. నాలుగు వారాల పాటు ఒక్కో రోజు అందించాల్సిన ఆహార పదార్థాలను వెల్లడించింది. ఇదే సందర్భంలో విద్యార్థుల కోసం కొత్త మెనూను విడుదల చేసింది. ఒక్కో వారంలో ఎలాంటి పదార్థాలు వండి వడ్డించాలో సూచించింది.

వారం పాటు పెట్టాల్సిన ఆహార పదార్థాలు ఇవే...

మొదటి వారం

వారం	బ్రేక్‌ఫాస్ట్	లంచ్	డిన్నర్
సోమవారం	కిచిడి, టమాట చట్నీ, రాగి జావ	రైస్, ఆలూ, క్యాప్సికమ్ కర్రీ, పాలకూర పప్పు, నెయ్యి, రసం, పెరుగు, ఉల్లి ఎగ్ కర్రీ	రైస్, చిక్కుడుకాయ కర్రీ, పుదీన కొత్తిమీర చట్నీ, సాంబరు, బటర్ మిల్క్
మంగళవారం	సాంబరు ఇడ్లీ, బూస్ట్‌తో పాలు	రైస్, బీట్‌రూట్ కర్రీ, దోసకాయ పప్పు, నెయ్యి, రసం, పెరుగు, బాయిల్డ్ ఎగ్	రైస్, క్యాబేజీ కర్రీ, టమాట చట్నీ, సాంబారు, బటర్ మిల్క్
బుధవారం	పులిహోర, నువ్వుల పొడి, బూస్ట్	బగారా రైస్, చికెన్ కర్రీ, పెరుగు, సాంబారు	రైస్, సొరకాయ కర్రీ, సాంబారు, బటర్ మిల్క్
గురువారం	బోండా/వడ, పల్లి చట్నీ, రాగి జావ	రైస్, క్యారెట్ కర్రీ, టమాట పప్పు, నెయ్యి, రసం, పెరుగు, ఫ్రైడ్ బాయిల్డ్ ఎగ్ కర్రీ	రైస్, బీరకాయ కూర, వెజిటేబుల్ చట్నీ, సాంబారు, బటర్ మిల్క్
శుక్రవారం	ఉప్మా, టమాట చట్నీ, రాగి జావ	రైస్, చామగడ్డ కూర, మునగాకు పప్పు, నెయ్యి, రసం, పెరుగు, బాయిల్డ్ ఎగ్ కర్రీ	రైస్, గోరుచిక్కుడు కర్రీ, వెజిటేబుల్ చట్నీ, సాంబారు, బటర్ మిల్క్
శనివారం	రైస్ పొంగలి, పుట్నాల చట్నీ	రైస్, బెండకాయ కూర, నెయ్యి, రసం, పెరుగు, టమాట బాయిల్డ్ ఎగ్ కర్రీ	రైస్, దోసకాయ కూర, గోంగూర, పచ్చిమిర్చి చట్నీ, సాంబారు, బటర్ మిల్క్
ఆదివారం	పూరి, చోలె మసాల	బగారా రైస్, మటన్ కర్రీ, మిల్‌మేకర్ కర్రీ,	రైస్, సొరకాయ కర్రీ, సాంబారు, బటర్ మిల్క్

రెండో వారం

వారం	బ్రేక్‌ఫాస్ట్	లంచ్	డిన్నర్
సోమవారం	కిచిడి, టమాట చట్నీ	రైస్, ఆలూ వంకాయ కర్రీ, తోటకూర పప్పు, నెయ్యి, రసం, పెరుగు, ఉల్లిపాయ ఎగ్ కర్రీ	రైస్, కాకరకాయ ఫ్రై, వెజిటేబుల్ చట్నీ, సాంబారు, బటర్ మిల్క్
మంగళవారం	ఇడ్లీ, సాంబారు, బూస్ట్	రైస్, క్యారెట్ కర్రీ, టమాట పప్పు, నెయ్యి, రసం, పెరుగు, బాయిల్డ్ ఎగ్	రైస్, దోసకాయ కర్రీ, వెజిటబుల్ చట్నీ, సాంబారు, బటర్ మిల్క్
బుధవారం	పులిహోర, నువ్వుల పొడి	వెజ్ బిర్యానీ, ఆలూ కుర్మా, పెరుగు, ఫ్రైడ్ బాయిల్డ్ ఎగ్ కర్రీ	రైస్, సొరకాయ కూర, వెజిటేబుల్ చట్నీ, సాంబారు, బటర్ మిల్క్
గురువారం	బోండా/వడ, పల్లి చట్నీ, రాగి జావ	రైస్, బెండకాయ కూర, మునుగాకు పప్పు, నెయ్యి, రసం, పెరుగు, బాయిల్డ్ ఎగ్	రైస్, బీరకాయ కూర, వెజిటబుల్ చట్నీ, సాంబారు, బటర్ మిల్క్
శుక్రవారం	ఉప్మా, పుట్నాల చట్నీ, రాగి జావ	రైస్, కందగడ్డ/చామగడ్డ కర్రీ, టమాట పప్పు, నెయ్యి, రసం, పెరుగు, బాయిల్డ్ ఎగ్ కర్రీ	రైస్, క్యాప్సికమ్ కర్రీ, వెజిటేబుల్ చట్నీ, సాంబరు, బటర్ మిల్క్
శనివారం	జీర రైస్, టమాట చట్నీ, బూస్ట్	రైస్, గోరుచిక్కుడు కూర, ఆకుకూర పప్పు, నెయ్యి, రసం, పెరుగు, బాయిల్డ్ ఎగ్	రైస్, కాలిఫ్లవర్ కర్రీ, వెజిటేబుల్ చట్నీ, సాంబారు, బటర్ మిల్క్
ఆదివారం	ఆలూ కుర్మా చపాతి	బగారా అన్నం, చికెన్ కర్రీ, మిల్ మేకర్ కర్రీ, సాంబారు, పెరుగు	రైస్, బీరకాయ కూర, సాంబారు, బటర్ మిల్క్

మూడో వారం

వారం	బ్రేక్‌ఫాస్ట్	లంచ్	డిన్నర్
సోమవారం	కిచిడి, టమాట చట్నీ, రాగి జావ	రైస్, ఆలూ క్యాప్సికమ్ కర్రీ, పాలకూర పప్పు, నెయ్యి, రసం, పెరుగు, ఉల్లిపాయ ఎగ్ కర్రీ	రైస్, సొరకాయ కూర, సాంబారు, బటర్ మిల్క్
మంగళవారం	ఇడ్లీ, సాంబారు, బూస్ట్	రైస్, దొండకాయ కూర, టమాట పప్పు, నెయ్యి, రసం, పెరుగు, బాయిల్డ్ ఎగ్	రైస్, పొట్లకాయ/వంకాయ కూర, వెజిటేబుల్ చట్నీ, సాంబరు, బటర్ మిల్క్
బుధవారం	పులిహోర, నువ్వుల పొడి, బూస్ట్	బగారా అన్నం, చికెన్ కర్రీ, మిల్‌మేకర్ కర్రీ, పెరుగు, సాంబారు	రైస్, బీరకాయ కూర, సాంబారు, బటర్ మిల్క్
గురువారం	బోండా/వడ, పల్లి చట్నీ, రాగి జావ	రైస్, క్యాబేజీ కర్రీ, టమాట పప్పు, నెయ్యి, రసం, పెరుగు, టమాట బాయిల్డ్ ఎగ్ కర్రీ	రైస్, క్యాప్సికమ్ కర్రీ, వెజిటేబుట్ చట్నీ, సాంబారు, బటర్ మిల్క్
శుక్రవారం	ఉప్మా, టమాట చట్నీ, రాగి జావ	రైస్, క్యారెట్ కర్రీ, దోసకాయ పప్పు, నెయ్యి, రసం, పెరుగు, బాయిల్డ్ ఎగ్	రైస్, కాలిఫ్లవర్ కర్రీ, వెజిటేబుల్ చట్నీ, బటర్ మిల్క్
శనివారం	రైస్ పొంగల్, పుట్నాల చట్నీ, బూస్ట్	రైస్, బెండకాయ కర్రీ, టమాట పప్పు, నెయ్యి, రసం, పెరుగు, బాయిల్డ్ ఎగ్	రైస్, చిక్కుడుకాయ కర్రీ, వెజిటేబుల్ చట్నీ, సాంబారు, బటర్ మిల్క్
ఆదివారం	పూరి, చోలె మసాల	బగారా అన్నం, మటన్ కర్రీ, మిల్‌మేకర్ కర్రీ, పెరుగు, సాంబారు	రైస్, బీరకాయ కర్రీ, సాంబారు, బటర్ మిల్క్

నాల్గో వారం

వారం	బ్రేక్‌ఫాస్ట్	లంచ్	డిన్నర్
సోమవారం	కిచిడి, టమాట చట్నీ, రాగి జావ	రైస్, ఆలూ క్యాప్సికమ్ కర్రీ, టమాట పప్పు, నెయ్యి, రసం, పెరుగు, ఉల్లిపాయ ఎగ్ కర్రీ	రైస్, కాకరకాయ ఫ్రై, వెజిటేబుల్ చట్నీ, సాంబారు, బటర్ మిల్క్
మంగళవారం	ఇడ్లీ, సాంబారు, బూస్ట్	రైస్, బీట్‌రూట్ కర్రీ, పాలకూర పప్పు, నెయ్యి, రసం, పెరుగు, బాయిల్డ్ ఎగ్	రైస్, క్యాబేజీ కర్రీ, వెజిటేబుల్ చట్నీ, సాంబారు, బటర్ మిల్క్
బుధవారం	పులిహోర, నువ్వుల పొడి, రాగి జావ	వెజ్ బిర్యానీ, ఆలూ కుర్మా, బాయిల్డ్ ఎగ్ టమాట కర్రీ	రైస్, సొరకాయ కూర, వెజిటేబుట్ చట్నీ, సాంబారు, బటర్ మిల్క్
గురువారం	బోండా, పల్లి చట్నీ, బూస్ట్	రైస్, బెండకాయ కూర, మునుగాకు పప్పు, నెయ్యి, రసం, పెరుగు, బాయిల్డ్ ఎగ్	రైస్, చిక్కుడుకాయ కూర, వెజిటేబుల్ చట్నీ, సాంబారు, బటర్ మిల్క్
శుక్రవారం	ఉప్మా, పుట్నాల చట్నీ, రాగా జావ	రైస్, కందగడ్డ/చామగడ్డ కూర, టమాట పప్పు, నెయ్యి, రసం, పెరుగు, బాయిల్డ్ ఎగ్	రైస్, పొట్లకాయ/వంకాయ కూర, వెజిటేబుల్ చట్నీ, సాంబారు, బటర్ మిల్క్
శనివారం	జీర రైస్, టమాట చట్నీ, బూస్ట్	రైస్, క్యారెట్ కర్రీ, తోటకూర పప్పు, నెయ్యి, రసం, పెరుగు	రైస్, క్యాప్సికమ్ కర్రీ, వెజిటేబుల్ చట్నీ, సాంబారు, బటర్ మిల్క్
ఆదివారం	చపాతి, ఆలూ కుర్మా	బగారా రైస్, చికెన్ కర్రీ, మిల్‌మేకర్ కర్రీ, పెరుగు, సాంబారు	రైస్, బీరకాయ కూర, సాంబారు, బటర్ మిల్క్

హైవే, స్కైవే, ఫ్లైవేలే కాదు..
ఆదివాసీలు నడిచేందుకు దారులు కూడా

- ఆ దిశగానే సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచన
- నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల పర్యటనలో మంత్రి సీతక్క

ఖానాపూర్/ఉట్నూర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పేరిట హైవే, స్కైవే, ఫ్లైవేలు నిర్మించడం మాత్రమే కాదు.. ఆదివాసీలు నడించేందుకు కనీసం దారులు నిర్మించాలని.. ఆ దిశగానే సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచన చేస్తున్నారని మంత్రి సీతక్క అన్నారు. శనివారం నిర్మల్ జిల్లా కడెం మండలంలోని మారుమూల అటవీ ప్రాంతమైన గంగాపూర్‌లో సీతక్క పర్యటించారు. ఈ సందర్భంగా గంగాపూర్, ఖానాపూర్ మండలంలోని ఎర్వచింతల్ గ్రామాల మధ్య రూ.22 కోట్లతో నిర్మించనున్న వంతెన పనులకు మంత్రి భూమిపూజ చేశారు. ఖానాపూర్‌లోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ చేశారు. అలాగే ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు ఆమె హాజరయ్యారు. ఆయా ప్రాంతాల్లో సీతక్క మాట్లాడుతూ.. మారుమూల గ్రామాలకు అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు కూడా వెళ్లలేని విధంగా రహదారులు ఉన్నాయని, ఆ పరిస్థితి నుంచి ప్రజలకు విముక్తి కల్పించే విధంగా తమ ప్రభుత్వం ఆలోచన చేస్తోందన్నారు. ఆ దిశగా సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా బ్రిడ్జిల నిర్మాణం కోసం రూ.1300ల కోట్ల నిధులను మంజూరు చేశారన్నారు. నెల రోజుల్లో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని చెప్పారు.

మత్స్య సొసైటీల ఎన్నికల ప్రక్రియ
4 వారాల్లో ప్రారంభించండి: హైకోర్టు

హైదరాబాద్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామం నుంచి రాష్ట్రం వరకు అన్ని స్థాయిల మత్స్య సొసైటీలకు నాలుగు వారాల్లో ఎన్నికల ప్రక్రియను ప్రారంభించాలని సహకార సంఘాల రిజిస్ట్రార్‌కు హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. మొత్తం 33 జిల్లాలకుగానూ 21 జిల్లాల్లో ఉన్న వెయ్యికి పైగా ప్రాథమిక మత్స్య సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించలేదంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం ఈ ఆదేశాలు ఇచ్చింది. పిటిషనర్ల తరఫున న్యాయవాది డీఎల్ పాండు వాదనలు వినిపిస్తూ ఎన్నికల నిర్వహణపై చర్యలు తీసుకోవాలని సహకార శాఖ మంత్రి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో తీర్మానించినా ఇంకా అమల్లోకి రాలేదని తెలిపారు. ప్రభుత్వ న్యాయవాది సమాధానం ఇస్తూ ఎన్నికల జరపాలని మత్స్యశాఖ డైరెక్టర్ సహకార సంఘాల రిజిస్ట్రార్‌కు లేఖ రాశారని చెప్పారు. ఈ నేపథ్యంలో నాలుగు వారాల్లో ఎన్నికల తేదీలను నోటిపై చేయాలని ధర్మాసనం ఆదేశించింది.

బొగ్గు ఉత్పత్తి, రవాణాలో లక్ష్యాలు చేరుకోవాలి

- సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్

హైదరాబాద్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఈ ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఇంకా 108 రోజుల సమయం మాత్రమే మిగిలి ఉన్నందున దీన్ని సద్వినియోగం చేసుకొని, రోజుకు కనీసం 2.7 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేస్తూ.. అదే మోతాదులో బొగ్గు రవాణా చేయాలని సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్ అన్నారు. అధికారులతో ఆయన శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. బొగ్గు రవాణాకు ఎటువంటి ఆటంకాలు లేకుండా, ఎప్పటికప్పుడు రైల్వే అధికారులతో సంప్రదిస్తూ వినియోగదారులకు సకాలంలో అందజేయాలని సూచించారు. లక్ష్యాల మేరకు ఉత్పత్తి సాధిస్తున్న గనులను, ఏరియాలను అభినందిస్తూ, వెనుకబడి ఉన్న ఏరియాలు ఇప్పుడు పుంజుకోవాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు.

టీశాక్‌లో 58 ఎల్టీ పోస్టులకు నోటిఫికేషన్

హైదరాబాద్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (టీశాక్) పరిధిలోని ఇంటిగ్రేటెడ్ కౌన్సెలింగ్ అండ్ టెస్టింగ్ సెంటర్ (ఐసీటీసీ), ప్రివెన్షన్ ఆఫ్ పేరెంట్ టూ చైల్డ్ ట్రాన్స్‌మిషన్ (పీపీటీసీటీ), డిజిగ్నేటెడ్ సెక్సువల్లీ ట్రాన్స్‌మిటెడ్ ఇన్ఫెక్షన్స్ రీప్రొడక్టివ్ ట్రాక్ ఇన్ఫెక్షన్స్ క్లినిక్స్ (డీఎస్ఆర్‌సీ) కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది. మొత్తం 58 ల్యాబ్ టెక్నీషియన్ (ఎల్టీ), మరో 17 కౌన్సిలర్, రెండు ల్యాబ్ సర్వీసెస్‌లోని టెక్నికల్ ఆఫీసర్ పోస్టులున్నాయి. వీటిని పూర్తిగా కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేయనున్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 21లోగా దరఖాస్తు చేసుకోవాలని టీశాక్ కోరింది. రాత పరీక్ష నిర్వహణ బాధ్యతను జేఎన్‌టీయూకు అప్పగించనున్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌లో
11.55 లక్షల కేసుల పరిష్కారం

- రోడ్డు ప్రమాదం కేసులో బాధిత కుటుంబానికి 1.99 కోట్లు

హైదరాబాద్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా అన్ని స్థాయిల కోర్టుల్లో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్ విజయవంతమైనట్లు తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శి సీహెచ్. పంచాక్షరి తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సివిల్, క్రిమినల్ కేసులతోపాటు ప్రీలిటిగేషన్ కేసులు మొత్తం కలిపి 11.55 లక్షల కేసులు పరిష్కరించినట్లు పేర్కొన్నారు. మొత్తం కేసుల్లో రూ. 161 కోట్ల పరిహారం అందజేశారు. హైకోర్టు సహా అన్ని స్థాయిల కోర్టుల్లో మొత్తం 337 స్పెషల్ బెంచ్‌లు కేసుల విచారణ చేపట్టాయి. హైకోర్టులో జస్టిస్ సూరేపల్లి నంద, రిటైర్డ్ జస్టిస్ జి.శ్రీదేవి ధర్మాసనాలు 225 కేసులు పరిష్కరించి, దాదాపు రూ. 16 కోట్లు పరిహారం అందజేశాయి. హైకోర్టులో ఒక మోటార్ యాక్సిడెంట్ కేసులో బాధిత కుటుంబానికి రూ.1.99 కోట్లు అవార్డు జారీచేశారు. వరంగల్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలకు చెందిన జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యులు చొరవ చూపడంతో నాలుగు జంటలు తమ వైవాహిక వివాదాలను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకుని మళ్లీ ఒక్కటయ్యాయి. లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ జస్టిస్ సుజోయ్‌పాల్ జిల్లా జడ్జీలు, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యులతో వర్చువల్‌గా మాట్లాడి.. జాతీయ లోక్‌అదాలత్ ప్రాముఖ్యాన్ని వివరించారు. లోక్‌అదాలత్‌ను విజయవంతం చేసినందుకు హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే అందరికీ అభినందనలు తెలిపారు.

రాష్ట్రంపై 'చలి పంజా'

- రాత్రిపూట సింగిల్ డిజిట్‌కు పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- ఆదిలాబాద్ జిల్లాలో 6.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు
- చలితో బయటకు రావాలంటేనే జంకుతున్న జనం

హైదరాబాద్/ఆదిలాబాద్/ఆసిఫాబాద్, , డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణపై చలి పులి పంజా విసురుతోంది. రాష్ట్రవ్యాప్తంగా రాత్రిపూట ఉష్ణోగ్రతలు బాగా పడిపోతున్నాయి. నాలుగు రోజుల వ్యవధిలోనే ఏకంగా పది డిగ్రీల మేర పడిపోయాయి. శుక్రవారం రాత్రి ఆదిలాబాద్ జిల్లాలోని బేలలో రాష్ట్రంలోనే అత్యల్పంగా 6.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఈ సీజన్‌లో నమోదైన అత్యల్ప ఉష్ణోగ్రత ఇదే కావడం గమనార్హం. అలాగే ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్‌లో 6.7, నిర్మల్ జిల్లా పెంబిలో 9.3, కామారెడ్డి జిల్లా జుక్కల్‌లో 9.4 సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్‌లో 9.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మిగతా అన్ని జిల్లాల్లోనూ 10 నుంచి 17 డిగ్రీల మధ్యనే రాత్రిపూట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక రాగల మూడు రోజుల పాటు రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ ఉదయం వేళల్లో పొగమంచు ఏర్పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాగల 2 రోజుల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీలు మేర పడిపోయే అవకాశం ఉందని పేర్కొంది. చలితో ఉదయం 9 గంటలు దాటినప్పటికీ బయటకు రావాలంటేనే జనం జంకుతున్నారు.

టీజీపీఎస్సీపై విశ్వాసం ఉంచి
పరీక్షలు రాయండి

ఇకపై నోటిఫికేషన్ నుంచి.. ఏడాదిలోగా నియామకాల పూర్తి

- వేగంగా ఫలితాలకు చర్యలు
- మార్చిలోగా గ్రూప్-2, 3 ఫలితాలు
- నేటి నుంచి గ్రూప్-2 పరీక్షలు
- 1,368 పరీక్ష కేంద్రాలు.. 5.51 లక్షల మంది అభ్యర్థులు
- అరగంట ముందే గేట్లు మూసివేత
- బయోమెట్రిక్ వేస్తేనే పరీక్షకు అనుమతి
- టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం



హైదరాబాద్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ)పై విశ్వాసం ఉంచి పరీక్షలు రాయాలని.. మెరిట్ ఉంటే ఉద్యోగం వస్తుందని ఆ కమిషన్ ఛైర్మన్ బుర్రా వెంకటేశం అన్నారు. గతంలో గ్రూప్-2 నోటిఫికేషన్‌ను 2015లో విడుదల చేస్తే.. 2019లో నియామకాలు జరిగాయని, ఇకపై టీజీపీఎస్సీలో అలాంటి ఆలస్యం ఉండబోదన్నారు. నోటిఫికేషన్లు ఇచ్చిన నాటి నుంచి 9-12 నెలల మధ్యలో నియామకాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆదివారం నుంచి ప్రారంభం కానున్న గ్రూప్-2తోపాటు.. ఇదివరకే నిర్వహించిన గ్రూప్-3 ఫలితాలను మార్చిలోగా విడుదల చేస్తామని భరోసా ఇచ్చారు. శనివారం ఆయన కమిషన్ సభ్యుడు రామ్మోహన్‌రావుతో కలిసి, విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 783 పోస్టుల భర్తీకి నిర్వహిస్తున్న గ్రూప్-2 పరీక్షలకు సర్వం సిద్ధమైందని, ఆది, సోమవారాల్లో 1,368 కేంద్రాల్లో నిర్వహించనున్న ఈ పరీక్షలకు 5,51,847 మంది హాజరుకానున్నారని వివరించారు. "ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు.. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండేసి సెషన్లలో రెండ్రోజుల్లో నాలుగు పేపర్లలో ఈ పరీక్షలు జరుగుతాయి. ఉదయం సెషన్‌లో 9.30లోపు.. మధ్యాహ్నం 2.30లోపు అభ్యర్థులు పరీక్ష కేంద్రాల్లోకి వెళ్లాలి. ఆ తర్వాత గేట్లను మూసివేస్తాం" అని స్పష్టంచేశారు. "2022లో గ్రూప్-2 నోటిఫికేషన్ వెలువడింది. రెండు కోర్టు కేసులతో.. రెండేళ్ల తర్వాత పరీక్షలు జరుగుతున్నాయి. ఇప్పటిదాకా 75% మంది హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారు. 80% మంది దాకా అభ్యర్థులు పరీక్షలు రాసే అవకాశాలున్నాయి. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘా ఉంటుంది. సిలబస్ నుంచే ప్రశ్నలుంటాయి. ఏ పుస్తకాలను చదవాలనేది అభ్యర్థుల ఇష్టం" అని వివరించారు. గ్రూప్-2 ఓఎంఆర్ షీట్లు అభ్యర్థుల వారీగా ఉంటాయని, పరీక్ష ప్రారంభం కావడానికి ముందే అందులోని వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు. బయోమెట్రిక్ హాజరు ఉన్న అభ్యర్థుల పత్రాలను మాత్రమే వాల్యుయేషన్‌కు పంపుతామని స్పష్టం చేశారు. "తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఇది రెండో గ్రూప్-2 నోటిఫికేషన్. 2022లో రెండో నోటిఫికేషన్ వస్తే.. 2024లో పరీక్షలు పెడుతున్నాం. మార్చిలోగా గ్రూప్-2, గ్రూప్-3 ఫలితాలను విడుదల చేస్తాం" అని వెల్లడించారు. కంప్యూటర్ ఆధారిత పరీక్ష(సీబీటీ)పై బుర్రా వెంకటేశం మాట్లాడుతూ.. రాష్ట్రంలో 28 వేల మంది అభ్యర్థులు మాత్రమే సీబీటీ విధానంలో పరీక్షలు రాసే సదుపాయాలున్నాయన్నారు. అందుకే తాము సీబీటీ జోలికి వెళ్లడం లేదన్నారు.

యూపీఎస్సీకి దీటుగా టీజీపీఎస్సీ

యూపీఎస్సీకి దీటుగా టీజీపీఎస్సీని తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు బుర్రా వెంకటేశం తెలిపారు. ఇందుకోసం 18, 19వ తేదీల్లో ఢిల్లీలో పర్యటిస్తామన్నారు. "18న యూపీఎస్సీ ఛైర్మన్‌ను కలిసి పరీక్ష, నియామక ప్రక్రియను పరిశీలిస్తాం. కేంద్ర సమాచార కమిషన్ ప్రధాన కమిషనర్ హీరాలాల్ సమారియాను కలిసి, సమాచార హక్కు చట్టం కింద ఏయే సమాచారం ఇవ్వాలి? వంటి వివరాలపై అధ్యయనం చేస్తాం. 19న స్టాఫ్ సెలెక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) ఛైర్మన్‌ను, ఆ తర్వాత జాతీయ పరీక్షల నిర్వహణ సంస్థ(ఎన్‌టీఏ) ఛైర్మన్‌ను కలుస్తాం. సంస్థాగత మార్పులు, సంస్కరణలపై 2025 జనవరి నెలాఖరుకల్లా ప్రభుత్వానికి నివేదిక అందిస్తాం. ఈ ఏడాదిలో 13 వేల ఉద్యోగాలను తెలంగాణ కమిషన్ భర్తీ చేసింది. ఏడాదిలో యూపీఎస్సీ 5 వేల ఉద్యోగాలను మాత్రమే భర్తీ చేస్తుంది. యూపీఎస్సీ కేవలం సివిల్స్ పరీక్షలను నిర్వహించి, మిగిలిన ప్రక్రియలను ఎస్ఎస్‌సీకి అప్పగిస్తుంది" అని వివరించారు. ఏ పరీక్షకు నోటిఫికేషన్‌ను విడుదల చేసినా.. పరీక్షలు, సర్టిఫికెట్ల వెరిఫికేషన్, నియామక ప్రక్రియను 9 నెలల నుంచి ఏడాదిలోపు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

'59 జీవో' దస్త్రాలన్నీ మాయం!

- శేరిలింగంపల్లి తహసీల్దార్ ఆఫీసులో మిస్సింగ్
- ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాలకూ చేరని తీరు
- ఎన్నికల వేళ అడ్డగోలుగా కన్వేయన్స్ డీడ్లు
- వందల కోట్లు విలువైన భూములు పరాధీనం
- 'ఆంధ్రజ్యోతి' కథనాలతో లావాదేవీలు బంద్
- విచారణ అధికారిగా అప్పటి అదనపు కలెక్టర్
- 4 నెలల క్రితం ఆయన ఏసీబీకి చిక్కడంతో అప్పటి విచారణ నివేదికపై అనుమానాలు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు14 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి.. రాష్ట్రంలోనే అత్యంత ఖరీదైన రెవెన్యూ మండలం. హైదరాబాద్ మహా నగరానికి పశ్చిమాన ఐటీ కారిడార్‌ను కలిగి ఉన్న ఈ మండలంలో చదరపు గజం విలువ రూ.లక్షల్లోనే..! ఎకరాకు వంద కోట్లు చెల్లించేందుకు ముందుకొస్తే కానీ భూములు, స్థలాలు దొరకవు. కానీ, గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 59 కింద ఈ మండలంలోని ప్రభుత్వ భూములను కొందరు అక్రమార్కులు అప్పనంగా కొట్టేశారు. సరిగ్గా ఎన్నికల ఫలితాలకు ముందు రోజే విలువైన ప్రభుత్వ భూములు పరాధీనమయ్యాయి. ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' బట్టబయలు చేయగా.. సంబంధింత కన్వేయన్స్ డీడ్లను నిలిపివేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. అయితే, 59 జీవో కింద అధికారులు పరిష్కరించిన క్రమబద్ధీకరణ దస్త్రాలేవీ శేరిలింగంపల్లి తహశీల్దార్ కార్యాలయంలో లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. సంబంధిత దస్త్రాలను ధ్వంసం చేశారా? లేకుంటే మాయం చేశారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి 2014కు ముందు జరిగిన అక్రమణలను క్రమబద్ధీకరించేందుకు గత ప్రభుత్వం 2016లో జీవో 58, 59 తీసుకురాగా.. ఆ సందర్భంలోనే చాలావరకు పేదలు, ఆయా స్థలాల్లో ఉన్న వారు క్రమబద్ధీకరించుకున్నారు. కానీ, ఆ తర్వాత 58, 59 జీవోలను రెండు దఫాలుగా 2020, 2022లో పొడిగించడంతో కబ్జాదారులు ప్రభుత్వ భూములను చెరబట్టారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలకు ముందు రోజే శేరిలింగంపల్లి మండలం గోపనపల్లిలోని సర్వే నంబర్ 74లో 30మందికి సంబంధించి 12,879 చదరపు గజాలను క్రమబద్ధీకరించడంపై 'ఫలితాలకు ముందురోజే భూమేత' అనే శీర్షికతో గత ఏడాది డిసెంబరు 11న 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. అలాగే, నానక్‌రాంగూడలోని సర్వే నంబర్ 149లో 5 ఎకరాల ప్రభుత్వ భూమిని 15మంది పేరిట క్రమబద్ధీకరించడంపై 'భూంఫట్ స్వాహా' శీర్షికతో జనవరి 10న మరో కథనాన్ని 'ఆంధ్రజ్యోతి' ప్రచురించింది. ఇవి చర్చనీయాంశం కావడంతో సంబంధిత కన్వేయన్స్ డీడ్లను ప్రభుత్వం రద్దు చేసింది. అప్పటి రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డిని విచారణ అధికారిగా నియమించింది. వారం పాటు ఆయన విచారణ జరిపినా.. ఆ నివేదిక బయటకు రాలేదు. ఇంతలో ఓ రైతు నుంచి రూ.8లక్షలు లంచం తీసుకుంటూ భూపాల్‌రెడ్డి ఏసీబీకి చిక్కారు. ఈ నేపథ్యంలో అప్పట్లో ఆయన ఇచ్చిన విచారణ నివేదికపైనా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కార్యాలయం నుంచి ఎలా మాయమైనట్టు?

శేరిలింగంపల్లి మండలంలో మూడు దఫాలుగా ప్రభుత్వ భూములు, స్థలాలను క్రమబద్ధీకరించారు. 59 జీవో కింద వచ్చిన దరఖాస్తులన్నీ ఆన్‌లైన్‌లో రాగా.. వాటిని పరిష్కరించే క్రమంలో శేరిలింగంపల్లి తహసీల్దార్ కార్యాలయంలోనే వాటి ఆఫ్‌లైన్‌లోకి మార్చారు. 3 దఫాలుగా రికార్డులను రూపొందించారు. కానీ, ప్రస్తుతం శేరిలింగంపల్లి తహసీల్దార్ కార్యాలయంలో సంబంధిత దస్త్రాలు అందుబాటులో లేవు. ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాలకూ చేరినట్లు సమాచారం లేదు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తుల వెబ్‌సైట్‌ను ఇప్పటికే మూసివేయగా.. తాము బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి అలాంటి దస్త్రాలేవీ కనిపించలేదని ప్రస్తుతం ఉన్న అధికారులు చెబుతున్నారు. దస్త్రాల మాయం వెనుక బడా బాబుల హస్తం ఉన్నట్లుగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

క్లీన్‌చిట్ రావడంతోనే కీలక పదవులు

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన 59జీవో దుర్వినియోగమైన అంశాన్ని ప్రస్తావించారు. శేరిలింగంపల్లి మండలంలో అక్రమంగా క్రమబద్ధీకరించిన స్థలాల విలువ 1900కోట్ల మేర ఉంటుందని చెప్పుకొచ్చారు. ఆయా స్థలాల రిజిస్ట్రేషన్లను రద్దు చేసి నిషేధిత జాబితాలో పెడతామని ప్రకటించారు. అయితే, శేరిలింగంపల్లి మండలంలో అక్రమ క్రమబద్ధీకరణల్లో అప్పటి తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్‌తోపాటు అప్పటి గండిపేట తహసీల్దార్ భాగస్వామ్యం ఉన్నట్టు ఆరోపణలున్నాయి. అయితే, అప్పటి అదనపు కలెక్టర్ విచారణ సందర్భంలో రెవెన్యూ అధికారులకు క్లీన్ చీట్ ఇచ్చిన్నట్లుగా తెలుస్తోంది. ఆ కారణంగానే శేరిలింగంపల్లి, గండిపేట తహసీల్దార్ కార్యాలయ అధికారులంతా కీలక పోస్టులను దక్కించుకున్నట్లు సమాచారం.

ఇకపై ఆదివారం కూడా వందేభారత్ రాకపోకలు

విశాఖపట్నం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వందే భారత్ రైలు విషయంలో వాల్తేరు డివిజన్ అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. విశాఖపట్నం-సికింద్రాబాద్ మధ్య 20833/20834 నంబర్లు కలిగిన రైళ్లు నడుస్తున్న సంగతి తెలిసిందే. దీనిని వారంలో ఆరు రోజులు నడుపుతూ ఆదివారం మెయింటెనెన్స్ కోసం విరామం ఇస్తున్నారు. అయితే చాలామంది ప్రయాణికులు తమకు ఆదివారాల్లో ఈ రైలు చాలా ముఖ్యమని, ఆ రోజున తప్పనిసరిగా నడపాలని, కావాలంటే మంగళవారం విరామం ఇవ్వాలని సూచించారు. దీనిపై అనేక అభ్యర్థనలు రావడంతో వాల్తేరు డివిజన్ అధికారులు ఆ మేరకు నిర్ణయం తీసుకున్నారు. విశాఖపట్నం-సికింద్రాబాద్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను ఇకపై డిసెంబరు 15వ తేదీ నుంచి ఆదివారాల్లో నడవనుంది. ప్రతి మంగళవారం ఈ సర్వీసుకు విరామం ఇవ్వనున్నారు. ఈ రైలు (20833) విశాఖలో ఉదయం 5.45 గంటలకు బయలుదేరి సామర్లకోట, రాజమండ్రి, విజయవాడ, ఖమ్మం, వరంగల్ స్టేషన్ల మీదుగా సికింద్రాబాద్‌కు మధ్యాహ్నం 2.15 గంటలకు చేరుతుంది. సికింద్రాబాద్‌లో 20834 నంబరుతో మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి రాత్రి 11.35 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.

అనారోగ్యం అంటే.. బెయిలొస్తుంది..!

కొంప ముంచిన ఉచిత సలహా..!!.. ఎస్కార్టు కోసం.. ఠాణా పేరు తప్పుగా నమోదు

- ఆదేశాల్లో బొంరాస్‌పేట్ బదులు బాలానగర్
- లగచర్ల రైతుకు సంకెళ్ల ఘటనపై.. జైళ్ల శాఖ అంతర్గత విచారణలో వెల్లడి!!

హైదరాబాద్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జైలులో విచారణ ఖైదీగా ఉన్న లగచర్ల రైతు హీర్యా నాయక్ అస్వస్థతకు గురైతే.. సంకెళ్లు వేసి, ఆస్పత్రికి తరలించిన ఘటనలో కుట్ర కోణం ఉందా? అనే దిశలో జైళ్ల శాఖ అంతర్గత విచారణ ముగిసింది. సిబ్బంది ఉచిత సలహా, పరిపాలనాపరమైన అలసత్వం కారణంగానే ఇదంతా జరిగినట్లు విచారణలో తేలింది. విచారణ ఖైదీగా ఉన్న రైతుకు సంకెళ్లు వేసిన ఘటనపై వాస్తవాలు నిగ్గు తేల్చేందుకు జైళ్ల శాఖ డీజీ సౌమ్యా మిశ్రా.. సీనియర్ ఐజీ నేతృత్వంలో విచారణకు ఆదేశించారు. సంగారెడ్డి జైలు సందర్శించిన ఐజీ.. సిబ్బందిని విచారించి, నివేదికను రూపొందించారు. అత్యంత విశ్వసనీయ సమాచారం మేరకు.. ఆ నివేదికలో పొందుపర్చిన అంశాలు ఇలా ఉన్నాయి. అనారోగ్య కారణాలతో బెయిల్‌కు దరఖాస్తు చేసుకుంటే సులువుగా వచ్చే అవకాశం ఉంటుందని జైలు సిబ్బంది హీర్యా నాయక్‌కు ఉచిత సలహా ఇచ్చినట్లు తేలింది. ఆ క్రమంలోనే తనకు ఛాతీలో నొప్పిగా ఉందని హీర్యా నాయక్ అధికారులకు చెప్పడంతో.. ముందుగా జైలు ఆస్పత్రిలో చికిత్స అందించారు. జైలు డాక్టర్ సూచన మేరకే బయట 2డీ ఎకో పరీక్షలు నిర్వహించారు. మెరుగైన చికిత్స కోసం నిమ్స్‌కు తరలించారు. నిమ్స్ వైద్యుల పరీక్షలో ఏ సమస్యా లేదని తేలింది. మరోవైపు ఖైదీలకు ఎస్కార్టు విషయంలో జైలు సిబ్బంది రూపొందించిన లేఖలో పోలీస్‌స్టేషన్ పేరు తప్పుగా దొర్లింది. అయితే ఆ రోజు సంగారెడ్డి జైలు నుంచి కొందరు ఖైదీలను కోర్టు విచారణకు తరలించారు. వరుస క్రమంలో హీర్యా నాయక్ పేరు చేర్చి, ఆస్పత్రికి తరలించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారులపై లగచర్లలో దాడి జరిగిన ఘటనపై వికారాబాద్ జిల్లా బొంరాస్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్కార్టు కోసం రాసిన లేఖలో బొంరాస్‌పేట్ ఠాణా పేరుకు బదులు తప్పుగా బాలానగర్ అని పేర్కొన్నారు. ఎస్కార్టు లేఖలో పోలీస్‌స్టేషన్ పేరు తప్పుగా ఉన్న విషయాన్ని పాలనాపరమైన అలసత్వం కారణంతో గుర్తించలేదని విచారణలో తేలింది. మరో నిందితుడు జైలు ఫోన్‌ను ఉపయోగించి మాట్లాడిన అంశాలను విచారణాధికారులు పరిశీలించారు. ఘటనకు సంబంధించిన మొత్తం వివరాలతో నివేదిక రూపొందించిన అధికారులు.. సోమవారం ఉదయం జైళ్ల శాఖ డీజీకి నివేదికను అందించనున్నారు. ఇప్పటికే జైలర్‌ను సస్పెండ్ చేశారు. సూపరింటెండెంట్‌ను విధుల నుంచి తప్పించిన ఉన్నతాధికారులు.. నివేదిక పరిశీలన అనంతరం అసలు తప్పిదానికి కారకులైన సిబ్బంది, అధికారులపై శాఖాపరమైన చర్యలు చేపట్టనున్నారు. జైలు సూపరింటెండెంట్ విషయంలో హోం శాఖ ఒకటి, రెండు రోజుల్లో నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. కాగా.. విచారణ ఖైదీగా ఉన్న రైతుకు సంకెళ్లు వేయడంతోనే అసలు సమస్య తలెత్తింది. ఈ విషయంపైనా జైళ్ల శాఖ విచారణలో ప్రస్తావించారు. ఖైదీలకు సంకెళ్లు అనేది జైలు అధికారులకు సంబంధించిన అంశం కాదని, పూర్తిగా పోలీసుల విచక్షణపై ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. జైళ్ల శాఖ అందించే నివేదిక మేరకు ఆ రోజు ఎస్కార్టుగా వ్యవహరించిన సిబ్బందిపైనా పోలీసు అధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకునే అవకాశాలున్నాయి.

రాంగ్ నంబర్ కిలేడీ!

- వాజేడు ఎస్సై ఆత్మహత్యకు కారణమైన మహిళ అరెస్టు
- ఆమె చరిత్ర తెలిసి పెళ్లికి నిరాకరించిన హరీశ్
- బెదిరింపులకు దిగడంతో ఎస్సై బలవన్మరణం

వాజేడు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ములుగు జిల్లా వాజేడు ఎస్సై రుద్రారపు హరీశ్ ఆత్మహత్య కేసులో మిస్టరీ వీడింది. రాంగ్ నంబర్ అంటూ ఫోన్ కాల్‌తో దగ్గరైన అనూష అనే మహిళ వేధింపుల వల్లే ఎస్సై హరీశ్ బలవన్మరణానికి పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు. ఇందుకు సంబంధించి సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం దుదియతండాకు చెందిన బానోత్ అనసూర్య(అనూష)ను అరెస్టు చేసినట్టు శనివారం ప్రకటించారు. ములుగు జిల్లా వెంకటాపురం (నూగూరు) సీఐ బండారి కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దుదియతండాకు చెందిన అనూష హైదరాబాద్ శివారులోని ఓ ఇంజనీరింగ్ కాలేజీ అడ్మినిస్ట్రేటివ్ విభాగంలో పని చేస్తుంటోంది. అనూష గుర్తు తెలియని వ్యక్తులకు ఫోన్లు చేసి పరిచయం పెంచుకుని ప్రేమ పేరుతో దగ్గరై బెదిరింపులకు పాల్పడుతుంటుంది. ఇందుకు సంబంధించి ఆమెపై పలు కేసులు కూడా ఉన్నాయి. ఈ క్రమంలో దాదాపు ఏడు నెలల క్రితం వాజేడు ఎస్సై హరీశ్‌కు కూడా ఫోన్ చేసింది. రాంగ్ నెంబరు అంటూనే మాటలు కలిపి అతనితో పరిచయం పెంచుకుంది. తరచూ ఫోన్‌లో మాట్లాడుతుండడంతో ఇరువురి మధ్య సాన్నిహిత్యం పెరిగింది. అనంతరం ఓ రోజు హరీశ్ వద్ద పెళ్లి ప్రస్తావన తెచ్చింది. అయితే, మరోపక్క అనూష చరిత్ర తెలుసుకున్న హరీశ్ ఆమె ప్రతిపాదనను తిరస్కరించి దూరం పెట్టాడు. దీంతో తనతో పెళ్లికి నిరాకరిస్తే తనను శారీరకంగా వాడుకున్నావని మీడియాకు, పోలీస్ అధికారులకు చెబుతానని అనూష. హరీశ్‌ను బెదిరించడం మొదలుపెట్టింది. ఈ క్రమంలో డిసెంబరు 1న హరీశ్‌కు చెప్పకుండా వాజేడు చేరుకున్న అనూష అతనికి ఫోన్ చేసింది. దీంతో హరీశ్ ఆమెను పూసూరు వద్ద ఉన్న ఓ రిసార్టుకు తీసుకెళ్లాడు. డిసెంబరు 2న అదే రిసార్టులోని గదిలో అనూష మరోసారి పెళ్లి ప్రస్తావన తీసుకురావడమే కాక పెళ్లి చేసుకోకపోతే చచ్చిపోతానని హరీశ్‌ను బెదిరించింది. ఈ క్రమంతో తీవ్ర ఒత్తిడికి లోనైన హరీశ్ తన సర్వీసు రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు తొలుత అనూషను ఆమె కుటుంబానికి అప్పగించారు. హరీశ్ పని ఒత్తిడి వల్ల ఆత్మహత్య చేసుకున్నాడని ముందు భావించినా, అనూషతో ప్రేమ వ్యవహారమే కారణమని దర్యాప్తులో గుర్తించారు. దీంతో అనూషను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: **N.Rahul Kumar.** Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, **Managing Director : Vemuri Radha Krishna** Founder: K.L.N.Prasad.